ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 03.08.2026 | సంపుటి : 13 సంచిక : 14 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


# ఇథనాల్ బ్లెండింగ్‌పై తకరారు

## దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనలు

- ఒక లీటర్ ఇథనాల్‌కు 1,500-3,000 లీటర్ల నీటి వినియోగం
- ఉత్పత్తి కేంద్రాల వ్యర్థాల నిర్వహణపై నిపుణుల హెచ్చరికలు
- పర్యావరణం, ప్రజారోగ్య ప్రభావాలపై సమగ్ర అధ్యయనాలు కోరుతున్న పర్యావరణవేత్తలు




పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో దాని పర్యావరణ, నీటి వినియోగం, ప్రజారోగ్య ప్రభావాలపై దేశవ్యాప్తంగా చర్చ మళ్లీ ఊపందుకుంది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, విదేశీ చమురు దిగుమతులను నియంత్రించడం, రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు కల్పించడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్‌ను ప్రోత్సహిస్తున్నప్పటికీ, దీని విస్తరణతో తలెత్తే పర్యావరణపరమైన సవాళ్లపై శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, ప్రజారోగ్య పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పలు అధ్యయనాల ప్రకారం, ఒక లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి మొత్తం జీవచక్రంలో (చెరకు, మొక్కజొన్న వంటి పంటల సాగుతో సహా) సుమారు 1,500 నుంచి 3,000 లీటర్ల నీరు వినియోగమవుతోంది. ఇందులో అత్యధిక నీరు పంటల సాగుకే అవసరమవుతుండగా, పరిశ్రమలో ప్రాసెసింగ్‌కు సగటున 4 నుంచి 10 లీటర్ల నీరు మాత్రమే వినియోగమవుతుందని నిపుణులు వివరిస్తున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్న, నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఇంధన పంటల సాగు విస్తరించడం వల్ల జల వనరులపై అదనపు ఒత్తిడి ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇథనాల్ ఉత్పత్తికి ప్రధాన ముడి పదార్థంగా చెరకు, మొలాసిస్, మొక్కజొన్నను వినియోగిస్తున్నారు. వీటిలో ముఖ్యంగా చెరకు అత్యధిక నీటిని వినియోగించే పంటల్లో ఒకటి. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా చెరకు సాగు విస్తరిస్తే భూగర్భ జలాల మట్టం మరింత దిగజారే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో తాగునీటి అవసరాలు, సంప్రదాయ ఆహార పంటల సాగుపైనా ప్రభావం పడవచ్చని అభిప్రాయపడుతున్నారు.

### వాహనాల ఉద్గారాలపై పరిశోధనలు

ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని వినియోగించే వాహనాల నుంచి ఫార్మాల్డిహైడ్, ఎసిటాల్డిహైడ్ వంటి ఆల్డిహైడ్ వాయువుల ఉద్గారాలు పెరిగే అవకాశం ఉందని కొన్ని శాస్త్రీయ పరిశోధనలు సూచించాయి. అయితే ఇవి వాహనం రకం, ఇంజిన్ సాంకేతికత, ఉద్గార నియంత్రణ వ్యవస్థలు, ఇంధన మిశ్రమ శాతం వంటి అంశాలపై ఆధారపడి మారవచ్చని కూడా పరిశోధకులు పేర్కొంటున్నారు. ఫార్మాల్డిహైడ్‌ను అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ మానవుల్లో క్యాన్సర్‌కు కారణమయ్యే పదార్థంగా వర్గీకరించింది. అందువల్ల భారత పరిస్థితులకు అనుగుణంగా దీర్ఘకాలిక ప్రజారోగ్య అధ్యయనాలు నిర్వహించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### సమగ్ర అధ్యయనాలే పరిష్కారం

ఇథనాల్ తయారీకి మొక్కజొన్న, బియ్యం వంటి పంటల వినియోగం పెరిగితే భవిష్యత్తులో ఆహార ధాన్యాల లభ్యత, ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ భూములు ఆహార పంటల నుంచి ఇంధన పంటల వైపు మళ్లితే ఆహార భద్రతపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుందా అనే అంశంపై సమగ్ర పరిశోధనలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంధన భద్రత కోసం ఇథనాల్ బ్లెండింగ్ అవసరమేనని అంగీకరిస్తూనే, నీటి వినియోగం, వ్యవసాయ భూముల వినియోగ మార్పులు, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, వాహనాల ఉద్గారాలు, ప్రజారోగ్య

మిగతా 2లో..

### వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రమాదకరం

ఇథనాల్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వెలువడే 'స్పెంట్ వాష్' వంటి అధిక సేంద్రీయ లోడుతో కూడిన ద్రవ వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేయకపోతే భూగర్భ జలాలు, చెరువులు, వాగులు, వ్యవసాయ భూములు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లు నిర్దేశించిన ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయకపోతే పరిసర ప్రాంతాల జీవవైవిధ్యంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

# యువత మత్తు వదలాలి

- ప్రధాని మోడీ హితవు
- న్యూఢిల్లీలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 100 వారాల జాతీయస్థాయి కార్యక్రమం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నూతన కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' పేరుతో సాగే 100 వారాల జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ఆదివారం ప్రధాని మోదీ న్యూఢిల్లీలో ప్రారంభించారు. దేశ యువత మాదకద్రవ్యాల వినియోగాన్ని వీడాలని, డ్రగ్ ఫ్రీ ఇండియా నిర్మాణంలో పాలుపంచుకోవాలని యువతను మోదీ కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తామని ప్రధాని అన్నారు. దేశాభివృద్ధికి, లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు మానసికంగా, శారీరకంగా దృఢత్వం కలిగిన యువత అవసరమని మోదీ అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో..

ఈ నెల 5న..

# సీజేపీ కీలక భేటీ

## భవిష్యత్ కార్యచరణపై విద్యార్థులు, వాలంటీర్ల నుంచి అభిప్రాయ సేకరణ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నివాసంలో (మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్) ఈ నెల 5న కోర్ కమిటీ సమావేశం జరగనుంది. వాలంటీర్లు, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి సమావేశానికి రావాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. అనంతరం విలేకరుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి దీప్కే ఆదివారం వేడుకలు నిర్వహించారు. నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ప్రధాన



కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ. 7.5 కోట్లతో టెండర్‌ను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లు స్వీకరించనుంది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.

# లష్కర్ బోనాల్లో రేవంత్

## జగత్ జననిని దర్శించుకున్న ముఖ్యమంత్రి

సికింద్రాబాద్‌లో లష్కర్ బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సీఎంకు నిర్వాహకులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. సీఎంతో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నంలు ఉన్నారు.



# యువతను సీఎం రేవంత్ అవమానించాడు



వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాల్సిందే : కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** విద్యావంతులైన యువతను సీఎం అవమానించారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డితో బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేటీఆర్

మిగతా 2లో..

# ఫెర్రీలో మంటలు చెలరేగి..

పలువురి మృతి

ఇండోనేషియాలో ఘోర విషాదం



2లో..



# ఇరాన్‌పై ఇక దాడులుండవు

## రాజీ కుదిరిందన్న అమెరికా

**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్‌పై యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ దేశంపై తలపెట్టిన సైనిక దాడి ప్రణాళికలను రద్దు చేసుకోనున్నట్లు వెల్లడించారు. హర్మూజ్ ను తిరిగి పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు ముప్పును అంతం చేయడం వంటి అంశాలతో కూడిన ప్రతిపాదిత ఒప్పందాన్ని ఖరారు చేయడానికి మరింత సమయం కావాలని ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాలు కోరినట్లు వెల్లడించారు. ఒప్పందం వేగంగా ఖరారైతేనే అమెరికా దాడులకు విరామం కొనసాగుతుందని పేర్కొన్నారు.'రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ చూడని స్థాయిలో సైనిక శక్తితో ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా సన్నద్ధంగా ఉంది. మేం కొట్టే దెబ్బకి ఇక భరించలేమని వారు మమ్మల్ని వేడుకుంటారు. అయినప్పటికీ టెహ్రాన్‌పై దాడులు నిలిపివేయాలని నిర్ణయించుకున్నాను. ఒప్పందంలోని అంశాలపై ఒక అవగాహనకు వచ్చినందున దాడులను నిలిపివేయాలని ఇరాన్ సహా, గల్ఫ్ దేశాలు మమ్మల్ని



కోరాయి. దీంతో ప్రపంచ ప్రయోజనాలను.. ఇరాన్ మనుగడను దృష్టిలో పెట్టుకొని దాడులను తాత్కాలికంగా ఆపివేస్తున్నాం. యుద్ధాన్ని ముగించి.. ఇరాన్‌తో ఒప్పందం చేసుకోవడానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కూడా అంగీకరించారు' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై ఇజ్రాయెల్ ఎలాంటి బహిరంగ ప్రకటనా చేయలేదు.

మిగతా 2లో..

# ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం

- బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు
- తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్గొండ బ్యూరో(జనంసాక్షి):** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్బీసీ) సొరంగం పనులను పూర్తి చేయడమే తన లక్ష్యమని మంత్రి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్ఎల్బీసీ ద్వారా రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు అందజేస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. నల్లగొండ మండలం కంచనపల్లిలో కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. దీనిని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు. దోమలపల్లిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని, వారానికి రెండు రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని మంత్రి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఓటర్లకు ఓ కండిషన్..వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తన

మిగతా 2లో..

# తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నాం

## 2047 నాటికి ఐ3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం

### అమెరికా ఐఓసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**వాషింగ్టన్(జనంసాక్షి):** తెలంగాణలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర రూపురేఖలను మారుస్తూ ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా జరిగిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని

మిగతా 2లో..



## ఇథనాల్ బ్లెండింగ్‌పై తకరారు


ప్రభావాలపై దేశవ్యాప్తంగా స్వతంత్ర, దీర్ఘకాలిక శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. అదే సమయంలో ఇథనాల్ ఉత్పత్తి కేంద్రాలపై కఠిన పర్యావరణ పర్యవేక్షణ, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతికతల ప్రోత్సాహం, కాలుష్య నియంత్రణ ప్రమాణాల కఠిన అమలు ద్వారానే ఇంధన భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను సమన్వయం చేయవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

## ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం



నియోజకవర్గ ఓటర్లకు ఓ కండిషన్ పెట్టారు. వచ్చే ఎన్నికల్లో తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మాట ఇస్తేనే తాను పోటీలో ఉంటానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఒకవేళ స్పష్టమైన హామీ రాకుంటే అసలు ఎన్నికల ప్రక్రియ నుంచే తప్పుకుంటానని ప్రకటించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీశారు.

## ఇరాన్‌పై ఇక దాడులుండవు



ఈ వారాంతంలో తమ దేశంపై ఎలాంటి సైనిక చర్యలకు పాల్పడవద్దని ఇరాన్ శనివారం అమెరికాను హెచ్చరించింది. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు పాల్పడితే తమ ప్రతీకారం తీవ్రంగా ఉంటుందని పేర్కొంది. సౌదీ అరేబియా, యూఏఈలోని చమురు క్షేత్రాలతో పాటు ఖతార్, ఇజ్రాయెల్‌లోని గ్యాస్ క్షేత్రాలను బూడిద చేస్తామంది. ఈ క్రమంలోనే అమెరికా నుంచి తాజా ప్రకటన వెలువడింది. మరోవైపు ఒప్పందంలోని అంశాలపై ఖతార్, పాకిస్థాన్ విడివిడిగా అమెరికా, ఇరాన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

## 60 ఏళ్లుగా భారత్‌లోనే చైనా సైనికుడు..

**కుల ధ్రువీకరణ కోసం పోరాటం**

బోపాల్:మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా తిరోడిలో 60 ఏళ్లుగా భారత్‌లోనే నివసిస్తున్న చైనాకు చెందిన మాజీ సైనికుడి కుటుంబం ఇప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమస్యను ఎదుర్కుంటోంది. స్థానిక ప్రభుత్వం నుంచి కుల ధ్రువీకరణ పత్రం పొందడం ఆ కుటుంబానికి పెద్ద సవాల్‌గా మారింది. దీనిపై వాంగ్ కీ కుమారుడు విష్ణు వాంగ్ మాట్లాడుతూ.. "మేం ఇక్కడే పుట్టాం. మేమే భారతీయులమే. అయితే మాకు ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించకుంటే మమ్మల్ని తిరిగి చైనాకే పంపించేయండి. మా నాన్నకు ఇప్పుడు 86 ఏళ్లు. తన జీవితంలో ఎక్కువ భాగం ఇక్కడే గడిపాడు. నా కుమార్తెకు ఇప్పుడు 14 ఏళ్లు. కుమారుడు థర్డ్ గ్రేడ్ చదువుతున్నాడు. మా పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాల కోసం సమస్యలు ఎదుర్కొంటున్నాం. చట్టపరంగానే దరఖాస్తు చేసినప్పటికీ మా తండ్రి చైనీయుడు కావడం వల్ల ఇబ్బందిగా మారింది. తండ్రి కులం ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. మా తండ్రికి సంబంధించిన సరైన వివరాలు డాక్యుమెంట్లలో లేవు. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. డబ్బులు పెట్టి కోర్టుల చుట్టూ తిరగలేం' అని విష్ణు వాంగ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

గోదారి ఉధృతి.. లంక గ్రామాల్లోకి నీరు

1962 ఇండియా-చైనా యుద్ధ సమయంలో గూఢచర్యం కేసులో అరుణాచల్ ప్రదేశ్‌లో వాంగ్ కీని భారత బలగాలు అరెస్టు చేశాయి. అనంతరం అతడిని పలు జైళ్లలో ఉంచారు. ఏడేళ్ల జైలు శిక్ష అనంతరం వాంగ్ కీ 1969లో విడుదల అయ్యారు. అనంతరం అతడు మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా తిరోడిలో ఉండిపోయాడు. పిండిమిల్లు నడుపుకుంటూ స్థానిక మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు జన్మించగా, వారికి సైతం పెళ్లిళ్లు జరిగి పిల్లలు పుట్టారు.

## తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నాం

తెలంగాణను 2047 నాటికి ౩ ట్రిలియన్ డాలర్లు, రాబోయే ఐదేళ్లలో ౧ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047'విజన్ ప్లాన్‌ను అమలు చేస్తోందని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా నాలుగో మహానగరంగా ముచ్చర్ల ప్రాంతంలో కాలుష్య రహిత నెట్-జీరో ప్రమాణాలతో 'భారత్ ఫ్యూచర్ సిటీ' ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్ పెరి-అర్బన్ రూరల్ అగ్రి అని మూడు ఆర్థిక మండలాలుగా వర్గీకరించి వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

**'యంగ్ ఇండియా'తో విద్యా రంగంలో విప్లవం**

యువతను అంతర్జాతీయ స్థాయి నిపుణులుగా మార్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని వెల్లడించారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నెలకొల్పామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు.టాటా గ్రూప్ భాగస్వామ్యంతో రూ. 2,100 కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను (ఎీఎబ) హైటెక్ డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే మోడల్‌గా 'తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించామన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహార 'బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం 'మధ్యాహ్న భోజన' సౌకర్యాన్ని విస్తరించామన్నారు.

**ఆక్రమణలపై 'హైడ్రా' ఉక్కుపాదం..**

హైదరాబాద్ మహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు 'హైడ్రా' వ్యవస్థను తీసుకొచ్చామని, ప్రకృతి వనరులను కాపాడేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా మూసీ నదిని శుద్ధి చేసి, పర్యాటక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టామని వెల్లడించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక విచ్ఛిన్నతకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ తీరు వల్ల గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 15 నుంచి 25వ తేదీ వరకు జీతాలు రాని పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటించి, విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందని తెలిపారు. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని ప్రకటించారు. అంతేకాకుండా, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు.ఆరు గ్యారెంటీలతో సుపరిపాలన ఎన్నకల్లో ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో వేగంగా అమలు చేస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి నిర్ణయాలు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపాయని వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయమే పునాదిగా సాగుతున్న తెలంగాణ పునర్నిర్మాణంలో విదేశాల్లో ఉన్న తెలుగు ఎన్ఆర్ఐలు, ఐఓసీ ప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు.రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలిరీజినల్ రింగ్ రోడ్డు వేగవంతం చేయడం, మెట్రో రైలు రెండో దశ విస్తరణతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా రాబట్టడం వల్ల తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు టి రామ్మోహన్ రెడ్డి రాకేష్ రెడ్డి, కాలే యాదయ్య, దొంతి మాధవరెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హనుమాన్ల ఝాన్సీ రెడ్డి, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## యువత మత్తు వదలాలి

'జన్ భాగిదారి' పేరుతో మొదట 100 వారాల ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. దీనిలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పలు స్పోర్ట్ ఈవెంట్‌లు, వాకథాన్స్, మెడిటేషన్ క్యాంపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, వీధి నాటకాలు, చర్చలు, ఆర్ట్ కాంపిటీషన్స్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ వంటివి నిర్వహిస్తారు. డ్రగ్స్ వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాల్ని వివరిస్తారు. వ్యక్తులు, కుటుంబాలు, సమాజం, దేశం అంతా కలిసి సంయుక్తంగా డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కోవాలని మోదీ పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం విషయంలో అప్రమత్తంగా, బాధ్యతగా ఉండాలని మోదీ కోరారు. డ్రగ్స్ రహిత భారత దేశం కోసం రాబోయే 100 ఆదివారాలు, 100 కీలక నిర్ణయాలు, చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల తాత్కాలిక శక్తి లభిస్తుందని, కానీ, వీటివల్ల కెరీర్లు, కుటుంబాలు నాశనం అవుతాయని ఆయన పేర్కొన్నారు.డ్రగ్స్‌కు బానిసై కోరుకుంటున్న వారిపై వివక్ష చూపకూడదని, వారికి తగిన గౌరవం ఇచ్చి, జీవితంలో ఎదిగేందుకు ఇంకో అవకాశం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కుటుంబ సభ్యులు ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలుగా మారితే, సమాజం ఏమనుకుంటుందో అనే భ్రమతో ఆ విషయాన్ని దాచిపెట్టకూడదని కూడా ప్రధాని సూచించారు. దీని బదులు వారికి వైద్య సహాయం అందించి, ఆ అలవాటు నుంచి బయటపడేలా చేయాలని కోరారు. డ్రగ్స్ సరఫరా చేసే వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిరంతరం కోట్లాది రూపాయల విలువైన డ్రగ్స్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని వెల్లడించారు.

## ఫెర్రీలో మంటలు చెలరేగి..

జకార్తా(జనంసాక్షి):ఇండోనేషియా లోని మదురా ద్వీపం సమీపంలో ఓ ఫెర్రీలో మంటలు అంటుకున్నాయి ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. 41మంది ఆచూకీ గల్లంతయ్యింది. 225 మందిని కాపాడినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో అందులో సుమారు 271 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. సురబయలోని తంజుంగ్ పెరాక్ పోర్ట్ నుంచి మకాసర్‌కు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ప్రయాణం ప్రారంభమైన కొన్ని గంటల తర్వాత మంటలు చెలరేగినట్లు ఫెర్రీ కెప్టెన్ సమాచారం అందించారని.. ఆ తర్వాత కొద్దిసేపటికే దానితో సంబంధాలు తెగిపోయాయని అధికారులు తెలిపారు. నౌక మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులోని ప్రయాణికులు ఫెర్రీ ముందు భాగానికి వచ్చి.. సాయం కోసం హాహాకారాలు చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అగ్నిప్రమాదానికి గల కారణం తెలియరాలేదు.



## లష్కర్ బోనాల్లో రేవంత్

జగత్ జననిని దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి


**గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్**

**విజయవాడ:** ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 10 వేల ప్రాంతాల నుంచి పాల్గొన్న కోటి మందికి పైగా యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, 'నషా ముక్త్ భారత్' (మాదకద్రవ్య రహిత భారత్) సాధనకు మద్దతివ్వాలని యువతకు అయన సూచించారు. దేశ యువతను ఏకం చేసి, వారిని మాదకద్రవ్య రహిత, ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ ప్రచార కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని గవర్నర్ తెలిపారు. డ్రగ్స్ వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, చదువులో వెనుకబడతారని, సమాజానికి దూరమవుతారని హెచ్చరించారు. వ్యసనాల బారిన పడిన యువత వల్ల వారి కుటుంబాలు మానసికంగా, ఆర్థికంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## వాషింగ్టన్‌లో కార్చిచ్చు..

**రెడ్ ఫ్లాగ్ హెచ్చరిక జారీ**





వాషింగ్టన్(జనంసాక్షి):వాతావరణ మార్పుల వల్ల అమెరికా, కెనడాలలో కార్చిచ్చులు కొనసాగుతూనే ఉన్నాయి. వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతంలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. మంటల వల్ల 4,50,000 ఎకరాలు బూడిదయ్యాయి. అవి సమీప నగరాలకు కూడా వ్యాపిస్తుండడంతో.. మంటలను అదుపులోకి తీసుకురావడానికి నాలుగు వేల మంది అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారు. తూర్పు వాషింగ్టన్‌లో సుమారు 2,30,000 మంది నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం మూడు వేల ఎకరాల్లో అగ్నికీలలు చురుగ్గా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బలమైన గాలులు వీస్తుండడం వల్ల మంటలు అదుపు చేయడం సవాలుగా మారింది.శనివారం మధ్యాహ్నం అగ్నికీలలు చెలరేగాయని అధికారులు పేర్కొన్నారు. వాషింగ్టన్‌లోని సుమారు 4 వేల నివాసాలకు ముప్పు పొంచి ఉందన్నారు. స్పోకేన్ ప్రాంతంలో మంటలు విస్తరిస్తుండడంతో.. 200 ఇళ్లు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులను ఖాళీ చేయించినట్లు మేయర్ లిసా బ్రౌన్ తెలిపారు. 5 కోట్ల మందికి పైగా అమెరికన్లపై కార్చిచ్చు ప్రభావం ఉంటుందన్నారు. అగ్నికీలలు వేగంగా విస్తరిస్తుండడంతో.. తూర్పు వాషింగ్టన్ సహా పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 8గంటల వరకు (స్థానిక కాలమానం ప్రకారం) జాతీయ వాతావరణ కేంద్రం రెడ్ ఫ్లాగ్ హెచ్చరికను జారీ చేసింది.

## యువతను సీఎం రేవంత్ అవమానించాడు

ఘాటుగా లేఖ రాశారు.హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలు మరియు ఉద్యోగ అవకాశాలపై జరిగిన చర్చా కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం దాదాపు 1.1 లక్షల మంది ఇంజనీరింగ్ పూర్తి చేసి బయటకు వస్తున్నారని, కానీ అందులో కొందరికి కనీసం ఉద్యోగ దరఖాస్తు ఫారం పూరించడం కూడా రావడం లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి "క్రిమినల్ వేస్ట్" అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకోవడం ఇది మొదటిసారి కాదని, గతంలో కూడా యువతను "బీర్ అండ్ బిర్యానీ బ్యాచ్" అని, "థగ్స్" అని సంబోధిస్తూ అవహేళన చేశారని కేటీఆర్ ఆరోపించారు.ఈ మొత్తం వ్యవహారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీనే రాజకీయంగా, నైతికంగా బాధ్యత వహించాలని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు. తెలంగాణ యువత ఓట్లను అభ్యర్థించిన కాంగ్రెస్ ప్రధాన ప్రచారకర్తగా, రేవంత్ రెడ్డిని స్వయంగా ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టిన వ్యక్తిగా రాహుల్ గాంధీ దీనికి జవాబుదారీగా ఉండాలని పేర్కొన్నారు. బయట వేదికలపై రాజ్యాంగ నైతికత, ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే రాహుల్ గాంధీ, సొంత పార్టీ ముఖ్యమంత్రి విద్యార్థులను అవమానిస్తుంటే మౌనంగా ఉండటం ఉద్దేశపూర్వక రాజకీయ వ్యూహమేనని విమర్శించారు.దేశ సాంకేతిక ప్రగతికి, విప్లవాత్మక మార్పులకు ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల కఠోర కృషితో కూడిన సమర్థతే కారణమని కేటీఆర్ కొనియాడారు. నవభారత నిర్మాణ శిల్పులైన యువతను ప్రోత్సహించి గౌరవించాల్సింది పోయి ఇలా నిందించడం ఏమాత్రం తగదని హితవు పలికారు. ఈ లేఖతో తెలంగాణలో కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్య మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. నిరుద్యోగ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్, సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తూ ముందుకు వెళ్తోంది.మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 100 వారాల జాతీయస్థాయి కార్యక్రమం.. ప్రారంభించిన ప్రధాని మోదీ

దేశంలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నూతన కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' పేరుతో సాగే 100 వారాల జాతీయస్థాయి కార్యక్రమాన్ని ఆదివారం ప్రధాని మోదీ న్యూఢిల్లీలో ప్రారంభించారు.దేశ యువత మాదకద్రవ్యాల వినియోగాన్ని వీడాలని, డ్రగ్ ఫ్రీ ఇండియా నిర్మాణంలో పాలుపంచుకోవాలని యువతను మోదీ కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రతివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తామని ప్రధాని అన్నారు.దేశాభివృద్ధికి, లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు మానసికంగా, శారీరకంగా ధృడత్వం కలిగిన యువత అవసరమని మోదీ అభిప్రాయపడ్డారు. 'జన్ భాగిదారి' పేరుతో మొదట 100 వారాల ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. దీనిలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పలు స్పోర్ట్ ఈవెంట్‌లు, వాకథాన్స్, మెడిటేషన్ క్యాంపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, వీధి నాటకాలు, చర్చలు, ఆర్ట్ కాంపిటీషన్స్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ వంటివి నిర్వహిస్తారు. డ్రగ్స్ వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాల్ని వివరిస్తారు. వ్యక్తులు, కుటుంబాలు, సమాజం, దేశం అంతా కలిసి సంయుక్తంగా డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కోవాలని మోదీ పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం విషయంలో అప్రమత్తంగా, బాధ్యతగా ఉండాలని మోదీ కోరారు. డ్రగ్స్ రహిత భారత దేశం కోసం రాబోయే 100 ఆదివారాలు, 100 కీలక నిర్ణయాలు, చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల తాత్కాలిక శక్తి లభిస్తుందని, కానీ, వీటివల్ల కెరీర్లు, కుటుంబాలు నాశనం అవుతాయని ఆయన పేర్కొన్నారు.డ్రగ్స్‌కు బానిసై కోరుకుంటున్న వారిపై వివక్ష చూపకూడదని, వారికి తగిన గౌరవం ఇచ్చి, జీవితంలో ఎదిగేందుకు ఇంకో అవకాశం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కుటుంబ సభ్యులు ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలుగా మారితే, సమాజం ఏమనుకుంటుందో అనే భ్రమతో ఆ విషయాన్ని దాచిపెట్టకూడదని కూడా ప్రధాని సూచించారు. దీని బదులు వారికి వైద్య సహాయం అందించి, ఆ అలవాటు నుంచి బయటపడేలా చేయాలని కోరారు. డ్రగ్స్ సరఫరా చేసే వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిరంతరం కోట్లాది రూపాయల విలువైన డ్రగ్స్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని వెల్లడించారు.

### పరీక్షల్లో అవకతవకలు..

## ఆ 158 కేసులపై సీబీ'ఐ'

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

నియామక పరీక్షల్లో అవకతవకలపై దేశవ్యాప్తంగా అనేక కేసులను సీబీఐ దర్యాప్తు చేస్తోన్న సంగతి తెలిసిందే. వీటికి సంబంధించి ప్రస్తుతం 158 కేసుల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ.. వివిధ కోర్టుల్లో అవి విచారణ దశలోనే ఉండిపోయినట్లు తెలిసింది. వీటిలో కొన్ని 20ఏళ్ల నాటి కేసులు ఉండటం గమనార్హం. దీంతో.. వీటిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేయాలని అన్ని హైకోర్టులను ఆశ్రయించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.నీట్ పేపర్ లీక్ దోషులను శిక్షించడం, పరీక్షల్లో సంస్కరణలను డిమాండ్ చేస్తూ ఇటీవల ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఈ నేపథ్యంలో సంబంధిత చట్టంలో మార్పులు చేసిన కేంద్ర ప్రభుత్వం.. నిర్దిష్ట సమయంలో కేసుల విచారణ పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించింది. దీంతో అనేక రాష్ట్రాలు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలో సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసుల విచారణ సాధ్య మైనంత త్వరగా ముగించేందుకు సీబీఐ చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన ప్రత్యేక ప్రాసిక్యూటర్లను నియమించడంతోపాటు అవసరమైన అన్ని వనరులను అందుబాటులో ఉంచుతామని హైకోర్టులకు తెలియజేయాలని నిర్ణయించినట్లు సమాచారం. నియామక పరీక్షల్లో అవకతవకలకు సంబంధించి దేశ రాజధానిలోనే 2000 నుంచి దాదాపు 25 కేసులు విచారణ దశలో ఉన్నట్లు తెలిసింది. వీటిలో ఎయిమ్స్ పీజీ నియామక పరీక్ష 2010-11, ఢిల్లీ యూనివర్సిటీ మెడికల్, డెంటల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2011, క్యాట్ 2004, ఎస్ఎస్‌సీ 2013, టీచర్స్ రిక్రూట్‌మెంట్ సంబంధిత కేసులు ఉన్నట్లు తెలిసింది. తమిళనాడు, బెంగాల్, యూపీ, రాజస్థాన్, బిహార్, ఝార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలోనూ అనేక కేసులు పెండింగులోనే ఉండిపోయాయి.

## నన్ను చంపేందుకు యత్నించారు!

**పప్పూ యాదవ్**

**పాట్నా:**బిహార్ ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడికి యత్నించాడు. దీంతో ఎంపీ అనుచరులు అతడిని పట్టుకుని చితకబాదారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీలోని తన నివాసంలో పప్పూ యాదవ్ ప్రెస్ మీట్ నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. దుండగుడు కత్తితో తన ఇంట్లోకి ప్రవేశించాడని, తన ప్రాణాలకు హాని తలపెట్టేందుకు యత్నించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. వారణాసిలో నమోదైన కేసుకు సంబంధించి దిల్లీలోని నివాసంలో పప్పూ యాదవ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతున్న సమయంలోనే ఓ వ్యక్తి లేచి నిలబడి.. ఎంపీ చర్యలు సరిగ్గా లేవని, రాముడిని అవమానించారంటూ మండిపడ్డారు. ఆ వెంటనే ఎంపీపైకి ఓ చెప్పును విసిరేశారు. వెంటనే అప్రమత్తమైన పప్పూ యాదవ్ అనుచరులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. విచారించగా యూపీలోని బులందషహర్‌కు చెందిన సుమిత్‌గా నిర్ధరించారు.

## పర్యాటకుల విమానం కూలి

**13 మంది మృతి**

నాజ్కా(జనంసాక్షి):పెరూలోని నాజ్కా నగర సమీపంలో పర్యాటకుల విమానం కుప్పకూలి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రఖ్యాత నాజ్కా లైన్స్‌ను ఆకాశం నుంచి చూడాలని వీరు విమానం ఎక్కారు. అయితే.. వీరి ప్రయాణం విషాదాంతంగా మారింది.మృతుల్లో ఇద్దరు జర్మనీ, ఇద్దరు స్పెయిన్, ఏడుగురు ఇటలీ, ఇద్దరు విమాన సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. సమీపంలోని ఇకా నగరం నుంచి నాజ్కా లైన్స్‌ను వీక్షించేందుకు విమానంలో ప్రయాణికులు బయలుదేరారు. పెరూ ఎడారి నేల మీద వేల ఏళ్ల కిందట చెక్కిన నాజ్కా లైన్స్‌ను ఆకాశం నుంచి చూడాలని ఆశతో వెళ్లిన వారికి అదే చివరి ప్రయాణంగా మారింది. బయలుదేరిన కొద్ది సేపటికే విమానం ఓ పొలంలో కుప్పకూలింది. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.



## హనుమకొండలో భార్యను హతమార్చిన భర్త

**కుటుంబ కలహాలతో కాళ్లు, చేతులు కట్టి మెడ కోసి దారుణ హత్య**



**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 2 (జనం సాక్షి) :** హనుమకొండ నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి 4వ డివిజన్ కృష్ణ కాలనీలో శనివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యను అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, నిందితుడు మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుమారు ఆరు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. అయితే కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ విభేదాలు కొనసాగుతున్నట్లు స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి భార్య కాళ్లు, చేతులు కట్టి, అనంతరం మెడ కోసి హత్య చేసినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు దారితీసిన అసలు కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోవడంతో వారి భవిష్యత్తుపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రేమతో ప్రారంభమైన దాంపత్య జీవితం చివరకు విషాదాంతంగా ముగియడం అందరినీ కలచివేసింది.

## 7న ఇందిరాపార్క్‌లో మహాధర్నా

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇ.నరసింహారెడ్డి

**హనుమకొండ (జనంసాక్షి) :** 7వ తేదీన ఇందిరాపార్క్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇ.నరసింహారెడ్డి తెలిపారు. హనుమకొండ లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ హనుమకొండ జిల్లా సమావేశపు హాలులో హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇ. నరసింహారెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఇ. నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము రెండు అక్టోబర్ 2023న పి. శివశంకర్ చైర్మన్గా పే రివిజన్ కమిషన్‌ను నియమించిందని, మూడు సంవత్సరాలు అయినా ఇంతవరకు పిఆర్సి రిపోర్టు సబ్మిట్ చేయకపోవడం ఉద్యోగులను పెన్షనర్లను బాధించడమేనని తెలిపారు. 5 డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, హెల్త్ కార్డ్స్ ఇంతవరకు మూడు నెలలుగా ఉద్యోగులు 1.5 శాతం కాంట్రిబ్యూషన్ చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డులు సక్రమంగా పని చేయకపోవడం దారుణమన్నారు. హెల్త్ కార్డులు అన్ని ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, మార్చి 2024 నుండి ఇప్పటివరకు రిటైర్డ్ అయిన పెన్షనర్లకు ఇంకా చెల్లించని వివిధ రకాల పద్దులను వెంటనే అందరికీ ఏకమొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక సమస్యలైన పిఆర్సి రిపోర్టు వెంటనే సబ్మిట్ చేసి అమలుపరచాలని, పెండింగ్లో ఉన్న ఐదు డి.ఏ.లు వెంటనే విడుదల చేయాలని, ఈ.హెచ్.ఎస్. కార్డ్స్ అన్ని ఆసుపత్రుల్లో అమలు అయ్యే విధంగా విడుదల చేయాలని, రిటైర్డ్ పెన్షనర్ల యొక్క పెండింగ్ బకాయిల బిల్లులన్నింటిని ఏక మొత్తంలో చెల్లించాలనే డిమాండ్ల సాధన కొరకు హైదరాబాదులోని ఇందిరా పార్కులో ఈనెల 7వ తేదీన మహాధర్నాను రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న మహాధర్నాలో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. వీరస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. పురుషోత్తం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు యం.ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు సూర్య ప్రకాష్ , రత్నాకర్, హనుమకొండ ఎస్.టి.ఓ. జనరల్ సెక్రెటరీ కందుకూరి దేవదాసు, ఎల్. ప్రభాకర్ రెడ్డి, కిష్టయ్య, సత్యనారాయణ, సుక్మారెడ్డి ,శ్యాంసుందర్ రెడ్డి, వెంకటేశం, జలందర్ తదితరులు వందమంది వరకు పాల్గొన్నారు.



## వాగు దాటించేందుకు గ్రామస్తులే ఆధారం

- ప్రాణాలకు ముప్పుగా మారిన రాకపోకలు..
- శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు

**కేరమెరి,ఆగస్టు2 (జనంసాక్షి) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమెరి మండలం అనార్పల్లి వాగు మరోసారి గ్రామీణ ప్రాంతాల దయనీయ పరిస్థితిని కళ్లకు కట్టింది. వాగుపై వంతెన లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని బోరిలాల్గూడ గ్రామానికి చెందిన భూరిబాయి తీవ్ర జ్వరంతో మంచం నుంచి లేవలేని పరిస్థితికి చేరుకుంది. ఆస్పత్రికి తరలించాల్సిన అవసరం ఏర్పడినా, ఉప్పొంగి ప్రవహిస్తున్న అనార్పల్లి వాగు అడ్డంకిగా మారింది. దీంతో ఆమె కుమారుడు, గ్రామస్తుల సహాయంతో భూరిబాయిని భుజాలపై మోసుకుంటూ వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. ఈ హృదయ విదారక దృశ్యాలు స్థానికులను కలచివేశాయి. గ్రామస్తుల కథనం ప్రకారం, ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, రోగులు, గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందక ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బ్రహ్మపుత్ర నదిలో మునిగి.. ఐఐటి గౌహతి విద్యార్థిని మృతి

**గౌహతి (జనంసాక్షి) :** ఐఐటి గౌహతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రమాదవశాత్తు జారి బ్రహ్మపుత్ర నదిలో పడ్డారు. ఒక విద్యార్థిని నదిలో మునిగి మరణించగా, మరో విద్యార్థినిని రెస్క్యూ సిబ్బంది రక్షించారు. అస్సాం రాజధానిలోని ఐఐటీ గౌహతిలో చదువుతూ క్యాంపస్ హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరు అమ్మాయిలు శనివారం కొంత సమయం బయట గడిపేందుకు లతియా బగీచా ఘాట్ వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో ఆ ఇద్దరు విద్యార్థినులు బ్రహ్మపుత్ర నదిలో పడ్డారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళానికి (ఎన్‌డిఆర్‌ఎఫ్) చెందిన సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఒక అమ్మాయిని పది నిమిషాల్లో రక్షించారు. మునిగిపోయిన మరో విద్యార్థిని కోసం గజ ఈతగాళ్ల సహాయంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు గంటల తర్వాత ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. మరోవైపు మరణించిన యువతి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగానికి చెందిన బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అని ఐఐటి గౌహతి యాజమాన్యం తెలిపింది. ఆమె అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసింది. తమ విద్యా సంస్థతో పాటు విద్యార్థిని కుటుంబానికి పూడ్చలేని నష్టమని పేర్కొంది.

## బోనాల నేపథ్యంలో 'పొన్నం' విందు

**తెలంగాణ వంటకాలతో ఆతిథ్యం!**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సికింద్రాబాద్ లష్కర్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల శుభసందర్భాన్ని పురస్కరించుకుని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన అధికారిక నివాసంలో ప్రత్యేక విందును వైభవంగా నిర్వహించారు. పండుగ వాతావరణంలో రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్కలతో పాటు ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు హాజరయ్యారు. వీరితో పాటు నేతలు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు విందులో పాల్గొని బోనాల శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**తెలంగాణ వంటకాలతో ఆతిథ్యం**

తెలంగాణ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ సందర్భంగా విచ్చేసిన అతిథులందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి పొన్నం తల్లి మల్లమ్మ, సతీమణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్‌లతో పాటు కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ముఖ్యమంత్రికి, మంత్రివర్గ సహచరులకు, ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## దేవాదులకు సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టాలి

- ఆటా మహాసభల్లో బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలకు, ఉద్యమ త్యాగాలకు శాశ్వత గుర్తింపుగా దేవాదుల ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని నాయకులు కోరారు. ఆటా మహాసభల్లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి బీఆర్ఎస్, ఎన్ఆర్ఐలు ఘన నివాళి అర్పించారు. అమెరికాలో జరుగుతున్న ఏటీఏ మహాసభల్లో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ఏ ఆధ్వర్యంలో సుదర్శన్‌రెడ్డి స్మారకార్థం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో తీవ్ర గాయాల పాలై ఒక కాలును, ఒక కన్నును కోల్పోయినప్పటికీ.. ఆయన ప్రజల కోసం, తెలంగాణ కోసం చివరి వరకు అంకితభావంతో పోరాడారని కొనియాడారు. అలాంటి త్యాగధనులను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని అన్నారు. అలాగే.. ఆయన స్వస్థల ప్రాంతంలో ఏర్పాటు కానున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఆయన పేరు పెట్టాలని కోరారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోని పక్షంలో భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టేలా చర్యలు తీసుకుంటామని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ఏ ఇన్‌చార్జ్ మహేష్ తన్నీరు, తిరుపతిరెడ్డి ఎర్రంరెడ్డి, చందు తాళ్లా, నరసింహ నాగులవంచ, రజనీకాంత్ కోసనం, మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, బాలమల్లు, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, పుట్ట మధు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'వీధి బతుకులు విస్థాపనలు', 'సజీవ స్మృతులు' పుస్తకావిష్కరణ




**హనుమకొండ (జనంసాక్షి) :** మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్. జీవన్‌కుమార్ రచించిన 'వీధి బతుకులు విస్థాపనలు', 'సజీవ స్మృతులు' పుస్తకాలను ఆవిష్కరించారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్ సెమినార్ హాల్లో ఆదివారం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన వక్త కల్పన కన్నభీరన్ మాట్లాడుతూ.. జీవన్‌కుమార్ రచించిన రెండు పుస్తకాల్లోని హక్కుల సమస్యలన్నీ రాజ్యాంగ స్ఫూర్తిని విస్తృత పరిధిలో వ్యాఖ్యానించినట్లు ఉన్నాయని తెలిపారు. దశాబ్దకాలంగా దేశంలో రాజ్యాంగ సంస్థలన్నీ తమ స్వతంత్రతను కోల్పోతున్నాయని కల్పన కన్నభీరన్ అన్నారు. విశ్వవిద్యాలయాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం కుల సమస్య, సామాజిక అణచివేత, స్త్రీలపై వివక్ష, మైనార్టీ మతస్థుల సమస్యలు.. వంటి అంశాలపైన పరిశోధనలకు అనుమతులు ఇవ్వడం లేదని ఆమె వాపోయారు. హిందూ రాజులు, హిందూ మతం గొప్పతనంపై మాత్రమే పరిశోధనలు కొనసాగాలని ఆంక్షలు విధిస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మాట్లాడుతూ.. జీవన్‌కుమార్ 30 ఏళ్ల మానవ హక్కుల కార్యచరణలో భాగంగా రాసిన సమస్యలు ఇప్పటికైనా పరిష్కారమైతే బాగుండునని అభిప్రాయపడ్డారు. సామాజిక సమస్యలను ప్రస్తావించే మాలాంటి వాళ్లపై అసభ్యకరమైన ట్రోల్స్ చేస్తున్నారని సుజాత వెల్లడించారు. అనంతరం రచయిత జీవన్‌కుమార్ సమావేశంలో తన అనుభవాలను పంచుకున్నారు. సామాజిక హక్కుల రంగాల్లో పనిచేసి అమరులైన వారి కుటుంబ సభ్యులు 'సజీవస్మృతులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, డాక్టర్ తిరుపతయ్యలు, వేమన వసంతలక్ష్మి, కాత్యాయని విద్మహే, దేవులపల్లి అమర్, కవయిత్రి విమల, మెట్టు రవీందర్లు, కే అనురాధ పాల్గొన్నారు.

## కుటుంబంలోని ముగ్గురు ఆత్మహత్య..

- ఆర్థిక ఇబ్బందులే కారణమని అనుమానం

**ముంబై (జనంసాక్షి) :** ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా మరణించారు. ఆ ఇంటి గదిలో ఒక సూసైడ్ నోట్‌ను పోలీసులు గుర్తించారు. దీంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పింప్రి ప్రాంతంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న 50 ఏళ్ల వినోద్ పిళ్లై, ఐఐఎం అహ్మదాబాద్‌లో కంప్యూటర్ సైన్స్ చదివాడు. ఆయన భార్య 45 ఏళ్ల సిర్జా ఒక స్కూల్‌లో కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నది. వారికి 19 ఏళ్ల కుమార్తె పూర్ణిమ ఉన్నది. శనివారం సిర్జా విధులకు హాజరుకాకపోవడం ఆమెను సంప్రదించేందుకు సహోద్యోగులు ప్రయత్నించారు. మొబైల్ కాల్స్‌కు స్పందించకపోవడంతో ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు ఆ ఇంటికి వెళ్లి చూడగా వినోద్, అతడి భార్య, కుమార్తె అచేతనంగా పడి ఉన్నారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. ఘటనా స్థలంలో ఒక సూసైడ్ నోట్‌తో పాటు సోడియం నైట్రేట్ ఉన్న డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్య సహాయం అందకముందే వినోద్ మరణించాడు. ఆయన భార్య సిర్జా, కుమార్తె పూర్ణిమకు ఐసీయూలో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. కొద్దిసేపటికే వారిద్దరు కూడా చనిపోయారు. వినోద్ ఆన్‌లైన్‌లో సోడియం నైట్రేట్ ఆర్డర్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ రసాయనాన్ని మండించడం వల్ల వెలువడిన పొగ వల్ల ఆ కుటుంబంలోని ముగ్గురూ ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ చర్యకు పాల్పడినట్లు, దీనికి మరెవరినీ బాధ్యులను చేయవద్దని వినోద్ ఆ లేఖలో రాసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆ కుటుంబం కొంతకాలంగా భారీ అప్పులతో సతమతమవుతున్నట్లు దర్యాప్తులో తెసిందని పోలీస్ అధికారి చెప్పారు. మూడేళ్ల క్రితం నెహ్రూ నగర్‌లోని తమ ఇంటిని అమ్ముకున్నారని, ఆ తర్వాత నుంచి మోర్వాడి ప్రాంతంలోని అద్దె ఇంటిలో నివసిస్తున్నట్లు స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## వరంగల్ నిట్‌లో ఇండస్ట్రీ కాన్‌క్లేవ్ కెరీర్ లాంచ్



**హనుమకొండ (జనంసాక్షి) :** ఎన్ఐటీలోని 'ఇండస్ట్రీ కాన్ క్లేవ్: కెరీర్ లాంచ్ సమ్మిట్-2026' నిర్వహించారు. సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. నిట్‌లో ఈ తరహాలో నిర్వహించిన మొట్టమొదటి ఇండస్ట్రీ కాన్‌క్లేవ్‌గా నిలిచిన కార్యక్రమం ఇదే. త్వరలో నిట్ క్యాంపస్‌లో జరుగబోయే ప్లేస్‌మెంట్ సీజన్‌కు ముందు విద్యార్థులకు పరిశ్రమల అంచనాలు, అవసరమైన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు 'ఇండస్ట్రీ కాన్ క్లేవ్: కెరీర్ లాంచ్ సమ్మిట్-2026'ను రూపొందించారు. ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి.. ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. సీసీపీడీ బృందం రూపొందించిన సదస్సు ద్వారా విద్యార్థులు చురుకుగా పాల్గొని పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని ప్రయోజనం పొందాలని ఆయన ఆకాంక్షించారు. సీసీపీడీ హెడ్ ప్రొఫెసర్ పి.వి.సురేష్ ఈ కాన్‌క్లేవ్ నిర్వహణ లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ సమ్మిట్‌లో హెచ్‌పీసీఎల్, ఎక్సాన్ మొబిల్, మైక్రోన్, ట్రూవెటా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొని లీడర్ షిప్ టాక్స్, ప్యానెల్ చర్చలు, అలుమ్ని ఇంటరాక్షన్ కార్యక్రమాలు నిర్వహించారు. కోర్ ఇంజినీరింగ్, కన్సల్టింగ్, సెమీకండక్టర్, ఎనర్జీ, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై వారు విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.

## రైతులను కులం పేరుతో దూషించారంటూ ఎఫ్ఆర్ఓపై ఫిర్యాదు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన రైతుల డిమాండ్...

**కడెం, ఆగస్టు 2 (జనంసాక్షి) :** కడెం మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో అటవీ హక్కు పత్రాలు కలిగి పోడు సాగు చేస్తున్న గిరిజన రైతులను అటవీ అధికారులు వ్యవసాయం చేయనివ్వకుండా ట్రాక్టర్‌ను రేంజ్ కార్యాలయానికి తరలించారని రైతులు ఆరోపించారు. ఈ విషయమై ఆదివారం ఉడుంపూర్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి వెళ్లి స్థానిక ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ప్రశ్నించగా, ఆయన కనీస మర్యాద పాటించకుండా కులం పేరుతో దూషించారని రైతులు ఆరోపించారు. "మీ జాతి మారదు", "మీకు ఇష్టం వచ్చిన వారికి చెప్పండి", "ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నాకు భయం లేదు", "మళ్లీ కార్యాలయానికి వస్తే సిబ్బందితో బయటకు గెంటిస్తాను" అంటూ దురుసుగా మాట్లాడినట్లు వారు తెలిపారు. దీంతో ఉడుంపూర్ గ్రామ సర్పంచ్ జొన్నల చంద్రశేఖర్ గుప్త ఆధ్వర్యంలో పోడు సాగు చేస్తున్న గిరిజన రైతులు, గ్రామస్తులు కడెం ఎస్సై సాయికిరణ్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి గిరిజన రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉడుంపూర్ పోడు సాగు గిరిజన రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నారిని చెరువులో ముంచి చంపిన తల్లి..!

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎల్బీనగర్ సమీపంలోని బైరామల్‌గూడలో మాతృత్వానికి మచ్చ తెచ్చింది ఓ తల్లి. నవమాసాలు మోసి కన్న పసిగుడ్డును కర్కశంగా చెరువులో ముంచి చంపేసిందో మహిళ. ఈ ఘటన ఆదివారం సాయంత్రం సుమారు 6:30 గంటలకు జరిగింది. మృతి చెందిన పాపాయిని 9 నెలల లోకసాని అనురాధగా గుర్తించారు. నిందితురాలైన తల్లి పేరు లోకసాని రాజేశ్వరి (34). బైరామల్‌గూడలో 9 నెలల చిన్నారి ప్రాణాలు తీసిందో కన్నతల్లి. ఇంజాపూర్‌లో నివసించే లోకసాని రాజేశ్వరీ అభశుభం తెలియని చిన్నపాపాయిని చెరువులో ముంచి చంపేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని.. పోస్టుమార్టం కోసం చిన్నారి మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కన్నబిడ్డనే అమానుషంగా హత్య చేసిన రాజేశ్వరీ.. మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు హత్యకు దారితీసిన కారణాలు తెలుసుకునేందుకు ఆమెను విచారిస్తున్నారు.

## వాషింగ్టన్ అటవీ ప్రాంతంలో కార్చిచ్చు..

**వాషింగ్టన్ (జనంసాక్షి) :** వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతంలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. మంటలవల్ల 4.50 లక్షల ఎకరాల నేలపై చెట్లు కాలి బూడిదయ్యాయి. ఆ మంటలు సమీప నగరాలకు కూడా వ్యాపిస్తుండడంతో.. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి నాలుగు వేల మంది అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారు. తూర్పు వాషింగ్టన్‌లో సుమారు 2.30 లక్షల మంది నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం మూడు వేల ఎకరాల్లో అగ్నికీలలు చురుగ్గా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బలమైన గాలులు వీస్తుండడంవల్ల మంటలను అదుపు చేయడం సవాల్‌గా మారింది. శనివారం మధ్యాహ్నం అగ్నికీలలు చెలరేగాయని అధికారులు తెలిపారు. వాషింగ్టన్‌లోని సుమారు 4 వేల నివాసాలకు ముప్పు పొంచి ఉందన్నారు. స్పోకేన్ ప్రాంతంలో మంటలు విస్తరిస్తుండడంతో.. 200 ఇళ్లు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులను ఖాళీ చేయించినట్లు మేయర్ లిసా బ్రౌన్ తెలిపారు.

# క్షేత్రస్థాయికి కాక్రోచ్ ఉద్యమం
# జెన్-జీపై దేశం గంపెడాశలు

సంపాదకీయం

భారత రాజకీయాల్లో ఒక కొత్త దశ ప్రారంభమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎన్నో దశాబ్దాలుగా కులం, మతం, ప్రాంతం, వ్యక్తి ఆరాధన చుట్టూ తిరిగిన రాజకీయ చర్చను ఇప్పుడు యువత కొత్త దిశలోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రశ్నించే పౌరసమాజం, పారదర్శకత కోరుతున్న విద్యార్థులు, డిజిటల్ వేదికల ద్వారా సంఘటితమవుతున్న యువశక్తి కలిసి ఒక ఆధునిక రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నాయి. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయికి విస్తరిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఉద్యమం కూడా అదే భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంగా చర్చనీయాంశమవుతోంది.

*నీట్–యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిలించింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తడం, విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలు, అనంతరం "చలో పార్లమెంట్" కార్యక్రమానికి వచ్చిన స్పందన, విద్యార్థుల ఆందోళనకు దేశవ్యాప్త రూపం ఇచ్చాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ కూడా ఈ ఉద్యమానికి ప్రధాన నినాదంగా మారింది.*

ఇది కేవలం ఒక పరీక్షకు సంబంధించిన అసంతృప్తి మాత్రమే కాదు. ప్రభుత్వ వ్యవస్థల జవాబుదారీతనం, అవినీతి నిరోధం, సమాన అవకాశాలు, సంస్థల స్వతంత్రత వంటి విస్తృత అంశాలపై యువత తమ స్వరం వినిపిస్తోంది. సోషల్ మీడియా యుగంలో సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్నందున, ఏ సమస్యనైనా స్థానిక స్థాయిలో పరిమితం చేయడం ఇక సాధ్యం కాదు. ఒక ప్రాంతంలో ప్రారంభమైన నిరసన క్షణాల్లోనే జాతీయ చర్చగా మారుతోంది.

ఈ ఉద్యమాల్లో గమనించదగ్గ మరో అంశం ఏమిటంటే, "హిందూ–ముస్లిం" వంటి విభజనాత్మక రాజకీయాల కంటే ఉపాధి, విద్య, పరీక్షల విశ్వసనీయత, అవినీతి నిర్మూలన, రాజ్యాంగ విలువలు, సెక్యులరిజం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని యువత కోరుతోంది. మతం వ్యక్తిగత విశ్వాసంగా ఉండొచ్చు, కానీ పాలనకు ప్రమాణం సామర్థ్యం, నిజాయితీ, జవాబుదారీతనం కావాలనే భావన బలపడుతోంది.

సెక్యులరిజం అంటే ఏ మతానికీ వ్యతిరేకం కాదు; అన్ని మతాల పట్ల సమాన గౌరవం చూపుతూ, పౌరుల హక్కులను సమానంగా కాపాడే రాజ్యాంగ స్ఫూర్తి. అదే విధంగా ఆధునికీకరణ అంటే కేవలం సాంకేతిక అభివృద్ధి కాదు; ఆలోచనా విధానంలో మార్పు, శాస్త్రీయ దృక్పథం, పారదర్శక పాలన, డిజిటల్ జవాబుదారీతనం, పౌర భాగస్వామ్యాన్ని పెంపొందించడం కూడా.

ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇటీవల యువత రాజకీయ మార్పులకు కారకులుగా నిలిచిన ఉదాహరణలు కనిపించాయి. భారతదేశంలో కూడా అదే తరహా మార్పు సంకేతాలు కనిపిస్తున్నాయా అనే ప్రశ్న ఇప్పుడు సహజంగానే తలెత్తుతోంది. అయితే ఏ ఉద్యమమైనా భావోద్వేగాలతో మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో, రాజ్యాంగబద్ధ మార్గాల్లో ముందుకు సాగినప్పుడే దీర్ఘకాలిక ఫలితాలు ఇస్తుంది.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు మాత్రమే మార్పుకు మార్గం కావు; చైతన్యవంతమైన పౌరసమాజం, ప్రశ్నించే యువత, బాధ్యతాయుతమైన మీడియా, జవాబుదారీతనంతో పనిచేసే ప్రభుత్వ వ్యవస్థలు కలిసి పనిచేసినప్పుడే ప్రజల విశ్వాసం బలపడుతుంది. దేశ భవిష్యత్తును నిర్మించేది విభజనల రాజకీయాలు కాదు; సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, పారదర్శక పరిపాలన, రాజ్యాంగ విలువలపై నడిచే ఆధునిక ప్రజాస్వామ్య సంస్కృతి. ఆ దిశగా అడుగులు వేస్తున్న కొత్త తరం ఆశలను భారత రాజకీయ వ్యవస్థ ఎంతవరకు అర్థం చేసుకుని స్పందిస్తుందన్నదే రానున్న కాలంలో కీలకంగా మారనుంది.

# మెజారిటీ ఉంటే సరిపోదు... పాలనలో సమర్థత, నిజాయితీ, జవాబుదారీతనం కావాలి

ప్రజాస్వామ్యంలో ఒక నాయకుడి విజయాన్ని కేవలం ఎన్నికల్లో సాధించిన మెజారిటీ సీట్లతో మాత్రమే కొలవలేం. అధికారం గెలుచుకోవడం ఒక దశ అయితే, ఆ అధికారాన్ని ప్రజల ప్రయోజనాల కోసం ఎంత సమర్థంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో వినియోగించారు? అన్నదే నిజమైన సమర్థతకు ప్రమాణం. రాజకీయ శక్తి, ప్రచార, ప్రసార సాధనాలతో, అభూత కల్పనలతో, హంగామా ఆర్భాటాలతో, సంస్థాగతంగా బలవంతుడిగా విగ్రహారాధన, అంధ భక్తుల వ్యక్తి పూజ మోదీని ఒక గొప్ప నాయకుడిగా నిలబెట్టవచ్చు. కానీ, ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచేది ... ఎంతకాలం పదవిలో కొనసాగారు అన్నది కాదు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమ సామర్థ్యం, క్లిష్టమైన జాతీయ , అంతర్జాతీయ సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కొనే ధైర్యం, ప్రజల ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, వైద్య సమస్యల పరిష్కారం పట్ల చూపుతున్న నీతి, నిజాయితీ నిబద్ధత మాత్రమే.ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేస్తుంది.

ఇటీవలి సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామక పరీక్షల్లో అవకతవకలు, విద్యార్థుల నిరసనలు వంటి పరిణామాలు భారత విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తాయి. ముఖ్యంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షల విషయంలో ఒక్క చిన్న వైఫల్యం కూడా వేల కుటుంబాల జీవితాలపై ప్రభావం చూపుతుంది. అనేక మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఆ కుటుంబాలకు ప్రధాన మంత్రి, లేదా విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణలు చెప్పలేదు. ఒక అసమర్థుడైన విద్యా శాఖా మంత్రిని తొలగించటానికి దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేయవలసిన అవసరం ఎందుకు వచ్చింది.? కనీసం వారి ఆవేదన అర్థం చేసుకోకుండా క్రాక్రోచ్ లు, పరాన్న జీవులు అంటూ హేళన చేయటం వల్లనే...ఆ అవమానం నుంచే ఆత్మాభిమానం కల "జన్–జీ యువత " "కాక్రోచ్ జనతా పార్టీ" గా పుట్టింది. వారు శాంతియుతంగా, నిరాహార దీక్షలతో లేవనెత్తిన అంశాలను పట్టించుకోకుండా వారిపై కఠినమైన చట్టపరమైన నేరాలుగా హోం శాఖ పరిగణించి పోలీసులు,పారా మిలటరీ బలగాలతో, పరోక్షంగా ఆరెస్సెస్, బీజేపీ గూండాలను రంగంలో దించి అమానుషంగా, పాశవికంగా విద్యార్థినీ, విద్యార్థులు,వారి తల్లితండ్రులను, వేల సంఖ్యలో గుమికూడిన యువకులపై ఏలాంటి హెచ్చరికలు లేకుండా లాఠీ చార్జి, బాష్పవాయువు ప్రయోగం, నిషేధిత పెల్లట్ తూటాలను ప్రయోగించారు. ఏకే 47 ను ఉపయోగించారు. ఇది పూర్తిగా చట్ట వ్యతిరేకం, శాంతి యుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పాల్పడింది. ఇందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ పోలీసుల దమనకాండకు, దౌర్జన్యాలకు పరిపాలనా పరంగా బాధ్యత వహించాల్సిన సమయంలో సీనులో కనిపించకపోవడం , మౌనంగా ఉండటం తీవ్రంగా ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా చూడాలి.

గత ప్రభుత్వాల కాలంలో కూడా ప్రశ్నాపత్రాల లీకులు జరిగాయి. అయితే ఒక ప్రభుత్వం గత వైఫల్యాలను ఉదాహరణగా చూపించినంత మాత్రాన తన బాధ్యత నుంచి తప్పించుకోలేదు. సమర్థమైన పాలన అంటే పూర్వపు లోపాలను గుర్తించి వాటిని పునరావృతం కాకుండా నిరోధించే వ్యవస్థను నిర్మించడం. అదే



పరిపాలనా నైపుణ్యానికి అసలు కొలమానం.

చివరకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ప్రజల వత్తిడి, విద్యార్థుల ఆందోళనకు తలవంచి, కేంద్ర ప్రభుత్వ జాతీయ పరీక్షా వ్యవస్థపై వచ్చిన విమర్శల నేపథ్యంలో కొన్ని సంస్కరణలు ప్రకటించింది. పరీక్షల భద్రతను బలోపేతం చేయడం, డిజిటల్ పర్యవేక్షణను పెంచడం, ప్రశ్నాపత్రాల రవాణాలో కొత్త విధానాలను ప్రవేశపెట్టడం, పరీక్షల అవకతవకలపై కఠిన చట్టాలను తీసుకురావడం వంటి చర్యలు చేపట్టింది. అయినప్పటికీ ప్రజల్లో విశ్వాసం పూర్తిగా పునరుద్ధరించాలంటే కేవలం చట్టాలు సరిపోవు; వాటి అమలు, బాధ్యులపై నిష్పాక్షిక చర్యలు, విచారణల్లో పారదర్శకత కూడా అంతే అవసరం.

భారతదేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది యువత ఉద్యోగాలు, ఉన్నత విద్య కోసం పోటీ పరీక్షలు రాస్తున్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జాతీయ పరీక్షా సంస్థ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, రైల్వేలు, బ్యాంకులు, ఇతర నియామక సంస్థల ద్వారా నిర్వహించే పరీక్షలు లక్షల కుటుంబాల ఆశలను మోస్తాయి. ఇలాంటి పరిస్థితిలో ఒక్కోసారి జరిగే లీకేజీ కూడా కేవలం ఒక కేసు కాదు; అది మొత్తం వ్యవస్థ విశ్వసనీయతపై పడే దెబ్బ.

ప్రజాస్వామ్యంలో సమస్య తలెత్తినప్పుడు ప్రభుత్వ స్పందనే ప్రజల విశ్వాసాన్ని నిర్ణయిస్తుంది. నిరసనలు వస్తే వాటిని వినడం, చర్చించడం, లోపాలను సరిదిద్దడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక. కానీ ప్రతి విమర్శను రాజకీయ కుట్రగా, ప్రతి నిరసనను దేశవ్యతిరేక చర్యగా చిత్రీకరించే ధోరణి గత 12 ఏళ్ళుగా బీజేపీ పాలనలో బాగా పెరిగిపోయింది. ప్రజాస్వామ్యస్యలు ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు జరిపకుండా వారిని శత్రువులుగా భావించటం, విపక్షాల సలహాలు, సూచనలు లక్ష్యపెట్టకపోవటం మెదలైన చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తుంది. అదే సమయంలో ప్రతి నిరసన పూర్తిగా నిష్కళంకమని కూడా చెప్పలేం. కానీ నిరసనల వెనుక నిజమైన సమస్యలు ఉంటే వాటిని ముందుగా పరిష్కరించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే.

ఇటీవలి కాలంలో రాజకీయ చర్చల్లో మరో ఆందోళనకర అంశం బీజేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న "గోదీ మీడియా" అసత్యాల ప్రాపగాండా యుద్ధం. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలు, టెలివిజన్ వ్యవస్థలు 95 శాతం అదానీ, అంబానీ ఆధీనంలో ఉన్నాయి. వాటి వార్తా ప్రసారాలు, కథనాలు, చర్చలు ప్రజా సమస్యల కంటే విపక్షాలపై, మేధావులపై, ప్రజా సంఘాలపై దుష్ప్రచార ఆరోపణలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయనే విమర్శ ఉంది. ఒకవైపు అధికార పక్షం తన విజయాలను విస్తృతంగా ప్రచారం చేస్తే, మరోవైపు ప్రతిపక్షం ప్రతి వైఫల్యాన్ని ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనంగా చూపుతుంది. ఈ రాజకీయ పోటీలో అసలు సమస్యలు చాలా సార్లు మరుగునపడిపోతున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి పరిపాలనకు మూడు ప్రధాన ప్రమాణాలు చెబుతుంటారు–జవాబుదారీతనం, పారదర్శకత, సంస్థాగత సామర్థ్యం. ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు కూడా సమర్థమైన పాలన అంటే కేవలం జీడీపీ వృద్ధి మాత్రమే కాదని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, చట్టబద్ధమైన వ్యవస్థలను బలోపేతం చేయడం, అవినీతిని అరికట్టడం, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమని పేర్కొంటాయి. ఎన్నికల్లో అక్రమ,సక్రమ, జిమ్మిక్కులతో , పొసగని అక్రమ స్వార్థ పూరిత పార్టీల "ఊత కాళ్ళ" పొత్తులతో మెజారిటీ సాధించడం ఈ లక్ష్యాలకు ప్రత్యామ్నాయం కాదు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతులు, డిజిటల్ సేవలు, ప్రత్యక్ష నగదు బదిలీలు, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతిష్ఠ వంటి అసత్య, అరకొర అర్థం సత్యాలతో గోదీ మీడియా విశ్లేషకుల ప్రశంసలు పొందినా. అదే సమయంలో నిరుద్యోగం, పరీక్షల నిర్వహణ, సంస్థల స్వతంత్రత, విమర్శల పట్ల ప్రభుత్వ వైఖరి, ప్రజాస్వామ్య సంస్థల పనితీరుపై ప్రతిపక్షాలు, పౌర సమాజ సంస్థలు, కొంతమంది పరిశీలకులు తీవ్ర విమర్శలు కూడా చేస్తున్నారు. ఈ రెండు కోణాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడే సమతుల్య విశ్లేషణ సాధ్యమవుతుంది.

ప్రజాస్వామ్యంలో బలమైన నాయకత్వం అవసరమే. కానీ ఆ బలం ప్రజల విశ్వాసం నుంచి రావాలి; రాజ్యాంగం దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ, ఐటీ, వంటి సంస్థల చేత రైడ్స్ చేయించి, విపక్షాలను, ప్రజలను భయపెట్టడం నుంచి కాదు.దేశాన్ని అధోగతి పుట్టించే సమస్యలను దాచిపెట్టి , మసిపూసి, మారేడు కాయల ప్రచారంచేసే కంటే వాటిని సమస్యల పరిష్కరించే పరిపాలన గొప్పది. విమర్శలను అణచివేయడం కంటే వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడం విలువైనది. అధికారంలో ఉన్నవారు తప్పులు చేయకపోవడం అసాధ్యం. కానీ చేసిన తప్పులను ఎంత చిత్తశుద్ధితో అంగీకరించి సరిదిద్దే సంస్కృతి ఉండటమే నిజమైన నాయకత్వ లక్షణం.

చరిత్రలో నిలిచిపోయిన నాయకులను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. వారు ఎంత శక్తివంతులన్నది కాలక్రమంలో మరచిపోతారు. కానీ, వారు ఈ సంక్షోభాలను ఎలా ఎదుర్కొన్నారు, ప్రజల విశ్వాసాన్ని ఎలా నిలబెట్టుకున్నారు, వ్యవస్థలను ఎంత బలోపేతం చేశారు అన్నదే వారి వారసత్వంగా మిగులుతుంది. అందువల్ల ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు; కానీ మంచి పాలన శాశ్వతమైన గుర్తింపును తెస్తుంది. నాయకుడి నిజమైన బలం ప్రచారాల పటాటోపంలో కాదు, ప్రజల జీవితాల్లో కనిపించే ఫలితాల్లోనే ఉంటుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

### ఆనందజీవనం !



నిజం చెప్పాలని
రాస్తున్నాను!
చెపుతూనే ఉన్నాను!
నిజం చెప్పనివ్వరు
చెపితే చాలామంది
ప్రమాదంలో పడతారు!
మనం బ్రతికేదే
అబద్ధంలో కదా!
అదీ అసలుకారణం!
అబద్ధం నుంచి
బైట పడితే
అదీ ఆనందం!
సాటి మనిషి
అజ్ఞానం మీద
బ్రతకకండి!
అవేవో గొప్ప
తెలివితేటలు
అనుకోకండి!
మోసం దగా
దోపిడీ.. ఇదంతా
వ్యభిచార జీవనం!
మనసు వ్యభిచారం!
మాట వ్యభిచారం!
చేత వ్యభిచారం!
ఆచారం ఎక్కడుంది
అంతా వ్యభిచారం!
ఇదే మీ అపచారం!
అపచారలే దుఃఖం!
దుఃఖాలే రోగం!
రోగమేమృత్యువు!
కోట్లు సంపాదించి
మురుస్తున్నావా?
మురవకే మనసా!
నీవల్ల ఎవరికీ
బాధలేకుండా
బ్రతికి చూడు!
బాధల్లోఉన్నవాళ్ళకి
సహకరించి చూడు!
అదీ అనందం!
ఉచ్ఛతాగి పేదతిని
ఆరోగ్యమనుకోకు!
అవన్నీ అబద్ధాలు!
మనం జీవిస్తున్న
వ్యవస్థ మొత్తం!
అబద్ధాలనిర్మాణం!
అందుకే అంతులేని
దుఃఖాల్లో అందరూ!
ఇదీ అసలు నిజం!
అబద్ధాలు లేని
వ్యవస్థను నిర్మించు
అది'సత్యం'లోఉంది!
సత్యంపాపహరణం!
నిత్యం ఆచరణం!
ఆనంద జీవనం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

### పుడమి వేల్పు

గురువు పండ్ల తరువు
కూర్మికిని నెలవు
గురువు రాజహంస
పరిహరించి
మంచి చెడుల చూపు
మహనీయ మనిషి
పూజనీయ గరువు
పుడమి వేల్పు

రేడియమ్
9291527757

# క్షమిస్తున్నానని చెప్పే అధికారం ఎవరిది?

**మాటల రాజకీయాల నుంచి విద్వేష రాజకీయాల వరకు - నరేంద్ర మోదీ ప్రసంగాలపై ఒక విశ్లేషణ**

"నేను విద్యార్థులను క్షమిస్తున్నాను." ఈ ఒక్క వాక్యం భారత ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఒక పెద్ద చర్చను రేకెత్తించింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపిన విద్యార్థులను దేశ ప్రధానమంత్రి "క్షమిస్తున్నాను" అని చెప్పడం కేవలం ఒక రాజకీయ వ్యాఖ్యగా మాత్రమే చూడలేం. ఆ మాట వెనుక ఉన్న రాజకీయ దృక్పథం, అధికారాన్ని చూసే విధానం, ప్రజలను చూసే కోణం, విభేదాలను అర్థం చేసుకునే సంస్కృతి – ఇవన్నీ విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యం అంటే ప్రజల పాలన. రాజ్యాంగం ప్రకారం సార్వభౌమాధికారం ప్రజలది. ప్రజలు తమ అధికారాన్ని ఎన్నికల ద్వారా తాత్కాలికంగా ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఆ అధికారం ప్రజలను పాలించడానికి కాదు; ప్రజలకు సేవ చేయడానికి. ప్రశ్నించే హక్కును తొలగించడానికి కాదు; సమాధానం చెప్పడానికి. అయితే ఇటీవలి సంవత్సరాల్లో భారత రాజకీయ భాషలో ఒక గమనించదగ్గ మార్పు కనిపిస్తోంది. అధికారంలో ఉన్నవారు తమను ప్రజల ప్రతినిధులుగా కాకుండా, దేశానికి ఏకైక సంరక్షకులుగా చిత్రీకరించే ధోరణి బలపడుతోంది. ఈ నేపథ్యంలో "క్షమిస్తున్నాను" అనే భాష ఒక పరిపాలనా పదం కాదు. అది అధికారపు మానసిక స్థితికి ప్రతిబింబం.

ప్రజాస్వామ్యంలో విద్యార్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అది నేరం కాదు. ఉద్యోగాలు అడగడం నేరం కాదు. పరీక్షల్లో పారదర్శకత కోరడం నేరం కాదు. విద్యా వ్యవస్థను కాపాడాలని నిరసన తెలియజేయడం రాజ్యాంగ బద్ధమైన హక్కు. అటువంటి యువతను "క్షమిస్తున్నాను" అని ఉద్దేశించడం, నిరసనను ఒక తప్పిదంగా చిత్రీకరించే ప్రమాదకరమైన సంకేతాన్ని ఇస్తుంది. ఇది ఒకరోజులో ఏర్పడిన రాజకీయ సంస్కృతి కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్నికల ప్రచారాలు, బహిరంగ సభలు, రాజకీయ ప్రసంగాల్లో ఉపయోగించిన భాష క్రమంగా ఒక కొత్త రాజకీయ సంస్కృతిని నిర్మించింది. ఒకప్పుడు ఎన్నికల్లో విధానాలు ప్రధాన చర్చగా ఉండేవి. ఇప్పుడు వ్యక్తులు, వారి కుటుంబాలు, వారి ఉద్దేశాలు, వారి దేశభక్తి – ఇవే రాజకీయ వాదోపవాదాల కేంద్రంగా మారుతున్నాయి.

2014 ఎన్నికల్లో "షహ్‌జాదా", "ఖూనీ పంజా", "పింక్ రివల్యూషన" వంటి పదజాలం ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించింది. 2015లో బీహార్ ఎన్నికల సందర్భంగా "డీఎనఏ" వ్యాఖ్య పెద్ద రాజకీయ వివాదానికి దారితీసింది. 2016 నుంచి "నామ్‌దార్ వర్సెస్ కామ్‌దార" అనే రాజకీయ రూపకం తరచూ వినిపించింది. 2019 నాటికి "టుక్డే–టుక్డే గ్యాంగ", "అర్బన్ నక్సల" వంటి పదజాలం జాతీయ రాజకీయ సంభాషణలో స్థానం సంపాదించాయి. 2021లో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో "దీదీ ఓ దీదీ" వ్యాఖ్య చర్చనీయాంశమైంది. 2023లో "ఘమండియా" అనే పదంతో ప్రతిపక్ష కూటమిని విమర్శించారు. 2024 ఎన్నికల్లో "మంగళసూత్రం", "ఆస్తులు", "చొరబాటుదారులు", "వోటు జిహాద" వంటి వ్యాఖ్యలు ఎన్నికల చర్చను మరింత తీవ్ర ధ్రువీకరణ వైపు నడిపించాయి.

ఈ వ్యాఖ్యలన్నింటిపై రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. బీజేపీ వాటిని ఎన్నికల ప్రచారంలో భాగమైన చట్టబద్ధమైన రాజకీయ విమర్శలుగా సమర్థించింది. ప్రతిపక్షాలు, పౌరసంఘాలు, కొంత మీడియా మాత్రం ఇవి వ్యక్తిగత దూషణ, సామాజిక విభజన, ధ్రువీకరణకు దోహదపడుతున్నాయని విమర్శించాయి. ఈ వ్యాసం ఉద్దేశం ఆ వివాదాలను తిరిగి తీర్పు ఇవ్వడం కాదు. ఆ రాజకీయ భాష ప్రజాస్వామ్య సంస్కృతిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో విశ్లేషించడం. భాష అనేది కేవలం సంభాషణ సాధనం కాదు. అది రాజకీయ శక్తి. నాయకుడు ఉపయోగించే పదాలు ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా ప్రధానమంత్రి వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి మాటలు రాజకీయ కార్యకర్తలకు, మద్దతుదా రులకు, ప్రభుత్వ వ్యవస్థకు, మీడియాకు ఒక సంకేతంగా మారుతాయి.



నాయకుడు ప్రత్యర్థిని కేవలం రాజకీయంగా విమర్శిస్తే అది ప్రజాస్వామ్య సహజ ప్రక్రియ. కానీ ప్రత్యర్థిని దేశానికి ప్రమాదంగా, ప్రజల శత్రువుగా, అంతర్గత శత్రువుగా చిత్రించే భాష విస్తరించినప్పుడు రాజకీయ పోటీ క్రమంగా సామాజిక విభజనగా మారే ప్రమాదం ఉంటుంది.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఒక ప్రజాస్వామ్యంలో అధికార భాష ఎలా ఉండాలి? ప్రజలను గౌరవించే భాషా? లేక ప్రజలను క్షమించే భాషా? విభేదాలను వినే భాషా? లేక విభేదాలను అనుమానించే భాషా? ప్రతిపక్షాన్ని ప్రత్యర్థిగా చూసే భాషా? లేక శత్రువుగా చిత్రించే భాషా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకకుండా భారత రాజకీయాల్లో భాషలో వచ్చిన మార్పును అర్థం చేసుకోవడం అసాధ్యం. అధికారం ఎప్పుడూ భాషతోనే తనను వ్యక్తపరుస్తుంది. చట్టాలు తర్వాత వస్తాయి. ముందుగా మాటలు వస్తాయి. పదజాలం మారుతుంది. ఆ తర్వాత రాజకీయ సంస్కృతి మారుతుంది. చివరికి సమాజం మారుతుంది. అందుకే ప్రజాస్వామ్యంలో నాయకుడి మాట ఒక వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే కాదు. అది ఒక రాజకీయ సంస్కృతికి బీజం. 2014--2026 కాలక్రమంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అభివృద్ధి నినాదంతో ప్రారంభమైన ప్రచారం క్రమంగా వ్యక్తిగత విమర్శలు, గుర్తింపు రాజకీయాలు, ధ్రువీకరణ భాష వైపు మళ్లింది. 2026లో "విద్యార్థులను క్షమిస్తున్నాను" అనే వ్యాఖ్య ఈ పరిణామానికి ఒక చిహ్నంగా నిలిచింది. ఈ వ్యాఖ్యకు మద్దతుగా ఉన్నవారు దీన్ని సామరస్యానికి పిలుపుగా చూడగా, విమర్శకులు ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపిన పౌరులను పాలకుడు క్షమిస్తున్నానని చెప్పడం అధికారం కేంద్రంగా ఉన్న రాజకీయ దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని వాదించారు. ఇక్కడే ఒక ప్రాథమిక ప్రశ్న తలెత్తుతుంది: ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విద్యార్థి క్షమాభిక్ష కోరాల్సిన వ్యక్తినా? లేక ప్రజల తరఫున జవాబు చెప్పాల్సింది ప్రభుత్వమా?

భాష మారితే రాజకీయాలు మారతాయి. రాజకీయాలు మారితే సమాజం మారుతుంది. రాజకీయాల్లో భాష అనేది కేవలం ప్రసంగాల్లో వినిపించే పదాల సమాహారం కాదు. అది అధికారానికి ముఖం. ఒక ప్రభుత్వం తన ప్రజలను ఎలా చూస్తుందో, ప్రత్యర్థులను ఎలా అర్థం చేసుకుంటుందో, విభేదాలను ఎలా స్వీకరిస్తుందో మొదట భాషలోనే కనిపిస్తుంది. ప్రజాస్వామ్యాలు ఒక్కరోజులో నియంతృత్వాలుగా మారవు. ముందుగా భాష మారుతుంది. ప్రత్యర్థులు శత్రువులవుతారు. విమర్శకులు దేశద్రోహులవుతారు. విద్యార్థులు కుట్రదారులవుతారు. పాత్రికేయులు "అజెండా"గా ముద్రపడతారు. మేధావులు అనుమానాస్పదులవుతారు. చివరికి ప్రశ్నించే ప్రతి గొంతు భద్రతకు ముప్పుగా చిత్రీకరించబడుతుంది. అదే సమయంలో అసలు సమస్యలు వెనుకబడతాయి. నిరుద్యోగం మాట్లాడాల్సిన చోట దేశభక్తి గురించి చర్చ జరుగుతుంది. ద్రవ్యోల్బణంపై సమాధానం చెప్పాల్సిన చోట ప్రతిపక్ష దేశభక్తిని ప్రశ్నిస్తారు. విద్యా వ్యవస్థపై చర్చించాల్సిన చోట విద్యార్థుల ఉద్దేశాలను విచారిస్తారు.

ప్రజాస్వామ్యానికి బలం – ప్రశ్నించే పౌరుడు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను, శాంతియుత నిరసన హక్కును కల్పించింది. ఈ హక్కులు ప్రభుత్వ దయ వల్ల వచ్చినవి కావు. ఇవి ప్రజలే తమ రాజ్యాంగంలో పొందుపరచుకున్న హక్కులు. విద్యార్థి ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు. ప్రశ్నలను భరించలేని రాజకీయమే ప్రజాస్వామ్యానికి ప్రమాదం. భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటే విద్యార్థుల పాత్ర అసాధారణం. స్వదేశీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం – ప్రతి దశలో యువత ముందుండింది. స్వాతంత్ర్యం తర్వాత కూడా విద్యార్థులు అనేక సామాజిక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. చరిత్రలో ఎప్పుడూ మార్పును ముందుగా గమనించేది యువతే. అందుకే ప్రతి ప్రజాస్వామ్యంలో విశ్వవిద్యాలయాలు చర్చలకు కేంద్రాలుగా ఉంటాయి. విమర్శ దేశద్రోహం కాదు. ప్రభుత్వాన్ని విమర్శించడం దేశాన్ని విమర్శించడం కాదు. అధికారాన్ని ప్రశ్నించడం రాజ్యాంగాన్ని ప్రశ్నించడం కాదు. ఎన్నికల్లో ఓడించాలని కోరుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు. కానీ రాజకీయ భాష ఈ సరిహద్దులను చెరిపివేస్తే ఏమవుతుంది? ప్రభుత్వం = దేశం అనే భావన పెరుగుతుంది. ప్రధానమంత్రి = దేశం అనే భావోద్వేగ ప్రచారం మొదలవుతుంది. ప్రభుత్వాన్ని విమర్శించే వ్యక్తి = దేశాన్ని వ్యతిరేకించే వ్యక్తి అనే ప్రమాదకరమైన భావన క్రమంగా సాధారణమవుతుంది. ఇదే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన దశ.

విద్వేష భాష తక్షణ రాజకీయ ప్రయోజనాలను ఇవ్వవచ్చు. అది మద్దతుదారులను ఉత్సాహపరచవచ్చు. ఎన్నికల్లో ధ్రువీకరణ సృష్టించవచ్చు. కానీ దీర్ఘకాలంలో అది సమాజాన్ని బలహీనపరుస్తుంది. ఒకసారి రాజకీయాల్లో ప్రత్యర్థిని శత్రువుగా చూడటం ప్రారంభమైతే, ఆ సంస్కృతి కుటుంబాల్లోకి, విద్యాసంస్థల్లోకి, కార్యాలయాల్లోకి, సామాజిక మాధ్యమాల్లోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత చర్చ ఉండదు. వివాదం మాత్రమే ఉంటుంది. వాదన ఉండదు. దూషణ మాత్రమే ఉంటుంది. విమర్శ ఉండదు. వ్యతిరేకత మాత్రమే మిగులుతుంది. ఇది ప్రజాస్వామ్య సంస్కృతికి నెమ్మదిగా జరిగే క్షీణత.

ప్రతి ప్రభుత్వానికి విద్యార్థి ఉద్యమాలు అసౌకర్యంగా అనిపించవచ్చు. ఎందుకంటే యువత ప్రశ్నలు వేస్తుంది. లెక్కలు అడుగుతుంది. హామీలను గుర్తుచేస్తుంది. కానీ ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. అణచివేయకూడదు. అవమానించకూడదు. అనుమానించకూడదు. ప్రశ్నించిన విద్యార్థిని "క్షమిస్తున్నాను" అని చెప్పడం కంటే, "మీ సమస్యలు ఏమిటి?" అని అడగడం ప్రజాస్వామ్య నాయకత్వానికి తగిన భాష.

భారత రాజ్యాంగం పాలకుడికి ప్రత్యేక నైతిక హోదా ఇవ్వదు. అది ప్రతి పౌరుడికి సమాన గౌరవాన్ని ఇస్తుంది. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ. ప్రజలు ప్రభుత్వానికి కాదు. అందుకే ప్రజాస్వామ్యంలో "ప్రజలను క్షమిస్తున్నాను" అనే భాష కంటే "ప్రజలకు జవాబు చెబుతున్నాను" అనే భాష రాజ్యాంగ స్ఫూర్తికి దగ్గరగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో అసమ్మతి ఒక లోపం కాదు. అది ప్రజాస్వామ్యం సజీవంగా ఉందనే సంకేతం.

ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రభుత్వానికి శత్రువు కాదు; అది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక రాజ్యాంగబద్ధమైన భాగం. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించడం, అధికారాన్ని జవాబుదారీగా ఉంచడం ప్రతిపక్షపు బాధ్యత.

భారత రాజకీయాలు మళ్లీ సమస్యల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉంది. రైతు ఆదాయం గురించి మాట్లాడాలి. నిరుద్యోగం గురించి మాట్లాడాలి. విద్యా సంస్కరణల గురించి మాట్లాడాలి. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, కార్మికుల హక్కులు, మహిళల భద్రత, సామాజిక న్యాయం, ఆర్థిక అసమానతల గురించి మాట్లాడాలి. ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను పక్కనపెట్టి, వ్యక్తిగత దాడులు, గుర్తింపు రాజకీయాలు, ధ్రువీకరణ భాష ప్రధాన చర్చగా మారితే, ప్రజాస్వామ్య చర్చ నాణ్యత దెబ్బతింటుంది. ఒక దేశ భవిష్యత్తు గురించి తెలుసుకోవాలంటే ఆ దేశ విద్యార్థులను చూడాలి. వారు ప్రశ్నలు అడుగుతున్నారా? లేక భయపడుతున్నారా? వారు చర్చిస్తున్నారా? లేక మౌనం పాటిస్తున్నారా? ప్రజాస్వామ్యంలో విశ్వవిద్యాలయాలు ప్రశ్నలు అడిగే ప్రదేశాలు. అక్కడ అసమ్మతి ఉంటుంది. కొత్త ఆలోచనలు పుడతాయి. అదే దేశాన్ని ముందుకు నడిపిస్తుంది. అందుకే విద్యార్థుల గొంతును వినడం, వారితో సంభాషించడం, వారి ఆందోళనలకు సమాధానం ఇవ్వడం ప్రభుత్వ బలహీనత కాదు. ప్రజాస్వామ్య బలం.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు ఎవరికైనా రాజకీయ విమర్శ చేసే హక్కు ఉంది. కానీ ప్రజాస్వామ్యంలో మాటకు బాధ్యత కూడా ఉంటుంది. ఒక నాయకుడి మాట లక్షలాది మంది అనుచరులకు ఆదర్శంగా మారుతుంది. చరిత్ర చివరకు ఒక్క ప్రశ్ననే అడుగుతుంది. అధికారంలో ఉన్నప్పుడు మీరు ఎంతకాలం పాలించారు? అనే ప్రశ్నను కాదు. ఎలాంటి రాజకీయ సంస్కృతిని వదిలి వెళ్లారు? అనే ప్రశ్నను. ప్రజలను భయపెట్టే సంస్కృతినా? ప్రజలను విభజించే సంస్కృతినా? లేక ప్రజలను వినే, గౌరవించే, విభిన్న అభిప్రాయాలను అంగీకరించే ప్రజాస్వామ్య సంస్కృతినా? ఈ ప్రశ్నకు సమాధానం ఒక్క నాయకుడు ఇవ్వడు. ప్రజలే ఇస్తారు. ఎన్నికల్లో ఇస్తారు. చరిత్రలో ఇస్తారు. భవిష్యత్ తరాలు ఇస్తాయి. అందుకే ప్రజాస్వామ్యంలో చివరి మాట అధికారానిది కాదు. ప్రజలది. చివరి తీర్పు ప్రభుత్వానిది కాదు. రాజ్యాంగానిది. చివరి బలం భయానిది కాదు. స్వేచ్ఛానిది. చివరి విజయం విద్వేషానిది కాదు. ప్రజాస్వామ్యానిది.



- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్)
లిబరేషన్ తెలంగాణ

## ప్రజా సమస్యలు పరిష్కారించడమే ప్రథమ కర్తవ్యం



**తాండూరు, అగస్టు 2 (జనంసాక్షి) :** ప్రజా సమస్యలు పరిష్కారించడమే ప్రథమ కర్తవ్యమని28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం వేల్లడించారు. శనివారం జరిగిన విద్యుత్ ప్రమాద స్థలాన్ని స్వయంగా పరిశీలించి పెద్ద ప్రమాదాన్ని నివారించారు. ఘటనా స్థలంలో కరెంట్ లైన్లలో సమస్య ఉందని గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సప్లైని వెంటనే నిలిపివేయించారు. దీంతో ఆ ప్రాంతంలో జరగబోయే ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లేశం మాట్లాడుతూ ప్రజల భద్రతే మాకు ముఖ్యమన్నారు ఎక్కడైనా విద్యుత్ సమస్యలు గానీ, రోడ్లపై చీకట్లు గానీ ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలి. మేము వెంటనే స్పందిస్తాం" అని తెలిపారు.అదే సమయంలో వార్డు ప్రజల చిరకాల కోరిక మేరకు అంబేద్కర్ చౌక్ నుంచి అమ్మ చేతి రుచుల వరకు ఉన్న రోడ్డుపై కొత్త వీధి లైట్లను కూడా ఏర్పాటు చేయించారు. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో చీకటిగా ఉండేదని, ఇప్పుడు లైట్లు వెలగడంతో మహిళలు, విద్యార్థులు సురక్షితంగా తిరగగలరని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కౌన్సిలర్ తక్షణ స్పందనపై 28వ వార్డు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

## కాలుష్య నియంత్రణ కోసం ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతో ఉపయోగకరం



**కడ్తాల్, ఆగష్టు 2 (జనంసాక్షి) :** ప్రస్తుత సమాజంలో విపరీతమైన పొగ కాలుష్యంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని వాటిని అధిగమించేందుకు కోసం మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయని వాటి ఉపయోగం వల్ల కాలుష్యం కొంత మెరుగు తగ్గవచ్చునని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్,ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు.ఆదివారం అయ్య సాగర క్షేత్ర సమీపంలో ఎన్నారై రామకృష్ణ,జయప్రకాష్ ఏర్పాటు చేసుకున్న రేంజర్ ఇవి ఫాస్ట్ చార్జర్ ఎలక్ట్రిక్ వాహనాల (చార్జింగ్ పాయింట్)ను రామ్ నుంతల సర్పంచ్ శ్రీను నాయక్,మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్ లతో కలిసి గంప వెంకటేష్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కూడా కాలుష్య నివారణ కొరకు విస్తృత ప్రచారం నిర్వహిస్తుందని ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం..ఇంధనం ఆదా చేసేందుకోసం బ్యాటరీ వాహనాలను కొనుగోలు చేసి నడపాలని వాహనదారులను ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి డైరెక్టర్ మంగళపల్లి నరసింహ,అమృతం పాండు,జగన్ నాయక్,తులసి రామ్ నాయక్,నరేందర్,శాంతి లాల్ తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో మాయ మాటలతో 3 తులాల పుస్తెలతాడు చోరీ

- నిందితురాలు అరెస్ట్, బంగారం స్వాధీనం



**తాండూరు, అగస్టు 2 (జనంసాక్షి) :** గత నెల 21 జులై నాడు తాండూరు పట్టణంలోని మార్వాడి బజార్లో చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించారు.బాధితురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును మాయ మాటలతో దోచుకున్న నిందితురాలు నీరటి స్వరూపను తాండూరు పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుండి దొంగతనం చేసిన 3 తులాల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితురాలు స్వరూప బాధితురాలి వద్దకు వచ్చి మీ డిజైన్ బాగుంది. మా తమ్ముడి పెళ్లిలో మీలాంటి డిజైన్ చేయిస్తాము అంటూ పొగిడి నమ్మకం కలిగించింది. మాటల్లో పెట్టి అవకాశం కోసం చూసి పుస్తెలతాడును తీసుకొని అక్కడి నుండి పారిపోయింది .ఫిర్యాదు అందుకున్న తాండూరు పట్టణ పోలీసులు సీసీ ఫుటేజీలు, స్థానికుల సమాచారంతో నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేశారు. విచారణలో ఆమె నేరం అంగీకరించడం తో ఆమె వద్ద నుండి 3 తులాల బంగారు పుస్తెలతాడును రికవరీ చేశారు.ఈ ఘటనతో మార్వాడి బజార్లోని మహిళలు ఊపిరి పీల్చుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.మార్కెట్ ప్రాంతాల్లో అపరిచితులు పొగిడినా, మాటలు కలిపినా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## భారీగా బీఎస్పీ పార్టీలో చేరికలు

- కొడంగల్ నియోజకవర్గంలో నీలి జెండా ఎగురవేస్తాం
- బీఎస్పీ ఇంచార్జి యు.రమేష్ బాబు



**కొడంగల్, ఆగస్టు 2 (జనం సాక్షి) :** కొడంగల్ మండలం అన్నారం గ్రామంలో శనివారం బీఎస్పీ పార్టీ కొడంగల్ ఇంచార్జ్ యు. రమేష్ బాబు ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యువకులు, గ్రామ పెద్దలు బారి ఎత్తున పార్టీలో చేరారు.కొడంగల్ అసెంబ్లీ ఇంచార్జ్ యు. రమేష్ బాబు,పార్టీ అధ్యక్షులు యం. శ్రీనివాస్, అసెంబ్లీ కోశాధికారి అరుణ్ కుమార్, మండల నాయకులు అన్నారం సాయిలు నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కొడంగల్ నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీని బలోపేతం చేసి నీలి జెండాను రెపరెపలాడిస్తామని తెలిపారు.గ్రామ నూతన బీఎస్పీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ అధ్యక్షుడిగా బైండ్ల శంకర్, ఉపాధ్యక్షులుగా నడిమింటి వెంకట్, గువ్వా పాండు, ప్రధాన కార్యదర్శిగా మండి నరేష్, కార్యదర్శిగా నడిమింటి నారాయణ, సెక్రటరీలుగా శ్రీనివాస్, కోడిగంటి చంద్రప్పలను ఎంపిక చేశారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యం

- సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సహాయ కార్యదర్శి జే పాండు, రాష్ట్ర నాయకులు ఏం శ్రీనివాస్ రెడ్డి
- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఇబ్రహీంపట్నం మండల కమిటీ ఎన్నిక
- అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చెరుకూరి సదానంద్



**రంగారెడ్డి, ఆగస్టు 2 (జనంసాక్షి) :** జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జే పాండు, రాష్ట్ర నాయకులు ఏం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వారి వృత్తి గౌరవ పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కరమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఇబ్రహీంపట్నం మండల మహాసభ ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాత్రికేయుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారం చేయడంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) అగ్రభాగాన నిలుస్తుందని తెలిపారు. అధికారంలో ఏ ప్రభుత్వాలు ఉన్నా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో సంఘం సఫలీకృతమైందని వివరించారు. రాష్ట్రంలో అక్కడక్కడ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చాయంటే అది టియుడబ్ల్యూజే (ఐజేయూ) పోరాట ఫలితమేనని గుర్తు చేశారు. ప్రతి జర్నలిస్టుకు సంఘం అండగా నిలిచేలా కృషి చేస్తామన్నారు. వృత్తి నిర్వహణలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఉన్నత స్థాయిలో ప్రస్తావించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాల అమలు, అర్హులైన ప్రతి సభ్యునికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయడంతో పాటు, పాత్రికేయుల హక్కులకు భంగం కలిగే ప్రతి అంశంపై సంఘం తరపున గళమెత్తుతామని పేర్కొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మండల మహాసభలో ఇబ్రహీంపట్నం మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ (ఈనాడు), ప్రధాన కార్యదర్శిగా చెరుకూరి సదానందం (మన తెలంగాణ), గౌరవ అధ్యక్షుడిగా పురం రాజిరెడ్డి (రాజ్ న్యూస్) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మోర భాస్కర్ (మనతెలంగాణ), జాజుల బాలు (ఈనాడు), జెలమోని శ్రీనివాస్ (టీవీ9), ముఖ్య సలహాదారుగా గడ్డం దశరథ్ (ప్రజాపక్షం), సహాయ కార్యదర్శిగా చేతాల సురేందర్ (ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా పి. భరత్ కుమార్ రెడ్డి (వార్త) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తారి పాండురంగ రెడ్డి (వెలుగు), సీనియర్ జర్నలిస్టులు, జిల్లా నాయకులు ఎం. భూపాల్ రెడ్డి (ఆంధ్రజ్యోతి), చెరుకూరి మహేందర్ (సాక్షి), బి. శ్రీనివాస్ రెడ్డి (నవభూమి), ఐలయ్య యాదవ్ (ఆంధ్రప్రభ), గిరి (ఆంధ్రప్రభ), మల్లేష్ (నమస్తే తెలంగాణ) పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

## తెలంగాణ ఉద్యమకారులకు తక్షణమే గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- కేకే కమిటీ పేరుతో కాలయాపన చేయవద్దు
- డాక్టర్ చీమ శ్రీనివాసరావు



**మల్కాజిగిరి, ఆగస్టు 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే గుర్తించి, తక్షణమే ఐడెంటిటీ కార్డులు జారీ చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని వినాయక నగర్ అంబేద్కర్ భవన్‌లో స్థానిక ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల వారీగా సర్వే నిర్వహించి అర్హులైన ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలంతో పాటు,నెలకు25,000 పింఛన్ మంజూరు చేసి ఉద్యమకారులందరికీ ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో అక్రమ కేసులు, బైండోవర్ కేసులు ఎదుర్కొన్న వారిని గుర్తించి న్యాయం చేయాలని. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీయూఎఫ్ అధ్యక్షుడు జిట్టా బాలకృష్ణ, నాయకులు గంగాధరి కృష్ణ, అశోక్, గణేష్, కృష్ణమూర్తి గౌడ్, భాగ్యనందన్ రావు, గోపాల్ ముదిరాజ్, మల్లేష్ చారి, దొమ్మటి కిరణ్ కుమార్ రావు, శేఖర్ గౌడ్, కరీం, అంజయ్య, ధర్మారెడ్డి, జాంబావ్, జోగు శ్రీనివాస్, వెంకటేష్ రెడ్డి, జగన్ యాదవ్, దయానంద్, ఆడెపు శివకుమార్, మంజుల, నారాయణ రాజు, విజయ్ రెడ్డి, జలగం ఉపేందర్ మాదిగ, కీర్తి శ్రీనివాస్, రాజ్ చారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీతో చేసిన సేవలకు గౌరవం

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందితే వారి సేవలను సమాజం ఎప్పటికీ గౌరవిస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన నేనావత్ కబీర్దాసు సన్మాన కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పదవీ విరమణ పొందిన నేనావత్ కబీర్దాసును, ఆయన సతీమణిని శాలువాలతో ఘనంగా సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ సహజమైన ప్రక్రియేనని పేర్కొన్నారు. అయితే ఉద్యోగ జీవితంలో ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం, పారదర్శకంగా, అంకితభావంతో విధులు నిర్వహించడం నిజమైన విజయమని అన్నారు. ప్రభుత్వ సేవలో సంపాదించిన అనుభవం, పరిజ్ఞానం, సామాజిక బాధ్యతను పదవీ విరమణ అనంతరం కూడా ప్రజల సంక్షేమం కోసం వినియోగించాలని సూచించారు. ఉద్యోగ విరమణతో సేవలు ముగిసిపోవని, అది జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది మాత్రమేనని, మిగిలిన జీవితాన్ని ప్రజాసేవకు, సమాజాభివృద్ధికి అంకితం చేస్తే మరింత సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మహంకాళి బోనాల ఉత్సవాలు



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (జనం సాక్షి) :** ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు తెలంగాణ నలుమూలలా అమ్మవారి జాతరలు ప్రారంభమవుతాయి. ఈ సంప్రదాయానికి అనుగుణం ఇబ్రహీంపట్నం లో బీరప్ప గుడి, ఓం శక్తి నగర్ కాలనీ లో మహంకాళి బోనాల ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కాలనీ ఆవిర్భవించిన నాటి నుండి తొలిసారిగా బోనాల ఉత్సవాలు జరగడం విశేషం. ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను దన్నే రాజు ఆధ్వర్యంలోని యువకులు, కాలనీ పెద్దలు సమిష్టిగా తీసుకున్నారు. ఉదయం నుండే కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు కొత్త చీరలు ధరించి, పసుపు, కుంకుమ, పూలతో అందంగా అలంకరించిన బోనాలను తలపై పెట్టుకున్నారు. డప్పుల చప్పుళ్లు, పోతురాజుల వీర నృత్యాలు, కోలాటాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ బోనాల ఉత్సవాలకు మాజీ కౌన్సిలర్ మమత ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, కాలనీలో శాంతి సుభిక్షాలు ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, భాస్కర్ నాయక్, ధనపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, కృష్ణ గౌడ్, మంకాల శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట గిరి తదితర నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. కాలనీ మొత్తం తోరణాలు, రంగవల్లులతో సరికొత్త శోభను సంతరించుకుంది. అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను మమత ఆనంద్ కుమార్ అభినందించారు. రానున్న రోజుల్లో ప్రతి ఏటా ఇంకా ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో కాలనీ అభివృద్ధి చెందాలని భక్తులు మొక్కులు చెల్లించారు.


## ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యం



**చేవెళ్ల, ఆగస్టు 2 (జనంసాక్షి) :** ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తేనే ఉన్నత విద్య పటిష్టమై, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని సాయి చైతన్య హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దుగ్గి గణేష్, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ డీఏలు విడుదల చేసి, పీఆర్సీని అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామ్ శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్యతో పాటు రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రపంచ మానవాళి సుఖసంతోషాలతో జీవించాలి

- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న విశ్వశాంతి మహాయాగం
- చండీ హోమంలో బిజెపి రాష్ట్ర నేత ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి దంపతులు



**ఉర్కొండ, ఆగస్టు 2 (జనం సాక్షి) :** శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగం ను పురస్కరించుకొని కల్వకుర్తి ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. 15 రోజులుగా నిత్య కళ్యాణం పచ్చ తోరణం అన్న రీతిలో హోమాలు యాగాలు కళ్యాణ మహోత్సవాలు వైభవో పేతంగ అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతినిత్యం ఉదయం నుండి రాత్రి వరకు వేదమంత్రోచ్చారణలు మారు మ్రోగాయి. రుత్వికుల వేద ఘోష లో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. వేదమంత్రాలు వారిని భక్తి మార్గంలో ఉండేలా చేశాయి. విశ్వశాంతి మహోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి దంపతులు పాల్గొని చండీ హోమం ఆచరించారు. మొదట యాగ శాల ప్రదక్షణ చేసి యాగం అనంతరం స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలని సంకల్పంతో రైతులు వ్యాపారులు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు బాగుండాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ మహా యాగం సత్ఫలితాలు ఇస్తున్నదన్నారు. మానవసేవే మాధవసేవ అన్నారు. ప్రపంచ మానవాళి మేలు కోసం చేస్తున్న యాగంలో తాము భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. దైవ కృప అందరికీ లభించాలని భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు అని భావించడం ఒక హైందవ ధర్మంలోనే ఉందన్నారు. ఇప్పటి నుండే పిల్లలకు సంప్రదాయాలను, సంస్కృతిని, దైవ భావాన్ని పెంపొందించే కార్యక్రమాలను రూపొందించాలని తాము ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి చెప్పారు. ఉదయం సూర్య హోమం శ్రీరామ హోమం శ్రీ చండీ హోమం శ్రీ సుదర్శన లక్ష్మీనారాయణ రుద్రహోమం సహస్ర కళాశాభిషేకం శ్రీ సీతారామచంద్ర స్వామికి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తులు యాగం కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు పదివేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాగ నిర్వాహకులు జూలూరు రమేష్ బాబు,మాజీ ఎంపీటీసీ కలిమిచర్ల గోపాల్, రాజేందర్ గౌడ్,ఆంజనేయులు, కిరణ్,నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, వేద పండితులు, వివిధ గ్రామాల భక్తులు, భజన బృందం, బిజెపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
03 ఆగస్టు 2026

# ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపు



**నంగునూరు, ఆగస్టు 2 (జనం సాక్షి) :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10న నిర్వహించనున్న దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో సీఐటీయూ అనుబంధాల సదస్సు అనంతరం జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) సంయుక్త పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను నోటిఫై చేసి, కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రోజువారీ పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచే ప్రతిపాదనలు, 'హైర్ అండ్ ఫైర్' విధానాలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలను బలహీనపరిచే చర్యలను తీవ్రంగా ఖండించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా దేశీయ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని చెప్పారు. రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం రుణ విమోచన చట్టాన్ని తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను విరమించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు--2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్ పథకాలను రద్దు చేసే చర్యలను నిలిపివేయాలని కోరారు. ఆహార భద్రతా చట్టం కింద పేదలకు అందిస్తున్న నాణ్యమైన బియ్యంపై కోత విధించే ప్రయత్నాలను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశ స్వాతంత్ర్య సమరంలో కీలకమైన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలందరూ ఏకమై ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో ఉద్యమంలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల కనకయ్య, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు రవీందర్, హమాలీ సంఘం నంగునూరు మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు బాలరాజు, లక్ష్మణ్, సుధాకర్, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం

- నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి



**వెల్దుర్తి, ఆగస్టు 2 (జనం సాక్షి) :** ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు ఆదివారం మండల కేంద్రమైన మాసాయిపేటలో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా రాజిరెడ్డి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాను నియోజకవర్గం ప్రతి మండలంలో హెల్త్ క్యాంపులు నిర్వహించి అర్హులైన నిరుపేదలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సేవలందిస్తానన్నారు రాజన్న ఫౌండేషన్ ద్వారా ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సేవలు అందించడమే తన ముఖ్య లక్షణం అనరు మాసాపేట గ్రామంలో ఉచితంగా ప్రజలకు కళ్ళద్దాలను పంపిణీ చేసిన రాజిరెడ్డిని పలువురు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట సర్పంచ్ల ఫోరం అధక్షుడు కృష్ణారెడ్డి మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఊదండపురం నర్సింలు తోపాటు ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

## వనపర్తి ఎమ్మెల్యేకు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వినతిపత్రం



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) :** వనపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆదివారం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సత్యన్న ఆధ్వర్యంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ, వనపర్తి బస్టాండ్ ఆవరణలో తాము ఉపయోగించుకునే సిమెంట్ కుర్చీలను తొలగించారని, వాటిని తిరిగి అదే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వినతిపత్రంపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో పాటు ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు, కోశాధికారి, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, పలువురు విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ ఆకస్మిక వాహన తనిఖీలు



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 2 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ,ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు శనివారం అర్ధరాత్రి స్వయంగా రంగంలోకి దిగి ఆకస్మిక ర్యాండమ్ వెహికల్ చెకింగ్ నిర్వహించారు. రాత్రి వేళల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల కదలికలపై నిఘా పెట్టడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు జమ్మిచేడు చౌరస్తా, పిల్లిగుండ్ల చౌరస్తా వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు.జిల్లా ఎస్పీ స్వయంగా వాహన తనిఖీల్లో పాల్గొని పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఒక ఆర్ఐ, ఒక ఆర్ఎస్ఐతో పాటు 10 మంది పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందంగా విధులు నిర్వహించారు. రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా జరిగే వివిధ రకాల రవాణాను నియంత్రించడంతో పాటు,అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనుమానాస్పద వాహనాల కదలికలను గుర్తిస్తూ ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నిబంధనలకు విరుద్ధంగా జరిగే రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు.ఈ తనిఖీల్లో భాగంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర వాహన సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉన్నాయా లేదా, వాహన పత్రాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను పరిశీలిస్తూ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.వాహన తనిఖీల సందర్భంగా నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న ఒక కారును గుర్తించి గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు. నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. రాత్రి వేళల్లో కూడా పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, జిల్లాలో నేరాలను అరికట్టేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి వాహన సంబంధిత ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. అర్ధరాత్రి అయినా ప్రజల భద్రత విషయంలో రాజీ లేదనీ, జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ 24 గంటలు అప్రమత్తంగా ఉంటుందని ఈ ఆకస్మిక వాహన తనిఖీలు మరోసారి స్పష్టం చేశాయి.

## బ్రాహ్మణపల్లి - మెదక్ నూతన రైల్వే లైన్‌కు ఎంపీకి వినతి



**కొల్చారం, ఆగస్టు 2 (జనం సాక్షి) :** సికింద్రాబాద్-నిజాంబాద్ రైల్వే మార్గంలోని బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ నుంచి వెల్దుర్తి, కొల్చారం మీదుగా మెదక్ రైల్వే స్టేషన్ వరకు నూతన రైల్వే లింకు లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మెదక్ ఎంపీ మాధవ నేని రఘునందన్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే లింకు లైన్ ఏర్పాటుతో కొల్చారం, వెల్దుర్తి, మెదక్ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలగడంతో పాటు ప్రాంత అభివృద్ధికి ఊతమిస్తుందని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, రైల్వే సాధన సమితి ప్రధాన కార్యదర్శి ఎంఎల్ రెడ్డి, పోతంశెట్టిపల్లి గ్రామ సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలిపిన యువకులు



**వెల్దండ, ఆగస్టు 2 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్ర నుంచి కంటోనిపల్లి బయలుదేరే రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులలో ఆదివారం యువకులు వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సీతక్క స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి సంవత్సరం గడుస్తున్న పనులు ప్రారంభం కాకపోవడంలేదని యువకులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ అంతా బురద మయంగా మారి, నడవడానికి కూడా వీలు లేకుండా అధ్వానంగా మారిందని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లిన పరిష్కరించకపోవడంతో వరి నాట్లు వేసి నిరసన తెలిపామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని ఇదే విషయంపై చరవాణి ద్వార సంప్రదించగా కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు ప్రారంభమయ్యాలా చూస్తానని దాటవేశారని తెలిపారు. ఇప్పటికైనా రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివప్రసాద్, యువకులు తేజ,రాజు,ప్రవీణ్,రాము,శివ,పెద్ది వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## వ్యవసాయం-పశుపోషణపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక శ్రద్ధ



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తూనే వ్యవసాయం, పశు పోషణ రంగాల అభివృద్ధిపైనా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆదివారం ఆయన తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న వ్యవసాయ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన పొలాన్ని పరిశీలించారు. భూసార పరిస్థితులు, సాగుకు అనుకూలత, చేపట్టాల్సిన ఏర్పాట్లపై వ్యవసాయ సిబ్బందితో సమగ్రంగా చర్చించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం తన ఫారంలో పెంచుతున్న ఆవుల వద్దకు వెళ్లి స్వయంగా అరటిపండ్లు తినిపించారు. పశువుల ఆరోగ్య పరిస్థితి, పోషకాహారం, సంరక్షణ విధానాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో ప్రతి పనిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, పశువుల సంరక్షణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశించారు.

## ఆగస్టు 9 - 11 వరకు తూప్రాన్ ఉజ్జయిని మహంకాళి జాతర బ్రహ్మోత్సవాలు


- జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించిన మున్సిపల్ చైర్మన్



**తూప్రాన్, ఆగస్టు 2 (జనం సాక్షి) :** తూప్రాన్ పట్టణంలోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర బ్రహ్మోత్సవాలను ఈనెల ఆగస్టు 9, 10, 11 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజినీ రవీందర్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీ మహంకాళి దేవాలయ ప్రాంగణంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన జాతర సన్నాహక సమావేశంలో ఉత్సవాల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ రజిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, స్వాగత తోరణాలు, చాటింపు దండోరా టమ్ టమ్ వేయించడం, ఆలయానికి రంగులు, అలంకరణ, పులు, పూజా సామాను తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.జాతర కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 9న ఆదివారం బండ్లు--బోనాలు, ఆగస్టు 10న సోమవారం గావు-రంగాలు, ఆగస్టు 11న మంగళవారం బౌరమ్మ పూజతో పాటు ఒగ్గు కథ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి, కౌన్సిలర్లు రామునిగారి స్వప్న నాగరాజు గౌడ్, జ్యోత్స్న వేణు, దుర్గం నగేష్, చెలిమెల రాములు, బైరాం సత్యలింగం, జైపాల్ రాథోడ్ నాయక్, బొడ్డు రాధా శ్రీనివాస్, కుమ్మరి చెలిమెల రాములు, రఘుపతి, మున్సిపల్ సిబ్బంది, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పనిబాటల వారు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

- 22 మంది అరెస్ట్
- రూ.3.52 లక్షల నగదు స్వాధీనం
- నిందితులపై కేసు నమోదు



**నారాయణఖేడ్, ఆగస్టు 2 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహిస్తున్న జూద గృహంపై గత రాత్రి నారాయణఖేడ్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 22 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,52,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో కానిస్టేబుళ్లు హరి, రాహుల్, సంకీర్తన్ రెడ్డి, శ్రీకాంత్, పరమానందం, ప్రవీణ్ పాల్గొన్నారు. నిందితులందరిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నారాయణఖేడ్ ఎస్ఐ తెలిపారు.

# మదినగూడ నుండి సంగారెడ్డి వరకు జాతీయ రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలి

- నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- జిల్లాలో దెబ్బతిన్న రోడ్లన్నీ బాగు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



సంగారెడ్డి, ఆగస్టు 2 (జనం సాక్షి) : జాతీయ రహదారి పనులను వేగంగా మరియు నాణ్యతగా పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి కేకే భవన్ లో సమావేశం నిర్వహించరూ మాట్లాడుతూ రెండు సంవత్సరాలైనా జాతీయ రహదారి పనులు పూర్తి కాకపోవడం దారుణమన అన్నారు. నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విస్తరణ పనులలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన సంగారెడ్డి నుంచి లింగంపల్లి వరకు అనేక చోట్ల ట్రాఫిక్ విపరీతంగా జామవుతుందని అన్నారు.గంటల తరబడి సమయం వృధా అవుతుందని అన్నారు. అలాగే ఈ రోడ్డుపైన రోజు బైకులు, వాహనాలు బోల్తా పడి ప్రమాదాలు జరుగుతున్నాయని చాలామందికి కాళ్లు, చేతులు విరుగుతున్నాయని గాయాల పాలు అవుతున్నారనీ ఆయన అన్నారు. ముందస్తు ప్రాణాలిక లేకుండా, రోడ్డు విస్తరణ పనులు చేయడం ద్వారానే ట్రాఫిక్ జామవుతుందని, గుంతలు తొందరగా పూడ్చకపోవడం వల్లనే వర్షం నీరు జామ అవుతుందని ఆయన అన్నారు. గుంతలలో బైకులు, భారీ వాహనాలు పడుతున్నాయని అన్నారు. వర్షాలు ఎక్కువ వచ్చినప్పుడు వర్షం నీరు రోడ్డు మీదకు రావడం వలన కూడా ట్రాఫిక్ జామ్ అవుతుందని, కనీసం తగిన చర్యలు తీసుకోకపోవడం వలన ఇవి జరుగుతున్నాయని ఆయన అన్నారు. పనులు కూడా చేస్తున్నారని ఆయన విమర్శించారు. మోరీలు నిర్మించితే నెల రోజులు కాకముందుకే ఆ కూలిపోతున్నాయని ఆయన అన్నారు. మ్యాన్ హోల్డ్ సరిగా వేయలేదని ఆయన అన్నారు, సిమెంటు, కంకర ఇసుక తదితర మెటీరియల్ సరిగా వాడట్లేదని అన్నారు. కవలం పేట, గణేష్ గడ్డ, రుద్రారం, ఇస్నాపూర్, ముత్తంగి, పటాన్చెరు, బీరంగూడ అనేక చోట్ల ట్రాఫిక్ జామవుతుందని ఆయన అన్నారు. పేషెంట్లను హైదరాబాద్కు తరలించాలంటే ప్రాణాలు పోతున్న పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి అధికారులు నిద్రపోతున్నారా అని ఆయన ప్రశ్నించారు, పనులు నెమ్మదిగా జరగడానికి కారకులు ఎవరని ఆయన అన్నారు, జిల్లా అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని విస్తరణ పనులు వేగంగా జరిగేటట్టుగా చూడాలని, నాణ్యతగా పనులు జరిగేటట్టుగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాణిక్, నర్సిములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- సిడిసి చైర్మన్ గడిల రాంరెడ్డి



**సదాశివపేట, ఆగస్టు 2 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని సిడిసి చైర్మన్ గడీల రామ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఇందూరి భారతమ్మబాబు, ఉపసర్పంచ్ కుమ్మరి పార్వతమ్మ ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు గడీల రామ్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు పసుల ప్రభు, ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ ఆఫ్రిన్ బేగం, మునీర్, మాజీ ఎంపిటిసి సుజాత, మాజీ వార్డ్ మెంబర్ లు ఇందూరి కృష్ణ, కుమ్మరి చంద్రయ్య, తలారి దేవయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

- విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతుల ఆగ్రహం



**చెన్నారావుపేట, ఆగస్టు 2 (జనంసాక్షి) :** అదనపు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని లింగగిరి గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పై అధిక లోడు పడడం మూలంగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అంతేకాక వ్యవసాయ బావులకు సంబంధించిన విద్యుత్ మోటర్లు నడవడంలేదని దీంతో తమ పంటలకు సాగునీళ్లు పెట్టుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా విద్యుత్ శాఖ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు స్పందించి అదనపు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూసి పంటలకు సాగునీళ్లు అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మెడబోయిన కుమార్, మాదారపు శ్రీనివాస్, పులి రమేష్, కరిమిళ్ళ విద్యాసాగర్, తొలసాని వెంకటేశ్వరరావు, ఓరుగంటి నరసింహారావు, దొడ్డ కరుణాకర్, కుసుమ మల్లయ్య, దాసరి రమేష్, మామిడి శశిరేఖమ్మ, నాంపల్లి కుమారస్వామి, పులి యాకమ్మ, జక్కుల సాల్మోన్, పులి సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## నదీస్నానానికి వచ్చి అనంత లోకాలకు..



**కాళేశ్వరం, ఆగస్టు 2 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వరం గోదావరి లో స్నానానికి వచ్చిన వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. హన్మకొండ 100 ఫీట్ రోడ్డు పిజెఆర్ గార్డెన్ దగ్గర గల ప్రశాంత్ నగర్ కు చెందిన బొబ్బల శ్రీనివాస్ రెడ్డి 52 సంవత్సరాలు , సుధ భార్యాభర్తలు.వారికి ఒక కొడుకు ఉండగా అక్కడే పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం శ్రీనివాస్ రెడ్డి తన భార్యతో కలిసి స్నానానికి వచ్చాడు.ఆయన భార్య ఒడ్డుపై ఉండగా అతను స్నానం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో అదుపుతప్పి లోతైన నీటిలోకి వెళ్లిపోయాడు. ఇది గమనించి అక్కడే ఉన్న నిట్టూరి మహేశ్, దరిపెల్లి శ్రీకాంత్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నది లోకి దిగి ఆయనను రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే ప్రవాహం వేగంగా ఉండటంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న స్థానికులు, ఇతర భక్తులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. అనంతరం కొంతసేపటి తర్వాత శ్రీనివాస్ రెడ్డి మృతదేహాన్ని గోదావరి నుంచి వెలికితీశారు.స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో త్రివేణి సంగమం వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. పుణ్యస్నానానికి వచ్చిన భక్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 02 ( జనం సాక్షి ) :** చిల్పూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50మంది యువకులు, ముదిరాజ్ కులస్తులు, బిఆర్ఎస్ కార్యకర్తలు చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యం లో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మకొండ కనకదుర్గ కాలనిలోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జక్కుల వీరయ్య, చొక్కం సంపత్, చొక్కం రమేష్, రాజు, నాగరాజు, అజయ్, లింగనబోయిన రమేష్, ఇట్టబోయిన రాజశేఖర్, రాయగిరి సత్యం, పెద్ద వీరయ్య, మోతే రాహుల్, రంజిత్ తో పాటు మరో 30మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని అనడానికి కాంగ్రెస్ పార్టీలోకి జరుగుతున్న చేరికలే నిదర్శన మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, మాజీ ఎంపిపి బొమ్మిశెట్టి బాలరాజు, ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు పశుల వెంకటేశ్వర్లు, కొండాపూర్ గ్రామ ఉప సర్పంచ్, పోరం మండల ఉపాధ్యక్షుడు లింగన బోయిన నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూమిలోకి కుంగిపోయిన వ్యవసాయ బావి



**రేగొండ, (కొత్తపల్లి గోరి) ఆగస్టు 02 (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం సుల్తానుపూర్ గ్రామంలో రైతుకు భారీ నష్టం వాటిల్లింది.గ్రామానికి చెందిన రైతు కొండా చందర్ తనకు ఉన్న 3 ఎకరాల వ్యవసాయ భూమిలో సుమారు 8 సంవత్సరాల క్రితం రూ.15 లక్షల వ్యయంతో స్వంతంగా ఓడల బావిని తవ్వించుకున్నారు. ఈ బావి ద్వారా తన వ్యవసాయ అవసరాలను తీర్చుకుంటూ జీవనం సాగిస్తున్నారు.అయితే ఆదివారం తెల్లవారుజామున పొలంలో దున్నే పనుల కోసం మోటార్ ఏర్పాటు చేయడానికి వెళ్లిన సమయంలో, ఓడల బావి ఉన్న ప్రదేశం ఒక్కసారిగా భూమిలోకి కుంగిపోవడంతో బావి పూర్తిగా కనిపించకుండా పోయింది. ఈ ఘటనతో రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టి నిర్మించుకున్న బావి క్షణాల్లో భూమిలో కలిసిపోవడంతో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం తరపున తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని రైతు కొండా చందర్ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## 1950 నంబరు ద్వారా ఓటు నమోదు వివరాలు

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 02(జనంసాక్షి) :** ఓటు హక్కు నమోదును 1950 నంబర్ కు మెసేజ చేయడం ద్వారా ఓటు నమోదు వివరాలు తెలుసుకోవడం ఇప్పుడు చాలా సులభమని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ప్రతి ఓటరు తమ ఎన్నికల గుర్తింపు కార్డు (ఎపిక్) నంబర్‌ను టైప్ చేసి 1950 నంబర్‌కు ఎస్ఎంఎస్ చేయడం ద్వారా తమ ఓటు వివరాలను మొబైల్ ఫోన్‌కు సందేశం రూపంలో పొందవచ్చని వివరించారు. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకుని తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని, అవసరమైతే సవరణలు, నమోదు ప్రక్రియలను సమయానికి పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు ఓటు హక్కు విలువను గుర్తించి తప్పనిసరిగా వినియోగించు కోవాలని ఆయన కోరారు.

# మూడు ముక్కలాటగా 'వెంకటేశ్వర్లపల్లి'

- పోలీస్ స్టేషన్ పరకాల.. రెవిన్యూ నడికూడ.. మండల పరిషత్ కమలాపూర్




**నడికుడ, ఆగస్టు 2 (జనంసాక్షి) :** పరకాల అసెంబ్లీ ఎన్నికలలో ఎవరు పోటీలో నిలబడిన ఆ గ్రామం నుండి ప్రచారం ప్రారంభిస్తే గెలుపు ఖాయమని చెప్పుకునే వెంకటేశ్వర్ల పల్లి గ్రామం మూడుముక్కలాటగా మారింది. గ్రామానికి ఎలాంటి పనులు కావాలన్నా ప్రజలకు ఎలాంటి అవసరం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్న ఆగమ్య గోచరంగా ఏ మండలానికి వెళ్లిన ఒక్క పని మాత్రమే చేసుకుని తిరిగి రావాల్సి వస్తున్నదని మిగిలిన పనులన్నీ పెండింగ్లో ఉంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ గ్రామం నడికుడ మండలమ కమలాపురం మండలం అని ఎలా చెప్పుకోవాలో అనే దుస్థితిలో గ్రామ ప్రజలు ఉన్నారు. గ్రామంలో ఎలాంటి తగాదాలు జరిగిన నేరాలు జరిగిన పోలీస్ స్టేషన్ పరకాలకు వెళ్లవలసి వస్తున్నది. వెంకటేశ్వర్ల పల్లి గ్రామం పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో గలదు అదేవిధంగా రెవిన్యూ తహసిల్దార్ మరియు వివిజి రాంజీ (ఉపాధి హామీ) పథకం ఆసరా పెన్షన్ వింగ్ నడికుడ మండలంలో కాదు ఈ మూడు పనులకు నడికుడ మండల కేంద్రానికి వెళ్లవలసి వస్తున్నది అదేవిధంగా కమలాపూర్ మండలంలో నడుస్తున్నటువంటి శాఖలు, మండల పరిషత్, గ్రామపంచాయతీ పాలన, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పిటిసి, ఆర్ అండ్ బి శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, మిషన్ భగీరథ, మండల విద్యాశాఖ, ఎస్టిఓ, మహిళ శిశు సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ, పశు వైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లాంటి కార్యాలయాల పనులకు కమలాపూర్ మండలం వెళ్లి పనులు చేసుకోవాల్సి వస్తున్నది. ఈ మూడు ముక్కలైన వెంకటేశ్వర్ల పల్లి గ్రామాన్ని ఒకటిగా చేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేలా స్థానిక ఎమ్మెల్యే జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు

## ఆలయాల్లో హైకోర్టు జడ్జి నందా పూజలు





**స్టేషన్ ఘన్‌పూర్ /పాలకుర్తి, ఆగస్టు 02 (జనంసాక్షి) :** ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం హైకోర్టు జడ్జి నందా లీగల్ సెల్ కమిటీ ప్రారంభోత్సవం,ఈసేవ కేంద్రం ప్రారంభించ డం జరిగింది . ఈ సందర్భంగా కోర్టుకి ఎదురుగా ఉన్నటువంటి శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానం హైకోర్టు జడ్జి నంద సందర్శిం చారు. చిల్పూర్ దేవస్థాన ప్రధాన అర్చకుడు బ్రాహ్మణ పెల్లి రవీంద ర్ శర్మ,ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జి సూరపల్లి నందా కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, జడ్జీలు శివ లీల, సందీప, శశి, శ్రీదేవితో తిరుమలనాథ స్వామి దేవాల య చైర్మన్ నీల నరసింహులు, ఈవో వంశీ, మున్సిపాల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజ్,స్టేషన్ గన్పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్, నరేందర్ సంపత్ రాజ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సోమేశ్వరాలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరపల్లి నంద కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు. నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి దేవస్థానం అధికారులు. అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి పూజలు. అభిషేకాలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలికి న్యాయ మూర్తిని శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ నర్సయ్య, ఈవో లక్ష్మీప్రసన్న, ఎస్సై పవన్ కుమార్, ఆలయ సిబ్బంది, అర్చకులు డీ.వీ.అర్ శర్మ, అనిల్, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.85 కోట్లతో బీటీ రోడ్డు పనులు

- తీరనున్న ఫకీర్ నాయక్ తాండవాసుల కష్టాలు



**కుబీర్, ఆగస్టు 2 (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని ఫకీర్ నాయక్ తాండ, సిర్పెల్లి గ్రామాల మధ్య ఎట్టకేలకు రోడ్డు కష్టాలు తీరబోతున్నాయి. రూ.2.85 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం అత్యంత వేగంగా సాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై నిత్యం ప్రయాణం నరకప్రాయంగా సాగేది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లాలన్నా, తాండ నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా సాగించాలన్నా గ్రామస్థులు, వాహనదారులు నానా అవస్థలు పడేవారు. ఈ సమస్యపై స్థానిక సర్పంచ్ క్రాంతిరాజ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ సహకారంతో ప్రభుత్వానికి నివేదించి, రూ.2.85 కోట్ల నిధులను మంజూరు చేయించారు. నిధులు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ఫకీర్ నాయక్ తాండతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ప్రయాణ కష్టాలు శాశ్వతంగా తీరిపోనున్నాయి. తమ ఏళ్లనాటి రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన సర్పంచ్ క్రాంతిరాజ్, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు తాండ ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఈ రోడ్డుపై ప్రయాణం నిత్య నరకం

- రోడ్డు మంజూరై 6నెలలు గడిచినా ప్రారంభంకాని పనులు.
- ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి



**కెరమెరి, ఆగస్టు2 (జనంసాక్షి) :** కెరమెరి మండలంలోని అనార్పల్లి గ్రామం నుంచి కరంజీవాడ, బోరిలాల్ గూడ వెళ్లే ప్రధాన బీటీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుపై గుంతలు,బురదతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డు దాదాపు 3 కి.మీ మేర పూర్తిగా దెబ్బతింది.ద్విచక్ర వాహనాలు జారిపడుతుండగా, ఆటోలు, ఇతర వాహనాలు తరచుగా పంచర్లు అవుతున్నాయి. ముఖ్యంగా కరంజీవాడ, బోరిలాల్ గూడ, జనకాపూర్ తో పాటు చుట్టుపక్కల 5 గ్రామాల ప్రజలు ఈ రోడ్డునే నమ్ముకుని ఆసుపత్రి, మార్కెట్ కు వెళు ంటారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలంటే గుంతల రహదారితో ప్రయాణం నరకయాతనగా మారింది. స్థానికుల ప్రకారం ఈ రోడ్డు మరమ్మత్తుకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. పలుమార్లు గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే రోడ్డును పునరుద్ధరించి, శాశ్వత పరిష్కారం చూపాలని కరంజీవాడ, బోరిలాల్ గూడ పంచాయితీ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఆరు నెలల్లో ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

- కాళేశ్వరం ఆలయ చైర్మన్ అవధాని మోహన్‌శర్మ



**కాళేశ్వరం , ఆగస్టు 2 , ( జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ఆరు నెలల్లో భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆలయ చైర్మన్ అవధాని మోహన్ శర్మ తెలిపారు. ఆలయంలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న కూల్చివేత, నిర్మాణ పనులను ఆయన దేవస్థానం కార్యనిర్వహణ అధికారి మహేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ శివరామ్ అండ్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన చైర్మన్ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆలయ ఆధ్యాత్మిక వైభవానికి అనుగుణంగా, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆదిముక్తీశ్వర స్వామి వారి ఆలయం, బాలాలయాన్ని సందర్శించి అక్కడ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. రాబోయే శ్రావణమాసంలో వేలాది మంది భక్తులు దర్శనానికి వచ్చే అవకాశమున్నందున దర్శనం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, పరిశుభ్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.శ్రావణమాసంలో నిర్వహించే అభిషేక పూజలు, కాలసర్ప దోష నివారణ పూజలు, శని పూజలు, ఇతర ప్రత్యేక పూజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకునే విధంగా దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసిందని అవధాని మోహన్ శర్మ పేర్కొన్నారు.

## స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కార్డియాలజీ నిపుణుల సేవలు

**నిర్మల్, ఆగస్ట్ 02, (జనం సాక్షి):** నిర్మల్ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు గుండె సంబంధిత వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. ఏఐఐఎంఎస్ రిషికేష్‌లో కార్డియాలజీ విద్యను అభ్యసించి, విశేష అనుభవం కలిగిన గుండె సంబంధిత వైద్య నిపుణులు త్వరలో నిర్మల్‌లోని స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శశి హార్ట్ కేర్ గా సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా స్వప్న హాస్పిటల్ యాజమాన్యం నాళం శశికాంత్ మాట్లాడుతూ గుండె సంబంధిత పరీక్షలు, చికిత్సలతో పాటు ఆంజియోగ్రామ్, స్టెంట్ అమరిక (ఆంజియోప్లాస్టీ) వంటి అత్యాధునిక వైద్య సేవలు ఆరోగ్యశ్రీ పథకం కింద అందుబాటులో ఉండనున్నాయని, దీంతో నిర్మల్ జిల్లా ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, మన స్వప్న ఆసుపత్రిలోనే నాణ్యమైన గుండె వైద్య సేవలను పొందే అవకాశం కలుగుతుందని పేర్కొంది. ఈ అవకాశాన్ని జిల్లా, చుట్టుపక్క ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి ఎండి నాళం శశికాంత్ తెలియజేశారు.

## రాజకీయాలు వేరు.. స్నేహం బంధం వేరు

- 40 ఏళ్ల స్నేహ బంధానికి నిలువెత్తు నిదర్శనం ఈ నలుగురు



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 2 (జనం సాక్షి) :** ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మార్నేని రవీందర్ రావు, నాగూర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డిల స్నేహం నాలుగు దశాబ్దాలుగా చెక్కుచెదరలేదు. చిన్న వయసు విద్యార్థి దశలో మొదలైన వారి అనుబంధం రాజకీయ భిన్నాభిప్రాయాలు వచ్చినా నిలకడగా కొనసాగుతోంది. ప్రస్తుతం మార్నేని రవీందర్‌రావు కాంగ్రెస్‌లో, మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్‌లో ఉన్నా స్నేహబంధానికి ఎలాంటి గీత పడలేదు. కుటుంబ సమేతంగా విహారయాత్రలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ అనుబంధాన్ని మరింత బలపరు చుకుంటున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాజకీయాలకు అతీతంగా పరస్పర గౌరవం, విశ్వాసంతో సాగుతున్న వీరి స్నేహం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయప డుతున్నారు. 'పదవులు మారొచ్చు.. పార్టీలు మారొచ్చు.. కానీ నిజమైన స్నేహం బంధం మారదు' అనే సందేశాన్ని వారి జీవితం ఆ నలుగురి స్నేహ బంధాన్ని చాటుతుంది.

## నేరడిగొండ కే గ్రామానికి మళ్లీ విద్యుత్ వెలుగు

**సిరికొండ ఆగస్టు 02 (జనం సాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో సిరికొండ మండలం నేరడిగొండ (జి) నేరడిగొండ కే గ్రామాల్లో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మండల ఏఈ ఆదేశాల మేరకు లైన్‌మన్ పెందూర్ రాజేష్ సిబ్బందితో కలిసి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్లను మరమ్మతు చేశారు. అనంతరం గ్రామానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



# భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం

- ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించుకున్న సబ్‌కలెక్టర్
- తెరుచుకుంటున్న ప్రధాన రహదారులతో పాటు జాతీయ రహదారి.
- గోదావరిలో స్నానాలకు భక్తులకు అనుమతి నిరాకరణ
- వరద నీటిముంపులోనే సీతాకుటీరం ప్రారంభమైన ఆర్టీసీ బస్ సర్వీసులు



**భద్రాచలం, ఆగస్టు 2 (జనంసాక్షి) :** భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. 56.7 అడుగుల గరిష్ట నీటిమట్టంకు చేరిన గోదావరి క్రమేపి తగ్గుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు 42 అడుగలకు తగ్గడంతో మూడు ప్రమాద హెచ్చరికలను సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ ఉపసంహరించారు. భద్రాచలం వద్ద శనివారం అర్ధరాత్రి 52.60 అడుగులున్న గోదావరి ఉదయం 5 గంటలకు 49.70 అడుగులకు, 9 గంటలకు 47.20, 11 గంటలకు 46.20, మధ్యాహ్నం ఒంటిగంటకు 44.90, 3 గంటలకు 44 , 5.12కి 42.90 అడుగులకు తగ్గడంతో ప్రమాద హెచ్చరికలు ఉపసంహరించుకున్నారు. సోమవారం సాయంత్రం వరకు గోదావరి సాధారణ స్థితికి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో పాటు మేడిగడ్డ, అన్నారం, ఎస్సారెస్పీ, తుపాకులగూడెం నుంచి నీటి విడుదల లేకపోవడంతో భద్రాచలంవద్ద వరద నీటిమట్టంగా తగ్గుముఖం పడుతోంది. అలాగే తాలిపేరు ప్రాజెక్టు నుంచి సైతం నీటి విడుదలను నిలిపివేసారు. కాగా ఆదివారం మధ్యాహ్నం నుంచి భద్రాచలం నుంచి చర్ల, కూనవరం, చింతూరు, కుక్కునూరు వైపు రాకపోకలు నెమ్మదిగా పునరుద్దరిస్తున్నారు. రోడ్లపై పలు చోట్ల భారీగా బురద పేరుకుపోయింది. దీంతో వాహన చోదకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా భద్రాచలం శివారున మట్టికట్ట వేసి మూసివేసిన విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిని పునరుద్దరించారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ప్రారంభమయ్యాయి. భద్రాచలం డివిజన్‌లోని చర్ల మండలంలో లింగాపురం, కొత్తపల్లి ప్రాంతాలను చుట్టుముట్టిన గోదావరి వరద తీయడంతో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్నాయి. అలాగే దుమ్ముగూడెం మండలం తూరుబాక, గంగోలు, చర్ల మండలం కుదునూరు గ్రామాల వద్ద వద్ద భద్రాచలం-వెంకటాపురం రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు తగ్గిపోవడంతో ఆర్టీసీతో పాటు సాధారణ ప్రయాణీకులను అధికారులు అనుమతించారు. కాగా పర్ణశాలలోని సీతాకుటీరం వద్ద ఇంకా వరద నీరు తొలగలేదు. మరో వైపు భద్రాచలం వద్ద గత మూడు రోజులుగా భక్తులను గోదావరిలో స్నానాలు చేసేందుకు అనుమతించడం లేదు. దీంతో భక్తులు వెనుదిరుగుతున్నారు. అలాగే పిత్రు కర్మలకు వచ్చేవారు కరకట్ట మెట్ల వద్దే పూజలు నిర్వహించి అనంతరం గజ ఈతగాళ్ల అనుమతితో గోదావరిలో వదులుతున్నారు. కరకట్టపైకి సాధారణ ప్రజలను, భక్తులను ఎవరిని అనుమతించడం లేదు. సోమవారం మెట్లపై ఉన్న ఒండ్రుమట్టిని శుభ్రం చేసిన అనంతరం భక్తులను అనుమతించనున్నట్లు తెలుస్తోంది. అలాగే విస్తా కాంప్లెక్సు వద్ద మూసివేసిన స్లూయిస్ నుంచి బాబలి మోటార్ల సహాయంతో పట్టణంలోని మురుగునీటిని కరకట్టపై నుంచి పైపుల ద్వారా ఎత్తిపోస్తున్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఈనెల 31 వరకు 30 పోలీస్ యాక్ట్

- ఎస్పీ డాక్టర్ వినీత్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 2 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలగకుండా ఉండే లా జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31 వరకు భారత పోలీస్ చట్టం-1861లోని సెక్ష న్-30ను అమలు చేస్తు న్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో, ప్రజాహితం దృష్ట్యా ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నా రు. ఈ మేరకు ఆగస్టు 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ముంద స్తు పోలీసు అనుమతి లేకుండా ఎలాంటి రాజకీ య సభలు, ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించ రాదని స్పష్టం చేశారు. అలాగే జిల్లా పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మైక్ లు, లౌడ్‌స్పీకర్లు వినియో గించాలంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు లిఖితపూర్వక అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించా రు. అదేవిధంగా పండుగ లు, సంప్రదాయ వేడుకలు, ఆచారాలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణ కోసం కూడా నిర్వాహకులు ముందస్తుగా సంబంధిత పోలీసు అధికారులకు దరఖాస్తు చేసుకుని అను మతి పొందాలని ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పడాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుం టామని ఎస్పీ హెచ్చరించారు.

# అసైన్డ్ భూముల్లో అక్రమ సామ్రాజ్యం

- మున్సిపల్,రిజిస్ట్రేషన్,విద్యుత్ శాఖల వసూల్ దందా
- అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు..?



**జహీరాబాద్, ఆగస్టు 2 (జనం సాక్షి) :** పేదలకు అండగా ఉండాల్సిన అసైన్డ్ భూములు, ప్రభుత్వ స్థలాలు అక్రమార్కుల పాలువుతున్నాయి. అధికారుల లంచగొండితనంతో నిబంధనలు అటకెక్కాయి. లంచం ఇస్తే చార్మినార్ నైనా రిజిస్టర్ చేస్తారు..అని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. మున్సిపల్, రిజిస్ట్రేషన్, విద్యుత్ శాఖల అధికారులు అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ లక్షల్లో లంచాలు దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసైన్డ్ భూములు విక్రయించడం లేదా వాటిల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా తీవ్ర నేరం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అనుమతులు లేని నిర్మాణాలను అడ్డుకోవాల్సిన మున్సిపల్ యంత్రాంగం ముడుపులు అందుకొని కళ్లు మూసుకుంటోంది. ఈ అక్రమంగా చేపట్టిన ఇళ్లలో మురుకు కాలువలు,నిటి వసతి,రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం,రాబోయే కాలంలో అక్కడి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోనున్నారో అధికారులు గమనించాలి. రంజోల్,పాస్తాపూర్,అల్లీపూర్,చిన్న హైద్రాబాద్ లలోని అసైన్డ్ మెంట్ భూమిలో అనేక ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. ఇలా నిర్మించిన ఇళ్లకు వెళ్ళడానికి నడక దారి కూడా లేదు. నిషేధిత జాబితాలో ఉండే అసైన్డ్ భూములను సైతం భారీ మొత్తంలో లంచాలు తీసుకుని అక్రమంగా రిజిస్టర్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అనుమతి లేని అక్రమ కట్టడాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తున్నారనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. లంచం ముడితే చాలు నిమిషాల్లో విద్యుత్ మీటర్లు ప్రత్యక్షమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ప్రతి పనికి లక్షల్లో రేట్లు ఫిక్స్ చేశారు. నిబంధనలను పాటించే సామాన్యుడికి తిప్పలు తప్పవు కానీ, ముడుపులు చెల్లించే అక్రమార్కులకు మాత్రం రెడ్ కార్పెట్ వేస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఈ వైఖరి వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, భవిష్యత్తులో శాంతిభద్రతల సమస్యలు, పర్యావరణ ముప్పు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులు మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి. అక్రమ నిర్మాణాలకు సహకరించిన మున్సిపల్, రిజిస్ట్రేషన్, విద్యుత్ శాఖల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అసైన్డ్ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేసి, చట్టవిరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరం

- మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 2 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంచుకొండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ బీఆర్‌టీయూ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ఆటో డ్రైవర్లు నిత్యం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ ధరలు, విడిభాగాల ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, ఫైనాన్స్ ఈఎంఐలు, కుటుంబ పోషణ భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వారికి భరోసా కల్పించాల్సిన సమయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అనేక మందికి ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, ఆటో డ్రైవర్ల కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు శాశ్వత సంక్షేమ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రావడానికి ఆటో డ్రైవర్లను ఓట్ల కోసం ఉపయోగించుకుని ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

## రేగా కాంతారావుపై కేసు

- రాజకీయ దుమారం
- తీర్పు వచ్చే వరకు నిజానిజాలు తేలాల్సిందే..



**అశ్వాపురం, ఆగస్టు 2 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మహిళ వేధింపుల ఆరోపణలపై కేసు నమోదు కావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. ఒకవైపు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మాట్లాడుతూ, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావునెబ వస్తున్న ప్రజాదారణ చూసి ఓర్వలేక రేగా కాంతారావుపై రాజకీయ కక్షసాధింపు కోణంలో అసత్య, నిరాధార ఆరోపణలు చేసి సంబంధం లేని కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మాత్రం మహిళలపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, పార్టీ కూడా తగిన నిర్ణయం తీసుకోవాలని రేగా కాంతారావు ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రస్తుతం కేసు నమోదు అయినప్పటికీ, ఆ కేసులోని వాస్తవాలు దర్యాప్తు అనంతరం మాత్రమే వెలుగులోకి వస్తాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పోలీసుల దర్యాప్తు, అనంతరం న్యాయస్థానంలో జరిగే విచారణ ఆధారంగానే ఆరోపణలు నిజమా కాదా అన్నది తేలనుంది అని న్యాయ నిపుణులు చెప్తున్నారు. అయితే కేసు నమోదైన వెంటనే సోషల్ మీడియాలో ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలు పరస్పరం వ్యక్తిగత దూషణలు, తీవ్ర విమర్శలు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. చట్ట ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ముందుగానే ఎవరినైనా దోషిగా లేదా నిర్దోషిగా ప్రకటించడం సరైన పద్ధతి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఉపాధ్యాయుడిగా సేవలందించి, అనంతరం రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రస్తుతం జిల్లా స్థాయి పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న రేగా కాంతారావుపై ఇలాంటి కేసు నమోదు కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న అంశంపైనా ఆసక్తి నెలకొంది.

చట్టం తన పని తాను చేసుకుంటుందని, సాక్ష్యాధారాలు, విచారణ ఆధారంగా న్యాయస్థానం ఇచ్చే తీర్పే అంతిమమని న్యాయవాదులు గుర్తుచేస్తున్నారు. అప్పటివరకు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతూనే ఉండే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నాగార్జునసాగర్-హాలియా రోడ్డు గుంతలమయం

- అధికారులు చూస్తూనే ఉంటారా..?
- తిరుమలగిరి-నాగార్జునసాగర్ రహదారిపై ప్రజల ఆగ్రహం



**తిరుమలగిరి (సాగర్), ఆగస్టు 2 (జనంసాక్షి) :** తిరుమలగిరి సాగర్ మండల కేంద్రం నుంచి నాగార్జునసాగర్-హాలియా హైవే వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ఉన్న పీడబ్ల్యూడీ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రయాణికులకు నరకయాతనగా మారింది. రోడ్డంతా భారీ గుంతలతో దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ గాయాలపాలవుతున్నారు. అత్యవసర సేవల కోసం వెళ్లే అంబులెన్స్‌లు, విద్యార్థులను తీసుకెళ్లే పాఠశాల బస్సులు, ఆటోరిక్షాలు, ఇతర వాహనాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొత్త మండలాల ఏర్పాటు సమయంలో మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలతో అనుసంధానించే ప్రధాన రహదారులను డబుల్ రోడ్లుగా విస్తరిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, తిరుమలగిరి--నాగార్జునసాగర్ రహదారి విస్తరణ నేటికీ అమలుకు నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగానే ఈ దుస్థితి నెలకొన్నదని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తిరుమలగిరి మండల కేంద్రం నుంచి నేతాపురం వరకు సుమారు 13 కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రయాణానికి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించడం అంటే నరకయాతనగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గుంతలైనా పూడ్చి రహదారిని ప్రయాణయోగ్యంగా మార్చాలని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నారు. రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతున్నప్పటికీ రహదారి మరమ్మతులు చేపట్టకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చి ప్రయాణయోగ్యంగా మార్చాలని, అలాగే తిరుమలగిరి--అల్వాల అడ్డరోడ్డు ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే ప్రారంభించాలని ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఆషాడ బోనాల ఉత్సవాలు..



**సంగారెడ్డి, ఆగస్టు 2 (జనం సాక్షి) :** ఆషాడ మాసం సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాలలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని వివిధ వార్డులో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 'ఏం ఆషాఢం పెళ్లి కొడుకా..' అంటూ సరదాగా ఆటపట్టిస్తుంటారు. కానీ ఈ మాసంలో వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు నిర్వహించరు. మైస మ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ తదితర గ్రామదేవతల ఆలయాల్లో బోనాల జాతరలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా అడుగడుగునా బోనాలతో పాటు పోతురాజుల విన్యాసాలు శివసత్తుల పూనకాలతో పాటు స్థానికుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సంగారెడ్డికి చెందిన పోట్టవతిని కుటుంబ సభ్యులు స్రవంతి రాఘవేంద్ర రాణి, విజయలక్ష్మి, అమ్ముడు అమ్మవారి ఆలయం వరకు బోనాలతో వెళ్లి సమర్పించారు.

## వినియోగదారుల నమ్మకాన్ని పొందేలా ఉత్తమ సేవలు



**సూర్యాపేట, ఆగస్టు 2 (జనంసాక్షి) :** వినియోగదారుల నమ్మకాన్ని పొందేలా ఉత్తమ సేవలను అందిస్తామని ఆర్ బీ పవర్ టూల్స్ ఎలక్ట్రికల్ అండ్ హోమ్ నీడ్స్ ప్రొప్రైటర్ ఎస్ కె.రఫీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్బీ పవర్ టూల్స్ ఎలక్ట్రికల్ అండ్ హోమ్ నీడ్స్ షాపును ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వద్ద ఇంటికి కావాల్సిన అన్ని రకాల ఎలక్ట్రికల్,హోమ్ నీడ్స్ లభిస్తాయని తెలిపారు. వివిధ రకాల వస్తువుల సేల్స్, సర్వీస్ తో పాటు స్పేర్ పార్ట్స్ లభిస్తాయని అన్నారు. టైల్స్, గ్రానైట్స్ కు సంబంధించిన కెమికల్, సిమెంట్, క్లీనింగ్ రసాయనాలు, బ్లేడ్స్, బిట్స్ లభిస్తాయని తెలిపారు. సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు తమ సేవలను వినియోగించుకొని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాబా, రఫీ, బొట్టు శీను, మీసాల వెంకన్న, ప్రేమ్ కుమార్,పిట్టల నరసింహ, గ్యార శీను, గ్యార విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లకుంటను మింగేస్తున్న మట్టి మఫియా..!

- మాడుగులపల్లి మండల కేంద్రంలోనే ప్రభుత్వ చెరువుకు గండి!
- రెవెన్యూ అధికారులకు ఫోన్ కొడితే క్షణాల్లో దందారాయుళ్లకు లీక్!
- ప్రతీ ఆదివారం టిప్పర్ల జాతర మామూళ్ల మత్తులో యంత్రాంగం..?

**మాడుగులపల్లి, ఆగస్టు 2 (జనం సాక్షి) :** ప్రభుత్వ భూములు, చెరువులను పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖ కళ్లముందే అక్రమ మట్టి దందా రాజ్యమేలుతోంది. నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ నల్లకుంట చెరువు ను మట్టి మఫియా గుల్ల చేస్తోంది పగటిపూటే జేసీబీలతో చెరువు గుండెలను తవ్వేస్తూ, భారీ టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మండల కేంద్రంలో ఉన్న నల్లకుంట చెరువుకే రక్షణ లేకపోతే ఇక మారుమూల గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు రెవెన్యూ అధికారుల లీకులు... ఫిర్యాదుదారులకు బెదిరింపులు!

ఈ అక్రమ తోలకాలపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి ఫిర్యాదు అందగానే క్షేత్రస్థాయికి వచ్చి అక్రమాలను అడ్డుకోవాల్సిన సదరు రెవెన్యూ అధికారులు క్షణాల వ్యవధిలోనే ఆ వివరాలను అక్రమ మట్టి దందారాయుళ్లకు చేరవేస్తున్నారు. పలానా వ్యక్తి నీపై ఫిర్యాదు చేశాడు అంటూ ఫిర్యాదుదారుల పేర్లు, వివరాలను నేరుగా మట్టి తోలుకునే వ్యక్తులకే కట్టబెడుతున్నారు దీంతో అక్రమార్కులు ఫిర్యాదుదారులకు ఫోన్లు చేసి బెదిరింపులకు గురిచేస్తున్నారు ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని బాధ్యతగా సమాచారమిస్తే దందారాయుళ్లకు ఇన్ఫార్మర్లుగా మారి తమ ప్రాణాల మీదకు తెస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

### ఆదివారం వస్తే ప్రత్యేక దందా... వెనుక ఉన్నది ఎవరు..?

ప్రతి ఆదివారం వచ్చిందంటే చాలు నల్లకుంట చెరువు వద్ద జేసీబీలు, టిప్పర్ల హోరు మొదలవుతోంది. ఆదివారం అధికారులు అందుబాటులో ఉండరనే ధైర్యమో, లేక సెలవు దినం మామూళ్ళు గట్టిగా అందుతున్నాయో తెలియదు గానీ, ట్రిప్పుల కొద్దీ మట్టి సరిహద్దులు దాటుతోంది. ఇంత బహిరంగంగా మట్టి దందా సాగుతున్నా రెవెన్యూ యంత్రాంగం మౌనం వహించడం వెనుక అసలు సూత్రధారులు ఎవరనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి కేవలం మామూళ్ల మత్తులోనే అధికారులు కళ్లు మూసుకున్నారా?



లేక వెనుక ఏవైనా రాజకీయ పెద్ద తలకాయల హస్తం ఉందా? అని మండల ప్రజలు నిలదీస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి మాడుగులపల్లి మండల కేంద్రంలోని నల్లకుంట చెరువులో సాగుతున్న అక్రమ మట్టి తోలకాలపై విచారణ జరిపి, దందారాయుళ్లతో పాటు అక్రమార్కులకు సమాచారం లీక్ చేస్తున్న బాధ్యతరహిత రెవెన్యూ అధికారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పేరుకే దేశీయ ఈవీలు.. విడిభాగాలు చైనావే!



## 66% కీలక భాగాలు దిగుమతులే..

**బ్యాటరీ సెల్స్ నుంచి పవర్ ఎలక్ట్రానిక్స్ వరకు ఆధారపడుతున్న భారత్**

- దేశీయ ఉత్పత్తి పెంచేందుకు కేంద్రం చర్యలు..
- 2030 నాటికి ఆధారపడటం తగ్గే అవకాశం
- ఈవీ మార్కెట్ వేగంగా పెరుగుతున్నా..
- కీలక సాంకేతికతల్లో ఇంకా వెనుకబాటు

**న్యూఢిల్లీ:** దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగం వేగంగా పెరుగుతున్నప్పటికీ, వాటి తయారీలో అవసరమైన కీలక విడిభాగాల కోసం భారత్ ఇప్పటికీ చైనాపైనే అధికంగా ఆధారపడుతోంది. ప్రస్తుతం ఈవీలకు అవసరమైన విడిభాగాల్లో సుమారు 66 శాతం చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా బ్యాటరీ సెల్స్, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల విషయంలో స్వదేశీ తయారీ ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదు.

ఈవీ తయారీ వ్యయంలో 30-40 శాతం బ్యాటరీ సెల్స్‌దే. లిథియం-అయాన్ బ్యాటరీ సెల్స్‌లో సుమారు 75 శాతం చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఆటోమోటివ్ గ్రేడ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్లు దాదాపు పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి. అలాగే ఇన్సులేటెడ్ గేట్ బైపోలార్ ట్రాన్సిస్టర్లు, మాస్‌ఫెట్‌లు, సిలికాన్ కార్బైడ్ పరికరాలతో పాటు 90 శాతానికి పైగా పవర్ సెమీకండక్టర్లు విదేశాల నుంచే వస్తున్నాయి.

దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలతో పాటు అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్స్ తయారీకి ప్రోత్సాహం అందిస్తోంది. 2025లో దేశంలో 22.7 లక్షల ఈవీలు విక్రయమవగా, ఇది గతేడాదితో పోలిస్తే 16.4 శాతం అధికం. అయినప్పటికీ దేశీయంగా బ్యాటరీ సెల్ తయారీ సామర్థ్యం పరిమితంగానే ఉండటంతో, అసెంబ్లింగ్ మాత్రం భారత్‌లో జరుగుతుండగా, సెల్స్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి.

ఛాసిస్, వైరింగ్ హార్నెస్‌లు, బ్యాటరీ ప్యాక్లు, వాహన బాడీల తయారీలో భారత్ పురోగతి సాధించినా, ఈవీ పనితీరు, ధరను నిర్ణయించే కీలక సాంకేతికతలు ఇప్పటికీ చైనా నుంచే వస్తున్నాయి. 2024--25లో భారత్ రూ.715 కోట్ల విలువైన లిథియం-అయాన్ సెల్స్, బ్యాటరీలను ఎగుమతి చేయగా, రూ.41,666 కోట్ల విలువైన బ్యాటరీలు, సెల్స్‌ను దిగుమతి చేసుకుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూ.34,400 కోట్ల జాతీయ కీలక ఖనిజాల మిషన్, అలాగే రూ.7,280 కోట్లతో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల తయారీ కార్యక్రమం ప్రారంభించింది. దేశీయ సెల్ తయారీ, ఖనిజాల శుద్ధి, విడిభాగాల ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే 2028--30 నాటికి చైనాపై ఆధారపడటం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. అయితే కీలక సాంకేతిక రంగాల్లో ఆధారపడటాన్ని 50 శాతం కంటే తక్కువకు తీసుకురావడం 2030--35 మధ్యే సాధ్యమవుతుందని అంచనా వేస్తున్నారు.

## యుద్ధ ఉద్రిక్తతలతో చమురు ధరల కలవరం

*బ్రెంట్ 69-71 డాలర్ల మధ్య.. డబ్ల్యూటీఐ 66-68 డాలర్ల వద్ద కదలిక*

- రష్యా-ఉక్రెయిన్, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల ప్రభావం
- హోర్ముజ్ జలసంధిపై ప్రపంచ మార్కెట్ల నిఘా
- చమురు పెరిగితే భారత్‌కు దిగుమతి భారం మరింత అధికం

**లండన్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో అమెరికా వ్యూహాత్మక చర్యల నేపథ్యంలో అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్లు అప్రమత్తంగా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69--71 డాలర్ల మధ్య, డబ్ల్యూటీఐ 66-68 డాలర్ల మధ్య హెచ్చుతగ్గులు నమోదు చేస్తోంది. సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశాలే ఈ కదలికలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా రోజుకు సుమారు 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరుగుతోంది. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే చమురు ధరలు ఒక్కసారిగా బ్యారెల్‌కు 80-90 డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి దేశమైన భారత్ తన అవసరాల్లో 85 శాతానికి పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్‌కు 10 డాలర్లు ధర పెరిగితే భారత దిగుమతి బిల్లు వేల కోట్ల రూపాయల మేర పెరిగే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు చెబుతున్నాయి. దీని ప్రభావం పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం, రవాణా వ్యయాలు, ద్రవ్యోల్బణంపై పడే అవకాశం ఉంది. అందుకే రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలు, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, అమెరికా విధానాలపై ప్రపంచ మార్కెట్లు నిశితంగా దృష్టి సారించాయి. పరిస్థితులు మరింత ఉద్రిక్తమైతే చమురు ధరల్లో భారీ మార్పులు నమోదయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 63.60 |
| వరంగల్ | ₹ 532 | ₹63.84 |


**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,43,372 | ₹1,42,506 |
| చెన్నై | ₹1,43,822 | ₹1,42,921 |

**వెండి ధరలు (కేజీ)** హైదరాబాద్ ₹2,34,900

## యూరప్‌లో దూసుకెళ్తున్న హ్యుందాయ్-కియా ఈవీలు

- ఆరు నెలల్లోనే 1.31 లక్షల ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు
- 41.8% వృద్ధితో రికార్డు దిశగా కొరియా దిగ్గజాలు
- కియా ఈవీ3 టాప్.. ఇన్‌స్టర్, ఈవీ4 తర్వాతి స్థానాల్లో
- ఈ ఏడాది 2 లక్షల వార్షిక అమ్మకాల మార్కు దాటే అవకాశం



**సియోల్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజాలు హ్యుందాయ్ మోటార్, కియా యూరప్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల్లో దూసుకెళ్తున్నాయి. 2026 తొలి ఆరు నెలల్లో ఈ రెండు సంస్థలు కలిసి 1,31,032 ఈవీలను విక్రయించాయి. గత ఏడాది ఇదే కాలంలో అమ్ముడైన 92,365 యూనిట్లతో పోలిస్తే ఇది 41.8 శాతం వృద్ధి కావడం విశేషం. ఈ కాలంలో కియా ఈవీ3 కాంపాక్ట్ ఎస్‌యూవీ 27,121 యూనిట్ల అమ్మకాలతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత హ్యుందాయ్ ఇన్‌స్టర్ 16,594 యూనిట్లు, కియా ఈవీ4 14,502 యూనిట్లు విక్రయించి వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. యూరప్‌లో ప్రస్తుతం హ్యుందాయ్-కియా కలిసి 14 ఎలక్ట్రిక్ మోడళ్లను విక్రయిస్తున్నాయి.

ప్రస్తుత అమ్మకాల జోరు కొనసాగితే 2014లో యూరోపియన్ ఈవీ మార్కెట్లో అడుగుపెట్టిన తర్వాత తొలిసారిగా ఈ ఏడాది వార్షిక విక్రయాలు 2 లక్షల యూనిట్ల మార్కును దాటే అవకాశం ఉందని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే మే నెల నాటికి యూరప్‌లో ఈ రెండు సంస్థల మొత్తం ఈవీ విక్రయాలు 10 లక్షల యూనిట్ల మైలురాయిని అధిగమించాయి. యూరప్‌లో మార్కెట్ వాటాను మరింత పెంచుకోవడంపై దృష్టి పెట్టిన హ్యుందాయ్ మోటార్ గ్రూప్, మరోవైపు లాటిన్ అమెరికా మార్కెట్‌పైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల బ్రెజిల్‌ను సందర్శించిన ఎగ్జిక్యూటివ్ చైర్ యూసన్ చుంగ్ అక్కడ ఎస్‌యూవీలు, పర్యావరణహిత వాహనాల శ్రేణిని విస్తరించడంతో పాటు హైడ్రోజన్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

## శ్రీలంక జైలులో హింసాత్మక అల్లర్లు

- మహారా జైలులో ఖైదీల మధ్య తీవ్ర ఘర్షణలు
- ఆసుపత్రి, వృత్తి విద్యా కేంద్రం ధ్వంసం
- సైన్యం, కమాండోలను మోహరించిన ప్రభుత్వం
- ఒక ఖైదీ మృతి.. ఆరుగురికి గాయాలు




**కొలంబో, ఆగస్టు 2:** శ్రీలంక రాజధాని కొలంబో సమీపంలోని మహారా జైలులో ఖైదీల మధ్య తీవ్ర అల్లర్లు చోటుచేసుకున్నాయి. రెండు వర్గాల మధ్య ప్రారంభమైన ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో జైలు ఆవరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆగ్రహానికి గురైన ఖైదీలు జైలులోని ఆసుపత్రి, వృత్తి విద్యా కేంద్రాన్ని ధ్వంసం చేయడంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. పరిస్థితి అదుపు తప్పడంతో శ్రీలంక ప్రభుత్వం వందలాది మంది సైనికులు, ప్రత్యేక కమాండో దళాలను జైలుకు తరలించింది. భద్రతా బలగాలు జైలు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అల్లర్లను అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ ఘటనలో ఒక ఖైదీ మరణించగా, ఆరుగురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. అల్లర్లకు దారితీసిన కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. జైలు పరిసరాల్లో భారీ భద్రత ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు శ్రీలంక ప్రభుత్వం వెల్లడించింది.

### పెట్రోల్ విక్రయాలు 9.7% వృద్ధి

*ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, జులైలో నైరుతి రుతుపవనాలు బలహీనపడడంతో పెట్రోల్‌కు డిమాండ్ పెరిగింది. రైతులు, వాహనదారుల వినియోగం అధికం కావడంతో ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ పెట్రోల్ విక్రయాలు గణనీయంగా పెరిగినట్లు పారిశ్రామిక విక్రయాల గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది జులైలో ఈ మూడు సంస్థలు కలిపి 3.14 మిలియన్ టన్నుల పెట్రోల్ విక్రయించగా, ఈ ఏడాది జులైలో అది 3.45 మిలియన్ టన్నులకు చేరింది. ఏడాది వ్యవధిలో విక్రయాలు 9.7 శాతం పెరిగాయి.*

# ఏఐ దెబ్బకు చైనాలో ఉద్యోగ సంక్షోభం

- వుహాన్‌లో రోబోటాక్సీలతో డ్రైవర్ల ఉపాధికి ముప్పు
- వైట్-కాలర్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్న కృత్రిమ మేధ
- గిగ్ ఎకానమీలోకి భారీగా కార్మికుల వలస
- ఉద్యోగ రక్షణపై పెరుగుతున్న ఆందోళనలు



**బీజింగ్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వేగంగా విస్తరిస్తుండటం తో చైనాలో ఉద్యోగ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా వుహాన్‌లో రోబోటాక్సీల విస్తరణతో టాక్సీ డ్రైవర్ల ఉపాధి ప్రమాదంలో పడగా, దేశవ్యాప్తంగా పలు సంస్థలు వైట్-కాలర్ ఉద్యోగుల స్థానంలో ఏఐ ఆధారిత వ్యవ స్థలను ప్రవేశపెడుతున్నాయి. దీంతో ఉద్యోగ భద్రతపై కార్మికుల్లో ఆందోళన పెరుగుతోంది. వుహాన్‌లో డ్రైవర్‌లేని టాక్సీలను ప్రవేశపెట్టడంతో అనేక మంది డ్రైవర్లు ఉపాధి కోల్పోయా రు. అయితే సాంకేతిక లోపాల కారణంగా కొన్ని రోబోటాక్సీలు రోడ్లపై నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలపై దర్యాప్తు చేపట్టిన అధికారులు కొన్ని వాహనాలను తాత్కాలికంగా ఉపసంహరించడంతో కొంతమంది డ్రైవర్లకు తిరిగి ఉపాధి లభించింది.ఏఐ ప్రభావం వైట్-కాలర్ ఉద్యోగులపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. కంటెంట్, డిజైన్, మీడియా, సాఫ్ట్‌వేర్, కార్యాలయ నిర్వహణ వంటి రంగాల్లో ఉద్యోగుల స్థానంలో ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను సంస్థలు వినియోగిస్తున్నాయి. బీజింగ్‌కు చెందిన సినిమాటోగ్రాఫర్ టియాన్ జెమిన్ తన ఆరు సంవత్సరాల అనుభవాన్ని చివరకు ఒక ఏఐ సాఫ్ట్‌వేర్ భర్తీ చేసిందని వాపోయిన ఘటన చైనాలో విస్తృత చర్చకు దారితీసింది. చైనాలో గిగ్ ఎకానమీ వేగంగా విస్తరిస్తోంది. 2019లో 16 కోట్లుగా ఉన్న ఫ్లెక్సిబుల్ ఉద్యోగుల సంఖ్య ఈ ఏడాది 32 కోట్లకు చేరవచ్చని అంచనా. ఇది దేశ కార్మిక శక్తిలో దాదాపు 44 శాతం. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఏఐని దేశ అభివృద్ధికి కీలక శక్తిగా అభివర్ణించినప్పటికీ, ఉద్యోగ నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం నియామక కోటాలు వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే కోల్పోతున్న ఉద్యోగాలను కాపాడేందుకు ఆ చర్యలు ఎంతవరకు సకాలంలో అమలవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.




## అంతరిక్ష స్టాక్‌లపై పెట్టుబడిదారుల చూపు

*రాకెట్లకే కాదు.. ఉపగ్రహాలు, బ్రాడ్‌బ్యాండ్‌తో కొత్త అవకాశాలు*


- గోల్డ్‌మన్ సాక్స్ బాస్కెట్‌కు రెండేళ్లలో 360% రాబడి
- తగ్గుతున్న ప్రయోగ వ్యయాలతో లాభాల అంచనాలు
- అధిక అస్థిరతతో జాగ్రత్త అవసరమంటున్న నిపుణులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 2 (జనంసాక్షి) :** రాకెట్ ప్రయోగాలకు మాత్రమే పరిమితమైన అంతరిక్ష పరిశ్రమ ఇప్పుడు ఉపగ్రహాలు, ఆర్బిటల్ బ్రాడ్‌బ్యాండ్, కమ్యూనికేషన్లు, రక్షణ సేవలు, డేటా ఆధారిత సాంకేతికతల వరకు విస్తరిస్తుండటంతో ఈ రంగంలోని స్టాక్‌లు దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను అందిస్తున్నాయని గోల్డ్‌మన్ సాక్స్ తాజా పరిశోధన నివేదిక వెల్లడించింది. అంతరిక్ష రంగానికి సంబంధించిన కంపెనీలతో రూపొందించిన సంస్థ కస్టమ్ స్పేస్ బాస్కెట్ ఈ ఏడాది జూలై 14 నాటికి 13 శాతం లాభపడగా, అదే కాలంలో ఎస్‌అండ్‌పీ 500 సూచీ 9.8 శాతం మాత్రమే పెరిగింది.

గత రెండేళ్లలో ఈ స్పేస్ బాస్కెట్ 360 శాతానికి పైగా రాబడిని అందించింది. రాకెట్ ప్రయోగాల వ్యయం తగ్గడం, ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవలకు డిమాండ్ పెరగడం, రక్షణ రంగంలో కొత్త ఒప్పందాలు ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నివేదిక పేర్కొంది. శాటిలైట్ ఇమేజింగ్, కనెక్టివిటీ రంగాల్లో పనిచేస్తున్న కొన్ని సంస్థలు వచ్చే ఏడాదికే లాభదాయకంగా మారే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతరిక్ష రంగ విస్తరణతో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్, అధునాతన పదార్థాలు, తయారీ, కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాల సంస్థలకు కూడా కొత్త వ్యాపార అవకాశాలు ఏర్పడనున్నాయని గోల్డ్‌మన్ సాక్స్ పేర్కొంది. స్పేస్‌ఎక్స్ స్టార్‌లింక్ వంటి ఆర్బిటల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు, భవిష్యత్తులో కక్ష్యలో డేటా సెంటర్ల ఏర్పాటు వంటి ప్రాజెక్టులు పెట్టుబడిదారుల ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ఈ రంగంలో పెట్టుబడులు అధిక రిస్క్‌తో కూడుకున్నవేనని నివేదిక హెచ్చరించింది. గోల్డ్‌మన్ సాక్స్ స్పేస్ బాస్కెట్‌లోని స్టాక్‌ల అస్థిరత ఎస్‌అండ్‌పీ 500తో పోలిస్తే దాదాపు ఐదు రెట్లు ఎక్కువగా ఉందని తెలిపింది. దీర్ఘకాలంలో వృద్ధి అవకాశాలు ఉన్నప్పటికీ, పెట్టుబడిదారుల ఉత్సాహం కొన్నిసార్లు వాస్తవ వ్యాపార పనితీరును మించి వెళ్లే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా పెట్టుబడులు పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

## లాభాలతో ముగిసిన మార్కెట్లు..

- ఆదివారం కావడంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ట్రేడింగ్‌కు విరామం
- గత వారంలో సెన్సెక్స్ 2.67%, నిఫ్టీ 2.59% ఎగబాకాయి
- బజాజ్ ఫైనాన్స్ షేరే వారంలో టాప్ గెయినర్



**ముంబయి, ఆగస్టు 2 (జనంసాక్షి) :** ఆదివారం కావడంతో దేశీయ స్టాక్ మార్కెట్లైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో నేడు ట్రేడింగ్ జరగడం లేదు. దీంతో పెట్టుబడిదారులు సోమవారం మార్కెట్ ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు. గత వారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 166 పాయింట్లు పెరిగి 78,094 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 66 పాయింట్లు ఎగసి 24,383 వద్ద ముగిసింది. వారం మొత్తాన్ని పరిశీలిస్తే సెన్సెక్స్ సుమారు 2.67 శాతం, నిఫ్టీ 2.59 శాతం మేర లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ఎంపిక చేసిన రంగాల్లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు బలపడినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. గత వారంలో ప్రధాన లార్జ్‌క్యాప్ షేర్లలో బజాజ్ ఫైనాన్స్ అత్యధిక లాభాలు నమోదు చేసి టాప్ గెయినర్‌గా నిలిచింది. సోమవారం మార్కెట్ ప్రారంభంలో అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడిదారుల ధోరణి, కంపెనీల త్రైమాసిక ఫలితాలు మార్కెట్ దిశను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రమాదాన్ని పసిగట్టి నిల్వలు పెంచుతున్న కంపెనీలు

- ముడిసరుకు ధరల పెరుగుదలకు ముందస్తు వ్యూహం
- దేశీయ డిమాండ్ బలంగా ఉండటంతో నిల్వల పెంపు
- బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, ఐటీ రంగాల మెరుగైన ఫలితాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 2 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో కొనసాగుతు న్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడిసరుకు ధరల పెరుగుదల, సరఫరా గొలుసు అంతరాయాల ముప్పు నేపథ్యంలో భారతీయ కంపెనీలు ముందస్తు జాగ్రత్తగా నిల్వలను పెంచుకుంటున్నాయి. భవిష్యత్తులో సరఫరా సమస్యలు తలెత్తినా ఉత్పత్తి, విక్రయాలపై ప్రభావం పడకుండా చూసుకోవడంతో పాటు దేశీయంగా కొనసాగుతున్న బలమైన డిమాండ్‌ను తీర్చేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు బజాజ్ బ్రోకింగ్ ఆగస్టు నెలవారీ నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత మార్కెట్లో వినియోగదారుల డిమాండ్ స్థిరంగా ఉంది. దీనికి అనుగుణంగా కంపెనీలు ముడిసరుకు, కీలక ఉత్పత్తుల నిల్వలను పెంచుకుంటున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత తీవ్రమైతే లేదా ఎక్కువకాలం కొనసాగితే వస్తువుల ధరలు, రవాణా వ్యయాలు మరింత పెరిగే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది.

2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అన్ని రంగాల్లో ఆదాయ వృద్ధి నమోదైనప్పటికీ, పెరిగిన ముడిసరుకు ధరల కారణంగా లాభాల మార్జిన్లపై ఒత్తిడి కొనసాగుతోందని పేర్కొంది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, క్యాపిటల్ గూడ్స్, మౌలిక సదుపాయాలు, ఎంపిక చేసిన ఐటీ సంస్థలు అంచనాలకు మించి పనితీరు కనబరిచాయని తెలిపింది. ప్రభుత్వ మూలధన వ్యయం, రుణాల వృద్ధి, డేటా సెంటర్ ప్రాజెక్టులు ఈ రంగాలకు ఊతమిచ్చినట్లు వివరించింది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతోందని నివేదిక పేర్కొంది. తొలి త్రైమాసికంలో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి సగటున 5.7 శాతం, సేవల రంగం వృద్ధి 15.3 శాతం నమోదైనట్లు వెల్లడించింది. అలాగే వర్షపాత లోటు తగ్గడంతో ఆహార ద్రవ్యోల్బణంపై ఆందోళనలు కూడా కొంత తగ్గాయని, ఇది ఆర్థిక వ్యవస్థకు అనుకూల సంకేతమని బజాజ్ బ్రోకింగ్ విశ్లేషించింది.

## మాస్కోను కుదిపేసిన బాంబు పేలుడు

- రాజధాని నడిబొడ్డున ఘోర ఘటన
- ముగ్గురు మృతి.. పలువురికి గాయాలు
- పేలుడు వెనుక కారణాలపై దర్యాప్తు
- హైఅలర్ట్‌లో భద్రతా బలగాలు



**మాస్కో, ఆగస్టు 2 (జనంసాక్షి) :** రష్యా రాజధాని మాస్కోలో జరిగిన బాంబు పేలుడు తీవ్ర కలకలం రేపింది. నగరంలోని రద్దీ ప్రాంతంలో సంభవించిన ఈ పేలుడులో ముగ్గురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి సమీపంలోని వాహనాలు, భవనాల అద్దాలు ధ్వంసమవగా, ఘటనాస్థలమంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురైంది. పేలుడు సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని శిథిలాల నుంచి బయటకు తీసి వైద్యం కోసం తరలించారు. మృతుల వివరాలను అధికారులు సేకరిస్తుండగా, బాధితుల కుటుంబాలకు సమాచారం అందిస్తున్నారు.

ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించిన రష్యా దర్యాప్తు సంస్థలు పేలుడు వెనుక ఉగ్రవాద కోణం సహా అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నాయి. పేలుడు పదార్థం స్వభావం, దాన్ని ఎలా అమర్చారు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై నిపుణుల బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయి. ఘటనాస్థలాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్న అధికారులు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పేలుడు అనంతరం మాస్కో నగరంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రధాన కూడళ్లు, మెట్రో స్టేషన్లు, రైల్వే టెర్మినళ్లు, విమానాశ్రయాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు. ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే వరకు దర్యాప్తును వేగవంతం చేసినట్లు రష్యా అధికారులు వెల్లడించారు.

## అమెరికాలో కార్చిచ్చు బీభత్సం

*వాషింగ్టన్ రాష్ట్రంలో 4.5 లక్షల ఎకరాలు బూడిద*

- 2.3 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ఐదు కోట్ల మందిపై ప్రభావం.. రెడ్ ఫ్లాగ్ హెచ్చరికలు

**వాషింగ్టన్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** వాతావరణ మార్పుల ప్రభావంతో అమెరికా, కెనడాల్లో కార్చిచ్చులు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ముఖ్యంగా అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్ర అటవీ ప్రాంతాల్లో చెలరేగిన అగ్నికీలలు విస్తృత విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 4.50 లక్షల ఎకరాల అటవీ భూమి అగ్నికి ఆహుతికాగా, మంటలు సమీప నగరాల వైపు వేగంగా వ్యాపిస్తున్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు దాదాపు నాలుగు వేల మంది అగ్నిమాపక సిబ్బంది నిరంతరం సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. తూర్పు వాషింగ్టన్‌లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో సుమారు 2.30 లక్షల మంది నివాసితులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం మూడు వేల ఎకరాల మేర మంటలు తీవ్రంగా వ్యాపిస్తున్నాయని అధికారులు వెల్లడించారు. బలమైన గాలులు వీయడం వల్ల అగ్నికీలలను అదుపు చేయడం అగ్నిమాపక సిబ్బందికి పెద్ద సవాల్‌గా మారింది. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన మంటలు వేగంగా విస్తరించాయని అధికారులు తెలిపారు. కార్చిచ్చు ప్రభావంతో వాషింగ్టన్ రాష్ట్రంలోని సుమారు నాలుగు వేల ఇళ్లకు ముప్పు పొంచి ఉందని అధికారులు హెచ్చరించారు. స్పోకేన్ ప్రాంతంలో మంటలు మరింత విస్తరిస్తుండటంతో దాదాపు 200 ఇళ్లతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులను ఖాళీ చేయించినట్లు ఆ నగర మేయర్ లిసా బ్రౌన్ వెల్లడించారు. ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. మంటలు మరింత వేగంగా వ్యాపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో తూర్పు వాషింగ్టన్‌తో పాటు పలు ప్రాంతాలకు అమెరికా జాతీయ వాతావరణ కేంద్రం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'రెడ్ ఫ్లాగ్' హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, అగ్ని ప్రమాదాలను మరింత పెంచే చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు అధికారులు సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
3 ఆగస్టు 2026

# మంథనికి రూ.700 కోట్ల కోకాకోలా పరిశ్రమ

## రత్నాపూర్-మేడిపల్లి శివారులో 250 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్

- నేడు కోకాకోలా ప్రతినిధులతో కలిసి స్థలాన్ని పరిశీలించనున్న మంత్రి శ్రీధర్‌బాబు
- భూసేకరణ పూర్తి.. పరిశ్రమల ఏర్పాటుకు వేగం
- పదివేల మందికి ఉపాధి అవకాశాలపై ఆశలు



**రామగిరి, ఆగస్టు 2 (జనంసాక్షి):** మంథని నియోజకవర్గానికి భారీ పరిశ్రమలను తీసుకురావాలన్న లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలక అడుగులు వేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేడిపల్లి శివారులో ఏర్పాటు చేస్తున్న 250 ఎకరాల ఇండస్ట్రియల్ పార్క్‌లో సుమారు రూ.700 కోట్ల పెట్టుబడితో కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. సోమవారం కోకాకోలా కంపెనీ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించనున్నారు.

పరిశ్రమల వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులను ఆకర్షించే దిశగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో అమెరికాలోని కోకాకోలా సంస్థ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు జరిపిన చర్చల ఫలితంగానే ఈ పెట్టుబడి ప్రతిపాదన ముందుకు వచ్చినట్లు సమాచారం. ఇండస్ట్రియల్ పార్క్ కోసం అవసరమైన 250 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ప్రారంభంలో కొంత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ జిల్లా యంత్రాంగం గ్రామస్థులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించింది. ఈ పార్కులో కోకాకోలాతో పాటు ఇతర పరిశ్రమలకు కూడా స్థలాలు కేటాయించే అవకాశం ఉంది.

మంత్రి పర్యటన నేపథ్యంలో ఆదివారం తహసీల్దార్ పర్శంది సుమన్, రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ-పి.వీరావుతో కలిసి ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కూడా ఏర్పాట్లను సమీక్షించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు మంథని ప్రాంత పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురానుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.



### పదివేల మందికి ఉపాధి..!

ఎన్నికల ప్రచారంలో "మంథని యువత వలసలు ఆపి, సొంత ఊళ్లోనే ఉద్యోగాలు ఇస్తా" అని ఇచ్చిన హామీని మంత్రి శ్రీధర్ బాబు నెరవేర్చే పనిలో పడ్డారు. ఈ పార్క్ ద్వారా నిర్మాణ దశలో వెయ్యి మందికి, ఆపరేషనల్ దశలో సుమారు పదివేల మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కోకాకోల ప్లాంట్ రావడంతో స్థానికంగా పండే మామిడి, నారింజ రైతులకు స్థిరమైన మార్కెట్, మంచి ధర లభించనుంది. యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మంథని చరిత్రలో ఇది సువర్ణాధ్యాయమని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# నాలా బ్రిడ్జితో కాలనీవాసుల కష్టాలకు చెక్

## న్యూ షాపూర్‌నగర్‌లో నూతన బ్రిడ్జి ప్రారంభం


- రూ.10 లక్షలతో నిర్మాణానికి స్థానికుల సహకారం
- వర్షాకాల రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారమన్న మాజీ ఎమ్మెల్యే కూన
- ప్రజా అవసరాలకు ప్రాధాన్యమిచ్చే అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్ష

**నిజాంపేట్, ఆగస్టు 2 (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్ న్యూ షాపూర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన నాలా బ్రిడ్జిని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల సహకారం, స్థానిక కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేందర్ గౌడ్ సొంత నిధులతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ బ్రిడ్జి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏళ్ల తరబడి నాలా కారణంగా కాలనీవాసులు, ముఖ్యంగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోయి స్థానిక ప్రజలకు శాశ్వత ఉపశమనం లభించిందన్నారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ప్రజల అవసరాలను గుర్తించి ఇలాంటి అభివృద్ధి పనులు మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సొంత నిధులు వెచ్చించిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేందర్ గౌడ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన రాఘవేందర్ గౌడ్, నాగిళ్ల శ్రీనివాస్, చౌద శ్రీనివాస్, నారాయణ గౌడ్, మక్బుల్, ఫెరోజ్, అలీముద్దీన్, మహమ్మద్ మైన్, అజ్జు పటేల్, ఆరిఫ్, షకీల్, నయీమ్, ఖలీమ్, మోహన్, బాలమణితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# మీరాలం కుంట ఆక్రమణ

## కాలుష్యంపై సుమన్ గౌడ్ ఆగ్రహం: తక్షణ చర్యలకు డిమాండ్






**పోచారం , ఆగస్టు 2 ( జనం సాక్షి ):** పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడలో ఉన్న మీరాలం కుంట ఆక్రమణలు, కాలుష్యంపై స్థానిక నాయకుడు బాలగౌని సుమన్ గౌడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కుంటను అక్రమంగా మట్టితో పూడ్చి వేస్తూనే, సమీపంలోని ది ఆనంద్ హోమ్స్ అపార్ట్‌మెంట్, సంస్కృతి టౌన్‌షిప్ నుంచి వెలువడుతున్న మురుగునీటిని నేరుగా కుంటలోకి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇరిగేషన్ శాఖ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా అధికారులు స్పందించకపోవడం విచారకరమని విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, సహజసిద్ధమైన నీటి వనరు క్రమంగా నాశనమవుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమన్నారు. కుంట ఆక్రమణలు, కాలుష్యాన్ని అరికట్టడంలో అధికారుల వైఫల్యం వెనుక కారణాలు ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీరాలం కుంటలో అక్రమంగా పోసిన మట్టిని వెంటనే తొలగించి, మురుగునీరు కుంటలోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా అభివృద్ధి పనులు నిర్వహించి కుంటను పూర్వ వైభవానికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే స్థానిక ప్రజలతో కలిసి భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సుమన్ గౌడ్ హెచ్చరించారు.

# ఆరు నెలలుగా బురదలోనే బతుకులు

## స్వర్ణగిరి వాసుల ఆగ్రహం

- డ్రైనేజీ పనుల పేరిట తవ్విన రోడ్లు.. అలాగే వదిలివేత
- 30కుపైగా ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు
- బోనాల ముందు రోడ్లు బాగుచేయాలని కాలనీవాసుల డిమాండ్
- పరిష్కారం లేకుంటే జాతీయ రహదారి దిగ్బంధానికి హెచ్చరిక





**ఘట్‌కేసర్/పోచారం, ఆగస్టు 2 (జనంసాక్షి):** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం స్వర్ణగిరి కాలనీలో ఆరు నెలలుగా రోడ్లు దయనీయంగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ పనుల పేరుతో రోడ్లను తవ్విన అధికారులు పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో వర్షాకాలంలో రహదారులన్నీ బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీ, అనంతరం జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చినప్పటికీ కాలనీలో మౌలిక వసతులు మాత్రం మెరుగుపడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ప్రతిరోజూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా కాలనీలోకి రాలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు.

సమస్య పరిష్కారం కోసం ఉప్పల్ జోనల్, ఘట్‌కేసర్ సర్కిల్ అధికారులకు 30కుపైగా ఫిర్యాదులు చేసినా ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయిలో పరిశీలనకు రాలేదని కాలనీవాసులు మండిపడ్డారు. ప్రజావాణిలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో మహిళలు బోనాలతో ఈ బురద రోడ్లపై ఎలా నడవాలని ప్రశ్నించారు. పండుగలోపు యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో స్వర్ణగిరి కాలనీ ప్రజలంతా కలిసి వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధించి భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, సలహాదారు సత్యనారాయణతో పాటు కాలనీవాసులు సాయిరెడ్డి, రాజేందర్, వెంకటేశ్వర్లు, శ్రావణి తదితరులు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్‌పై

# కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధింపు

- ఇబ్రహీంపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ కంబాలపల్లి భరత్ కుమార్
- భద్రత తగ్గించడం దుర్మార్గమైన చర్య



**రంగారెడ్డి, ఆగస్టు 2 (జనంసాక్షి) :** డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు పాల్పడుతుందని ఇబ్రహీంపట్నం మున్సిపల్ ప్రథమ చైర్మన్ కంబాలపల్లి భరత్ కుమార్ అన్నారు. భద్రత, బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి కుంభకోణాలు, అవినీతిపై పోరాటం చేస్తున్నందుకే రాజకీయ కక్ష సాధింపు చేస్తున్నారని విమర్శించారు. దేశానికి, సమాజానికి అంకితభావంతో సేవలందించిన ఒక మాజీ ఐపీఎస్ ఉన్నతాధికారి పట్ల ప్రభుత్వం నియంతృత్వ ధోరణి అవలంభించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకను అణచివేయడం సమంజసం కాదన్నారు. గురుకుల పాఠశాలలను ఎంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, విద్యార్థుల భవిష్యత్తుకు చక్కటి బాటలు వేసిన గొప్ప ఉన్నతాధికారిగా నిలిచారన్నారు. విమర్శలను వాదనతో ఎదుర్కోలేని ప్రభుత్వం భద్రతను తగ్గించడం అధికార అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రశ్నించే గొంతుకులను అణచివేయడం సరికాదన్నారు. ఇలాంటి నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బెదిరింపులతో ఆయన ఆత్మస్థైర్యా న్ని, పోరాట స్ఫూర్తిని తగ్గించలేరని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ కి గతంలో ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని, భద్రతను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పట్నం రుక్కమ్మకు నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

## హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి



**మొయినాబాద్, ఆగస్టు 2, జనంసాక్షి:** మాతృవియోగానికి గురైన పట్నం కుటుంబాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరామర్శించారు. మొయినాబాద్ సమీపంలోని జేపిఎల్ కన్వెన్షన్ లో నిర్వహించిన దశ దినకర్మలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుద్దేళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలతో కలిసి హాజరై రుకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డిని పట్నం సున్నితమ్మును పలకరించారు.

అలాగే కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని, షాబాద్ మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డిని సైతం పలకరించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకర్, మధుసూదన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ గండి విట్టల్, మాజీ ఎమ్మెల్యేలు కే.ఎస్.రత్నం, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఊర పండగ

- వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్
- సామరస్యానికి ప్రతీకగా నిలిచే సంప్రదాయ ఉత్సవాలు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 02: జనం సాక్షి :** నిజామాబాద్ నగరంలో సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఊర పండగ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహక కమిటీ సభ్యులు, ప్రజలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ కూరగాయల మాట్లాడుతూ, ఊర పండగ అనేది కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాకుండా, అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయాలను, ఆచారాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇలాంటి ఉత్సవాలు పరస్పర ప్రేమ, సోదరభావం, సామాజిక సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు.నగర అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మేయర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో జరిగే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతకు మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిటి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మఠం రేవతి, సిటీ జనరల్ సెక్రటరీ స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్వ సమాజ్ కమిటీ సభ్యులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు, పెద్దలు, ఊర పండగ వేడుకలు భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచి నగరంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.



# రేగడిఘనాపూర్‌లో విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

**చేవెళ్ల, ఆగస్టు 02 (జనంసాక్షి) :** వ్యవసాయ పొలం వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఓ యువ రైతు మృతి చెందిన విషాద ఘటన చేవెళ్ల మండలంలోని రేగడిఘనాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన వడ్డే నర్సింలు (32) తనకు ఉన్న ఎకరం అసైన్డ్ భూమితో పాటు గ్రామానికి చెందిన వడ్డే కుమార్ వద్ద రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ స్తంభం కూలిపోవడంతో దానిని సరిచేసే ప్రయత్నంలో విద్యుత్ వైర్లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీకాంత్ వెంటనే నర్సింలును చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య హరిత, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.




# దేశంలో పరిపాలన ప్రమాదకరంగా జరుగుతుంది

## శ్రమను దోపిడీ చేస్తున్నారు : సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## ప్రధాని నరేంద్ర మోడీకి తగిన బుద్ధి చెప్పాలి

**మహేశ్వరం,ఆగస్టు2(జనంసాక్షి):** దేశంలో పరిపాలన ప్రమాదకరంగా జరుగుతుందన్నారు.ప్రధాని నరేంద్ర మోడీకి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం ఇమామ్ గూడ ఎస్ఎస్ ఆర్ కన్వేషన్ హాల్లో ఏఐటీయూసీ నాల్గోవ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తోకిందన్నారు.కార్మిక హక్కులను అణిచివేస్తున్నారన్నారు.అయోధ్య రామాలయంలో దొంగలు పడ్డారన్నారు.ఏఐటీయూసీ దేశంలోనే మొట్టమొదటి సంఘం అన్నారు.రాబోయే రెండేళ్లలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ,అంగన్వాడీ, మధ్యాహ్న,మిషన్ భగీరథ,కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు.ప్రజల మౌలిక సదుపాయాల కోసం పోరాటం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ యూసఫ్,సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు,రామస్వామి,దత్తు నాయక్,శేఖర్ రెడ్డి,చందు యాదవ్,కొమ్మగల్ల రాజు,పబ్బతి లక్ష్మణ్, నర్సింహ రెడ్డి,దేవేందర్ గౌడ్,బ్రహ్మచారి,యాదగిరి, వెంకన్న,శివ, చంద్రశేఖర్, అనిల్,రవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఎల్బీనగర్‌కు అధిక నిధులు

- సీఎం రేవంత్‌రెడ్డి ఎల్బీనగర్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు : మధుయాష్కి గౌడ్



**హయత్ నగర్, ఆగస్టు 2 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అధిక నిధులు మంజూరవుతున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంతో పాటు ఎల్బీనగర్‌కు కూడా ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. సాహెబ్‌నగర్ డివిజన్‌లోని శ్రీనివాస కాలనీలో రూ.81 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మాజీ కార్పొరేటర్లు మొద్దు ద్దు లచ్చిరెడ్డి, లక్ష్మీ ప్రసన్న గౌడ్‌లతో కలిసి ఆదివారం మధుయాష్కి గౌడ్ శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.9 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహెబ్‌నగర్ డివిజన్‌లోని శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇటీవల జోనల్ కమిషనర్‌తో సమావేశమై రోడ్లు, ఇతర అభివృద్ధి పనులపై సమీక్షించినట్లు చెప్పారు. త్వరలో శివారు కాలనీల్లో కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం నిధులను కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించిందని ఆరోపించిన ఆయన.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాత్రం స్థానిక ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేస్తామని, మిగతా సమయంలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సాహెబ్‌నగర్ ప్రాంతంతో తనకు చిన్ననాటి నుంచే అనుబంధం ఉందని, ఇక్కడ ఎంతోమంది స్నేహితులు ఉన్నారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మకుటం సదాశివుడు, డివిజన్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్, పర్వతి గణేష్ రెడ్డి, శ్రీనాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ స్వర్ణ మాధవి, విద్యారెడ్డి, సూర్యనారాయణ, శశికాంత్, నందకిషోర్, శ్రీనివాస కాలనీ అధ్యక్షులు చిత్తరంజన్ తో పాటు వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం

- ప్రభుత్వానికి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ హెచ్చరిక
- జీఓ-25 సవరణ, బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్
- సీపీఎస్ రద్దు, పీఆర్సీ, డీఏల అమలుకు విజ్ఞప్తి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఆగస్టు 2 (జనం సాక్షి) :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ పోరాట కార్యక్రమాలు చేపడతామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా పాలన అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. హేతుబద్ధీకరణకు సంబంధించిన జీఓ-25ను సవరించాలని, డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని, ఆగస్టు 15లోపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో ఏడు శాతం లోపే నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పడం సమంజసం కాదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ-2020) అమలుతో ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. జీఓ-317 బాధితులకు న్యాయం చేయాలని, జీఓ-190ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. అలాగే గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టెట్‌ను సబ్జెక్ట్‌వారీగా నిర్వహించడం, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు సర్వీస్ వెయిటేజ్ కల్పించడం, 2009 విద్యాహక్కు చట్టానికి ముందు నియమితులైన వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని సమావేశం కోరింది. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయడంతో పాటు పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఆరోగ్య పథకం, పెండింగ్ బిల్లుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది.





# కాళేశ్వరం తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక: బీఆర్ఎస్

- కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలు అవగాహన లేమికి నిదర్శనమన్న వినోద్‌కుమార్
- 'కాళేశ్వరం బాట'లో భాగంగా పంప్‌హౌస్‌ల పరిశీలన
- గ్రావిటీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శలు
- ఉత్తర తెలంగాణ జలాశయాలను వెంటనే నింపాలని డిమాండ్

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రులు చేస్తున్న విమర్శలు వాస్తవాలకు విరుద్ధమని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ ప్రాజెక్టును రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన 'కాళేశ్వరం బాట' కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి వినోద్‌కుమార్ కోటిలింగాల వద్ద ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్, అనంతరం మేడారం నంది, రామడుగు గాయత్రి పంప్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నాయకులు గ్రావిటీ వ్యవస్థపై సరైన అవగాహన లేకుండానే ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు 140 మీటర్లు, మేడారం నంది పంప్‌హౌస్ వరకు 230 మీటర్లు, రామడుగు గాయత్రి పంప్‌హౌస్ వరకు 331 మీటర్ల ఎత్తు వ్యత్యాసం ఉందని తెలిపారు. గాయత్రి పంప్‌హౌస్‌లో నీటిని 115 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసిన అనంతరం అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా మిడ్‌మానేరు జలాశయానికి నీరు చేరుతుందని వివరించారు. తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించిన బీఆర్ఎస్ నేతలు, కాళేశ్వరం పంపులను నిరంతరం నడిపి ఉత్తర తెలంగాణలోని జలాశయాలను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

# ఆలయ భూమిలో చెత్త డంపింగ్

- కొందుర్గు లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన భూమిలో అక్రమ డంపింగ్
- నిబంధనలు ఉల్లంఘిస్తూ గంగన్నగూడ పంచాయతీపై ఆరోపణలు
- పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధమంటున్న గ్రామస్థులు, భక్తుల ఆగ్రహం
- విచారణ చేసి చర్యలు తీసుకుంటాం: దేవాదాయ శాఖ ఈఓ




**కొందుర్గు, ఆగస్టు 2 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా కొందుర్గు తూర్పు శివారులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ భూమిలో అక్రమంగా చెత్తను డంపింగ్ చేయడంపై స్థానిక భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన దేవాలయ భూమిని డంపింగ్ యార్డుగా వినియోగించడం, మరో గ్రామపంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను ఇక్కడకు తరలించి వేయడం వివాదాస్పదంగా మారింది. గ్రామస్థుల కథనం ప్రకారం, గంగన్నగూడ గ్రామపంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను కొందుర్గు శివారులోని దేవాలయ భూమిలో వేస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో దుర్వాసన, కాలుష్యం ఏర్పడటంతో పాటు భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి గ్రామపంచాయతీ తన పరిధిలోనే చెత్త నిర్వహణ కోసం డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకోవాలి. మరో గ్రామపంచాయతీ పరిధిలోని భూముల్లో, ముఖ్యంగా దేవాదాయ శాఖకు చెందిన స్థలాల్లో చెత్తను డంపింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే స్పందించి అక్రమ డంపింగ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఈ విషయమై దేవాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్ శర్మను వివరణ కోరగా, ఘటన తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో వెంటనే విచారణ చేపట్టి, ఆలయ భూములను ఆక్రమించడం లేదా అక్రమంగా చెత్త వేయడంలో బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఆటో కార్మికులకు న్యాయం చేయాలి

**సుల్తానాబాద్,ఆగస్టు 02(జనంసాక్షి) :** మండలంలోని, 23 గ్రామాల అధ్యక్షులతో ఆటో జేఏసీ సుల్తాన్ బాద్ మండల సమావేశం జరిగింది.ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్, జేరిపోతుల కుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన ఆటో సంక్షేమ బోర్డు 12 వేల రూ.ను తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశపెట్టనున్న ఫస్ట్ టూ లాస్ట్ ఆర్టీసీ ఆటో అనే కార్యక్రమాన్ని ఉపసంహరించు కోవాలని, ఆటో డ్రైవర్లను మభ్యపెట్టే ఇలాంటి కార్యక్రమాలని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జిల్లా కన్వీనర్ ఎనగందుల నాంపల్లి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల కమిటీ టౌన్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ ఎస్ కే జబ్బర్ రమేష్ సురేష్, స్వామి రమేష్ పాల్గొన్నారు.




## హైదరాబాద్ -బీజాపూర్ రహదారికి కేంద్రం
# పకడ్బందీగా ప్రణాళికలు రూపొందిస్తుంది
### చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**మొయినాబాద్, ఆగస్టు02, జనంసాక్షి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి (హైవే) అభివృద్ధి పనులకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే బీజాపూర్ రోడ్డు విస్తరణ, భూసేకరణ పనులలో తీవ్రమైన జాప్యం జరిగిందని ఎంపీ విమర్శించారు. నిజాం కాలం నాటి రోడ్డు కావడంతో, పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ రహదారి పనులను చేపడుతోందని ఆయన తెలిపారు. రోడ్ల నిర్మాణం ఆధునీకరించడం ద్వారా ప్రయాణాలు సులభం కావడంతో పాటు, భవిష్యత్తులో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకునేలా కేంద్రం పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తోందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యే మేమే తెచ్చాం బీజాపూర్ హైవే రోడ్డు అని సోషల్ మీడియాలలో డప్పు కొట్టుకొని తిరుగుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్రకార్యవర్గసభ్యులు ఎస్ ప్రభాకర్ రెడ్డి ,డా కె.శ్రీశైలం యాదవ్ ,సీనియర్ నాయకులు కె.ప్రకాష్, ఎం.నరిసింహ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేషర్,మండల అధ్యక్షులు డి.చంద్రశేఖర్ రెడ్డి, మనయ్య, మున్సిపల్ అధ్యక్షులు శ్రీకాంత్, సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

**చేవెళ్ల, ఆగస్టు 02 (జనంసాక్షి) :** గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పామెన గేట్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలంలోని గుండాల గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీనివాస్ (35) చేవెళ్ల పట్టణంలోని ఇండియన్ పెట్రోల్ బంక్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, రాత్రి సుమారు 10:15 గంటల సమయంలో పామెన గేట్ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు ప్రమాదాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కుమ్మరి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం ఘటన అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను పరిశీలిస్తూ నిందిత వాహనం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



# బోర్డు తొలగించి ప్రభుత్వ భూమి కబ్జా
### సోషల్ మీడియా ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన



**రాజేంద్రనగర్,ఆగస్టు2(జనంసాక్షి) :** మణికొండ జాగీర్ పంచవటి కాలనీలోని సర్వే నెం.42 ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించి, ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించి రేకుల షెడ్ల ప్రహరీ నిర్మించిన ఘటన సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ భూమికి గతంలో రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, కబ్జాదారులు ఆ బోర్డును తొలగించి అక్రమంగా షెడ్లు నిర్మించారు. ఈ విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు సీతారాం దూళిపాల ఫొటోలతో సాంకేతిక మాధ్యమం ఎక్స్ ద్వారా హైడ్రా, రెవెన్యూ శాఖ, శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్, నార్సింగి మున్సిపల్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గండిపేట్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రభుత్వ భూమిపై నిర్మించిన రేకుల షెడ్లను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా సీతారాం దూళిపాల మాట్లాడుతూ, మణికొండ జాగీర్ పంచవటి కాలనీలోని సర్వే నెం.42 ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆక్రమణలకు అవకాశం ఏర్పడిందన్నారు. అత్యంత విలువైన ఈ భూమికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా అధికారులు స్పందించకపోవడం వల్లే కబ్జాదారులు ప్రభుత్వ భూమిపై నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. చదరపు గజానికి సుమారు రూ.2.5 లక్షల మార్కెట్ విలువ కలిగిన ఈ ప్రభుత్వ భూమిని రక్షించడంలో విఫలమైన అధికారులపై శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ భూమిలో నిర్మాణాలకు ఎవరైనా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు తేలితే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులు మాట్లాడు తూ, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి ఆక్రమణకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా వెంటనే శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని పూర్తిగా రక్షించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ రిక్రూట్‌మెంట్-2026 అభ్యర్థులకు
# బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత కోచింగ్ కల్పించాలి


- తాండూరు బీసీ స్టడీ సెంటర్‌ను వెంటనే పునరాంభించాలి
- ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలి
- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్

**తాండూరు అగస్టు 2(జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ రిక్రూట్‌మెంట్-2026 నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7,437 పోస్టుల భర్తీ చేపట్టడం స్వాగతించదగ్గ పరిణామమని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ ప్రతికా ప్రగటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ, ఖరీదైన ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందే ఆర్థిక స్థోమత చాలామందికి లేదని అన్నారు. అందువల్ల ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత కోచింగ్, నాణ్యమైన స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు మరియు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.గతంలో తాండూరులో బీసీ స్టడీ సెంటర్ ద్వారా అనేక మంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించబడిందని, ఇపుడు ఆ స్టడీ సెంటర్ పూర్తిగా నిర్వీర్యమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తాండూరు బీసీ స్టడీ సెంటర్‌ను పునరాంభించి, పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్ మరియు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా, రిటైర్డ్ పోలీస్ అధికారులు, అనుభవజ్ఞులైన శిక్షకులు, ఫిజికల్ ట్రైనర్లతో కలిసి రాత పరీక్షతో పాటు రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్ తదితర ఫిజికల్ ఈవెంట్లకు ప్రత్యేక ఉచిత శిక్షణ కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.పోలీస్ రిక్రూట్‌మెంట్-2026 నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి, బీసీ స్టడీ సెంటర్లు మరియు బీసీ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి, ఉచిత కోచింగ్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

## విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఊపిరితిత్తుల తరలింపు.. గ్రీన్ ఛానల్ ఏర్పాటు



**శంషాబాద్,ఆగస్టు2(జనంసాక్షి) :** విశాఖపట్నం నుంచి ఇండిగో విమానంలో తీసుకొచ్చిన లైవ్ డోనర్ ఊపిరితిత్తులను అత్యవసరంగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించేందుకు అధికారులు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, శంషాబాద్ నుంచి మినిస్టర్ రోడ్‌లోని కిమ్స్ ఆసుపత్రి వరకు అంబులెన్స్ కు ప్రత్యేక మార్గం కల్పించారు. ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు మార్గమంతా ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ అంబులెన్స్ ఎలాంటి అవాంతరాలు లేకుండా వేగంగా గమ్యస్థానానికి చేరుకునేలా గ్రీన్ ఛానల్ ద్వారా చర్యలు చేపట్టారు.




# జర్నలిస్టుల కోసం నిరంతరం కృషి చేస్తా
### హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హుజురాబాద్, ఆగస్టు 2(జనం సాక్షి) :** హుజురాబాద్ నియోజకవర్గ జర్నలిస్టుల కోసం తాను నిరంతరం కృషి చేస్తానని, తన వంతుగా ఎంతటి పనైనా మీకోసం చేయడానికి సిద్ధంగా ఉన్నానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఆదివారం ఐజేయూ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తున్నానని, ఇందులో భాగంగా జర్నలిస్టులకు మండలాల వారిగా ఇంటి స్థలాలు, ఇతర సంక్షేమ పథకాల అమలులో తాను ఇప్పటికే ఎంతో కృషి చేశానని, ఇకముందు సైతం విలేకరులకు ఏ అవసరం ఉన్న క్షణంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నాడు. హుజురాబాద్ నియోజకవర్గం లోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట, మండలాల విలేకరులకు తన హయాంలో స్థలాలు ఇవ్వడం జరిగిందని, ఈ జాబితాలో చోటు లభించని విలేకరులకు ఇకముందు ఇచ్చే జాబితాలో చోటు కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం తాము అధికార పార్టీలో లేకున్నా మీకోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, అవసరమైతే అధికార పార్టీ మెడలు మంచి అయినా మీకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని అన్నారు. ఐ జె యూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ మాట్లాడుతూ.. తాను జర్నలిస్టుల కు శాఖాపరంగా వచ్చే ఇబ్బందులపై పోరాటం చేయడమే కాకుండా హెల్త్ కార్డులు, అక్రిడియేషన్ కార్డులు, ఇంటి స్థలాలు తదితర విషయాలపై పోరాటం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఐజేయూ జిల్లా శాఖ అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, కోశాధికారి వెంకటేష్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి రవీందర్, హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కాయిత రాములు, జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్, ఉపాధ్యక్షులు ఎండి సుకూర్, ఉపాధ్యక్షులు భరణి కుమార్, సంయుక్త కార్యదర్శి కొండల్ రెడ్డి, తిరుపతి, అధ్యక్షులు శైలేందర్, సంపత్ కుమార్, జిల్లా ఈసీ నెంబర్ సత్యరాజ్, సీనియర్ జర్నలిస్టులు మామిడిరవీందర్ గౌడ్,ఆంజనేయ స్వామి, కోరం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీగా బాల్ రెడ్డి నియామకం

**కొడంగల్, ఆగస్టు 2 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా కొడంగల్ మండలం ఇందనూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బాల్ రెడ్డిని పార్టీ అధిష్ఠానం నియమించింది.ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా సెక్రటరీగా బాధ్యతలు అప్పగించిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, డీసీసీ చైర్మన్ ధరసింగ్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు అండగా నిలిచిన ఇందనూరు గ్రామ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ముఖ్యంగా కరుడుగట్టిన రేవంతన్న అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధే నా లక్ష్యం: బండి సంజయ్

- కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు
- రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- బోనాలు తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక
- భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపు



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి నగర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నగరంలోని 24వ డివిజన్ బ్యాంక్ కాలనీలో రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కిసాన్ నగర్‌లోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ బోనాలు కేవలం జాతర మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, శక్తి, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో జరిగే ఈ ఉత్సవాలు తెలంగాణ ప్రజల విశ్వాసానికి నిదర్శనమని, జానపద కళలు, కుటుంబ బంధాలు, మహిళా శక్తి, గ్రామీణ సంప్రదాయాల పరిరక్షణకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. బోనం అనేది కేవలం కుండలో వండిన అన్నం మాత్రమే కాదని, తల్లిపై బిడ్డకు ఉండే అపారమైన భక్తి, ప్రేమకు చిహ్నమని పేర్కొన్నారు. పోతురాజు నృత్యం వినోదం కోసం కాదని, సమాజాన్ని రక్షించే ధైర్యసాహసాలకు ప్రతీక అని అన్నారు. ఇంతటి విశిష్టత కలిగిన బోనాల ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించి, తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
3 ఆగస్టు 2026

## రూ.10 కోట్లతో ఎన్ఆర్ఐ భవన్ నిర్మాణానికి కృషి

- ఎన్ఆర్ఐలు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్ (జనంసాక్షి) : అమెరికా నుంచి తెలంగాణకు వచ్చే ప్రవాస భారతీయులకు అన్ని సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేలా హైదరాబాద్‌లో రూ.10 కోట్ల వ్యయంతో ఎన్ఆర్ఐ భవన్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. ఈ భవన్ ప్రవాస భారతీయులకు సమన్వయ కేంద్రంగా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. అమెరికాలోని బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల్లో పాల్గొన్న జూపల్లి కృష్ణారావు ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. యువత వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, ఇటువంటి సామాజిక రుగ్మతల నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో ప్రభాత భేరి కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సామాజిక ఉద్యమంలో ప్రవాస భారతీయులు కూడా తమ వంతు సహకారం అందించాలని జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.

తెలంగాణలో అపారమైన పర్యాటక సామర్థ్యం ఉందని, దానిని ప్రపంచానికి పరిచయం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, వారసత్వ కట్టడాలను అమెరికన్ తెలుగు అసోసియేషన్ బృందాలు లేదా ఎన్ఆర్ఐ గ్రూపులు దత్తత తీసుకుని, వాటి అభివృద్ధి, పరిరక్షణ, పునరుద్ధరణకు చేయూత అందించాలని కోరారు. తెలంగాణ పర్యాటక ప్రమోషన్ లో ఎన్ఆర్ఐ భాగస్వాములు కావాలని, అమెరికాలోని మీ మిత్రులు, విదేశీ సహోద్యోగులకు తెలంగాణ పర్యాటక వైభవాన్ని పరిచయం చేసి రాష్ట్ర పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. విద్య, వైద్యం పేరుతో ప్రజలు తమ తాహతుకు మించి కార్పొరేట్ సంస్థల్లో ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వం ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలకు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ కార్పొరేట్ స్థాయిలో సేవలు అందిస్తోందని జూపల్లి కృష్ణారావు చెప్పారు. అమెరికాలోని బాల్టిమోర్‌లో జరుగుతున్న అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్ఆర్ఐ కమిటీ సభ్యులతో ముఖాముఖి సమావేశమయ్యారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసుల (ఎన్ఆర్ఐలు) సమస్యలు, సంక్షేమం, తెలంగాణతో వారి అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విదేశాల్లోని తెలుగు సంఘాలతో సమన్వయం, తెలంగాణలో పెట్టుబడులు, పర్యాటక రంగ అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవాస తెలుగువారితో ప్రభుత్వ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రవాస తెలుగువారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

## మత్స్యశాఖకు రూ.116 కోట్లు విడుదల

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని చెరువుల్లో చేపలు, రొయ్యపిల్లల పెంపకం కోసం ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. ఈ మేరకు మత్స్యశాఖకు రూ.116 కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్' పథకం కింద ఈ నిధులను కేటాయించారు. మత్స్యకారుల జీవనోపాధి, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత చేపలు, రొయ్యపిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తుంది.

# కారంపొడే దిక్కు!

## న్యాల్‌కల్ కస్తూర్బా గురుకులంలో నిర్వాకం






జిల్లా విద్యాశాఖాధికారుల కొరవడిన పర్యవేక్షణ.. ప్రజా ప్రతినిధుల అలసత్వం.. మొక్కుబడిగా స్థానిక విద్య, ప్రత్యేకా అధికారుల పర్యవేక్షణ.. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల నిర్వాహకుల సిబ్బంది నిర్లక్ష్యంతో పలువురు బాలికలకు కారం పొడి, అరకొర టమాట కర్రీయే దిక్కైంది. బాలికలకు నాణ్యత, పోషక విలువలు లేని ఆహారాన్ని అందిస్తున్న.. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ లోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలపై 'జనంసాక్షి' ప్రత్యేక కథనం..

- నాణ్యతలేని కూరగాయలు, పోషకాలు లేని కర్రీలు!
- బాలికలకు అందించే ఆహార విషయంలో అడుగడుగునా నిర్లక్ష్యం
- ఉదయం పెట్టాల్సిన 'మెనూ' వారం రోజులుగా మాయం..!
- నిజాలు చెప్పకోలేక బిక్కుబిక్కుమంటున్న బాలికలు

న్యాల్‌కల్, ఆగస్టు 02 (జనం సాక్షి) :

గురుకులానికి చెందిన బాలికలకు ఉదయం పెట్టాల్సిన "మెను"కు బదులుగా వారం రోజులుగా అన్నం, టమాట, సాంబార్ ను మాత్రమే అందిస్తున్నారు. మెనూ ప్రకారం రోజు వారిగా ఉదయం ఇడ్లీ, పూరి, ఉక్మ, వడ, చెపాతి, తదితర అల్పాహారాన్ని అందించాలి. అయితే జూలై 27 నుండి ఆగస్టు రెండు వరకు వారం రోజులుగా మెనుకు విరుద్ధంగా అందిస్తున్నారు. వాసనతో కూడిన అన్నం, కొద్దిపాటిగా కూరను అందించడంతో బాలికలు పూర్తిగా తినలేక, ఇతరుల ముందు చెప్పుకోలేక బిక్కుబిక్కుమంటున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారంగా చెపాతికి బదులుగా.. నాణ్యత లేని, వాసనతో కూడిన అన్నాన్ని అందించడం, అరకొరగా టమాటా కర్రీ అందించడంతో.. పలువురు బాలికలు.."కారం పొడి" - "పెరుగు"తో సరిపెట్టుకున్నారు. దాదాపు 320 గురు బాలికల ఉండే గురుకులంలో ఆదివారం దాదాపు 220కి పైగా బాలికలు నాణ్యతలేని, పోషక విలువలు లేని ఆరాన్ని స్వీకరించడం దురదృష్టకరం. మెనూ ప్రకారం ప్రతినెల మొదటి ఆదివారం10 కేజీల మటన్ (మేక మాంసం)ఆహారంగా అందించాల్సింది ఉండగా.. కేవలం 8 కేజీల మాంసం తోనే సరిపెట్టుకున్నట్లు ఆరోపణలు వెల్లువడుతున్నాయి. పోషకాలతో కూడిన ఆహారాన్ని, మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో కొనసాగిస్తున్న.. కస్తూర్బా గురుకుల పాఠశాల బాలికలకు నాణ్యత, పోషక విలువలు లేని కూరగాయలు, కర్రీలు అందించడంతో.. బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అరకొర ఆహారంతో సరిపెట్టుకొని ఎవరి ముందు చెప్పుకోలేక బిక్కుబిక్కుమంటున్నారు.




### ఆగస్టు 2న పంపిణీ చేసిన కూరగాయల్లో నాణ్యత లోపించడం దేనికి సంకేతం..?

వివిధ రకాల కూరగాయలను పంపిణీ చేసే సదరు కాంట్రాక్టర్ ఈ నెల ఆగస్టు 2, ఆదివారం ఉదయం దాదాపు రూ:5000కు విలువచేసే వివిధ రకాల కూరగాయలను గురుకులానికి పంపిణీ చేశారు. పంపిణీ చేసిన పలు కూరగాయల్లో నాణ్యత, పోషక విలువలు లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. వారం రోజులుగా అల్పాహారం ఇవ్వకుండా.. కేవలం అన్నం, కర్రీతో కాలం గడిపిన జిల్లా ఉన్నతాధికారులు ఏమాత్రం దృష్టిసారించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందని పలువురు పోషకులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి బాలికలకు నాణ్యత, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని పలువురు పోషకులు కోరుతున్నారు. అయితే ఈ విషయమై జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అమృతను వివరణ అడగగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తామని తెలిపారు.





### జీసిడీఓతో విచారణ చేపడతాం : జిల్లా విద్యాధికారిణి రోహిణి

న్యాల్ కల్ లోని కస్తూర్బా గురుకులంలో నెలకొన్న సమస్యలు, నాణ్యతలేని కూరగాయలు, పోషక విలువలు లేని కర్రీలు, మెనూకు విరుద్ధంగా అల్పాహారాన్ని అందించడం, పారిశుద్ధ్య లోపం, తదితర సమస్యలతో సతమతం అవుతున్న కస్తూర్బా గాంధీ గురుకులాన్ని సంగారెడ్డి జిల్లా జిసిడిఓ సునీత ఖన్నాతో విచారణ చేపట్టాలని ఆదేశించాం.

## ఉర్దూ పాత్రికేయులకు ప్రభుత్వ అండ

- రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ హామీ
- హైదరాబాద్‌లో టీయూడబ్ల్యూజేఎఫ్ వార్షిక అవార్డుల వేడుక



హైదరాబాద్, ఆగస్టు 2 (జనంసాక్షి) : ఉర్దూ పాత్రికేయుల సమస్యల పరిష్కారం, ఉర్దూ జర్నలిజం అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. ఉర్దూ భాష అభివృద్ధికి సంబంధించిన లోపాలను ముఖ్యమంత్రి మరియు సంబంధిత శాఖలతో చర్చించి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ వార్షికోత్సవం మరియు వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాత్రికేయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, సమాజంలో పాత్రికేయులకు ప్రత్యేక స్థానం ఉందని మంత్రి అన్నారు. ప్రభుత్వంపై నిర్మాణాత్మక విమర్శలు మంచి పాలనకు, ప్రజాసేవ మెరుగుపడేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ పాత్రికేయుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నందుకు అభినందించారు. అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలుపుతూ, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన చోట ఉర్దూ పేరుపలకలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### టీయూడబ్ల్యూజేఎఫ్ సేవలను కొనియాడిన మజీద్

టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్ మాట్లాడుతూ ఉర్దూ పాత్రికేయుల సంక్షేమం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, ఉర్దూ మాట్లాడే సమాజంలో ఐక్యత పెంపొందించడం లక్ష్యంగా ఫెడరేషన్ పనిచేస్తోందన్నారు. అవార్డు గ్రహీతలను స్వతంత్ర కమిటీ పారదర్శకంగా ఎంపిక చేస్తుందని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ ప్రముఖ పాత్రికేయులు అబిద్ అలీ ఖాన్, నసీమ్ ఆరిఫీలపై మోనోగ్రాఫ్‌లు ప్రచురించడం ఉర్దూ జర్నలిజం వారసత్వాన్ని కాపాడే గొప్ప కార్యక్రమమని కొనియాడారు.

### అవార్డులు, సన్మానాలు


నవీద్ బిలాల్, హాఫిజ్ ఎం. ఖయ్యూమ్, ఇమ్తియాజ్ ఖాన్, అఫ్జల్ ఖాన్, ఎజాజ్ అహ్మద్ ఖాన్, అబ్దుల్ అహద్ సిద్ధిఖీ, ఆయేషా బతూల్లకు ప్రశంసాపత్రాలు, శాలువాలు, జ్ఞాపికలు, ఒక్కొక్కరికి రూ.10,000 నగదు బహుమతి అందజేశారు. అలాగే సీనియర్ మీడియా ప్రముఖులు అజీజ్ అహ్మద్, ఉమర్ దరాజ్ ఖాన్, డా. ఫజల్ హుస్సేన్ పర్వేజ్, అమర్ దేవులపల్లి, మస్కీన్ అహ్మద్లను వారి విశిష్ట సేవలకు సన్మానించారు. సీనియర్ పాత్రికేయుడు ఉస్మాన్ రషీద్ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌లను ఘనంగా సత్కరించారు. టీయూడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు జిలానీ మాట్లాడుతూ, ఉర్దూ భాష అన్ని వర్గాల ప్రజలదేనని, ఉర్దూ అభివృద్ధికి ముస్లిమేతరులూ విశేష కృషి చేశారని అన్నారు. సీనియర్ పాత్రికేయుడు అమర్ దేవులపల్లి ఉర్దూ భాషపై తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ, తన తండ్రి తరచూ మిర్జా గాలిబ్ కవిత్వాన్ని ఆలపించేవారని గుర్తుచేశారు. వెటరన్ జర్నలిస్టు మస్కీన్ అహ్మద్ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులపై కూడా ఉర్దూ పేరుపలకలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమాన్ని సాజిదా బేగం (సనా) నిర్వహించారు. మహ్మద్ అమ్జద్ అలీ పవిత్ర ఖురాన్ పారాయణం చేయగా, షేక్ రఫియుద్దీన్ ఆసిఫ్ హమ్ద్, నాత్ ఆలపించారు. చివరగా అబ్దుల్ ముక్తదీర్ షర్ఫీ ప్రార్థనతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ చైర్మన్, అధ్యక్షుడు మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి, తెలంగాణ ఉర్దూ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ వి. కృష్ణ తదితర ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని గౌరవప్రదంగా అలంకరించారు.

### ఉర్దూ పరిరక్షణకు ప్రజలు, పాత్రికేయులు ముందుకు రావాలి : మహ్మద్ అలీ షబ్బీర్

ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, తాను 31 ఏళ్ల వయస్సులోనే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర్యానికి ముందు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలోనే ఉన్నత విద్యాభ్యాసం జరిగేదని, మాజీ ముఖ్యమంత్రి ఎం. చెన్నారెడ్డి వంటి ప్రముఖులు కూడా ఉర్దూ మాధ్యమంలోనే విద్యను అభ్యసించారని పేర్కొన్నారు. కొన్ని ప్రభుత్వ సంస్థల్లో ఉర్దూ నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రజలు మరియు పాత్రికేయులు కేవలం విమర్శలు చేయకుండా సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందించాలని సూచించారు. స్పందించని అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) గడువు పొడిగింపును స్వాగతించిన ఆయన, రేషన్ కార్డు కలిగిన అర్హులకు శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అభినందించారు. వివాహ సమయంలో వధువు పేరు ఆధార్ లేదా విద్యా ధ్రువపత్రాల్లో ఉన్న పేరుతో భిన్నంగా నికాహ్‌నామాలో మార్చవద్దని, అలా చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన మరియు పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశముందని సూచించారు.

## రూ.కోట్ల విలువైన ధాన్యం గల్లంతు

- రికార్డుల్లో ఒకలా, గోదాముల్లో మరోలా పరిస్థితి
- పారదర్శకతకు తూట్లు.. అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం మాయం!
- మెదక్ జిల్లాలో తీవ్ర అవకతవకలు



మెదక్ బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి): ప్రభుత్వానికి అప్పగించాల్సిన సివిల్ సప్లైస్ ధాన్యం విషయంలో మెదక్ జిల్లాలో తీవ్ర అవకతవకలు వెలుగుచూస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలించిన ధాన్యంలో భారీ తేడాలు బయటపడుతున్నాయి. రికార్డుల్లో ఉన్న నిల్వలకు, గోదాముల్లో ఉన్న వాస్తవ నిల్వలకు పొంతన లేకపోవడంతో అధికారులు తనిఖీలు చేపట్టగా కోట్ల రూపాయల విలువైన ధాన్యం గల్లంతైనట్లు గుర్తించారు. జిల్లాలో గత మూడు యాసంగి సీజన్లలో సుమారు 1.20 లక్షల టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం అప్పగించారు. అయితే మిల్లుల్లో నిర్వహించిన భౌతిక తనిఖీల్లో గణనీయమైన నిల్వల కొరత బయటపడింది. పలు మిల్లులు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని సమర్పించకుండా ఆలస్యం చేయడమే కాకుండా ధాన్యం నిల్వల వివరాల్లోనూ వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



### రాష్ట్రవ్యాప్తంగా రూ. 154 కోట్లకుపైగా అక్రమాలు

తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగుచూస్తుండటంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టింది. తాజా తనిఖీల్లో రూ.154 కోట్లకు పైగా విలువైన ధాన్యం అక్రమాలు బయటపడినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రభుత్వానికి అందించాల్సిన ధాన్యాన్ని అక్రమంగా మళ్లించిన రైస్ మిల్లర్లపై చర్యలు వేగవంతమవుతున్నాయి.

### మెదక్‌లో రూ.7.17 కోట్ల విలువైన ధాన్యం గల్లంతు

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని సత్యసాయి ఆగ్రో రైస్ ఇండస్ట్రీస్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. రికార్డులకు, క్షేత్రస్థాయి నిల్వలకు పొంతన లేకుండా 3,029 మెట్రిక్ టన్నుల ధాన్యం గల్లంతైనట్లు అధికారులు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.7.17 కోట్లుగా అంచనా వేశారు. నిబంధనలు ఉల్లంఘించిన మిల్లు యాజమాన్యంపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. అలాగే జిల్లాలోని అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ లోని శివసాయి రైస్ మిల్లులో సుమారు రూ.6 కోట్ల విలువైన ధాన్యం అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినప్పటికీ బహిర్గతం చేయలేదు. అంతేకాకుండా జిల్లాలోని మరిన్ని రైస్ మిల్లులో గత యాసంగి సీజన్లో దించిన ధాన్యం గల్లంతైనప్పటికీ రైస్ మిల్లర్లు ఉన్నత స్థాయిలో వత్తిడి తేవడంతో అధికారులు దాగుడుమూతలు ఆడుతున్నారు.

### అధికారుల పాత్రపైనా దర్యాప్తు జరగాలన్న డిమాండ్

ప్రతి నెలా స్టాక్ తనిఖీలు జరగాల్సి ఉండగా అవి నామమాత్రంగా జరిగాయని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణలో తీవ్ర లోపాలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిల్లింగ్ ప్రక్రియ, ధాన్యం కేటాయింపులు, బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయా అనే కోణంలోనూ విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు. సీఎంఆర్ కుంభకోణంలో కేవలం మిల్లర్లనే కాకుండా సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలని ప్రజలు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యం మిల్లుల నుంచి గల్లంతవుతున్నా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించే అధికారులకు తెలియకుండా ఇది ఎలా జరిగిందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

## వైద్య విద్యలో ఉత్తమ విద్యార్థులకు గుర్తింపు

- కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ విద్యార్థులకు అరైజ్ అవార్డులు



హైదరాబాద్ (జనంసాక్షి) : కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్ యూహెచ్ఎస్) 2021 బ్యాచ్ సెకండ్ ప్రొఫెషనల్ పరీక్షల్లో డిస్టింక్షన్ సాధించిన ప్రతిభావంతులైన వైద్య విద్యార్థులను 'అరైజ్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026' పేరిట అరైజ్ నీట్ పీజీ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. విద్యార్థుల నిరంతర కృషి, అంకితభావాన్ని గుర్తిస్తూ వారికి ప్రతిష్టాత్మక జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీకి చెందిన డా. రాయిడి వసుధ చౌదరి, డా. మౌలిక్ జైన్, డా. తాడిశెట్టి ఆకాంక్షలతో పాటు గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థి డా. జె. అపూర్వ రెడ్డి, ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థి డా. వేదాంత్ జైన్‌లు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మెడికల్ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భావి భారత వైద్య రంగానికి నాణ్యమైన సేవలు అందించేలా విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకే ఈ పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ వైద్య విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370